# అభిషేకింపబడిన సంగీతము

## మరియు

# దైవారాధన

గ్రంథకర్త

**నొర్మన్ ఓమ్స్**

అనువాదం

**మెల్కి సెదెక్**

**"అభిషేకింపబడిన సంగీతము మరియు దైవారాధన"**

కాపీరైట్ © అక్టోబర్ 2006 - నొర్మన్ ఓమ్స్

సర్వహక్కులు మావి.

వివరముల కొరకు సంప్రదించండి

**ZION CHRISTIAN PUBLISHERS**

**50-24-12, T.P.T. COLONY, SEETHAMMADHARA,**
**VISAKHAPATNAM - 530 013, INDIA**
**PHONE : 0891-2530183**
**CELL : 99499 39043**

**e-mail : zion.india@gmail.com**
**www.zionasia.org**

# విషయసూచిక

**మొదటి అధ్యాయము**
సంగీతము యొక్క సృష్టి మరియు దాని కలుషితము **5**

**రెండవ అధ్యాయము**
ఆరాధన-అంగీకారయోగ్యమైనది మరియు తిరస్కరించబడినది **13**

**మూడవ అధ్యాయము**
దావీదు ద్వారా సంగీతము పునరుద్ధరింపబడుట **17**

**నాల్గవ అధ్యాయము**
ఆత్మలో ఆరాధించుట ఎలా? **25**

**ఐదవ అధ్యాయము**
సత్యముతో ఆరాధించుట **33**

**ఆరవ అధ్యాయము**
సమతూకముగల సంగీతము మరియు దైవారాధన **45**

**ఏడవ అధ్యాయము**
సంగీత నాయకులు **51**

**ఎనిమిదవ అధ్యాయము**
బీటలను బాగుచేయుట **63**

**తొమ్మిదవ అధ్యాయము**
సీయోనుకు **79**

# మొదటి అధ్యాయము

## సంగీతము యొక్క సృష్టి మరియు దాని కలుషితము
## సంగీతమును దేవుడు ఎందుకు సృష్టించెను.

దేవుడు సమస్తమును సృష్టించినపుడు సంగీతమును కూడా ఆయన సృష్టించెను. ప్రభువు సృష్టించిన మొదటి సంగీత వాయిద్యములే దీనికి సాక్ష్యము. మానవుడు పాడగలడు, ఈలవేయగలడు మరియు చప్పట్లు కొట్టగలడు. ఎందుకనగా వాటికవసరమైన సరియైన పరికరములు దేవుడు మానవునిలోనే పెట్టాడు. పక్షులు మరియు జంతువులు కూడా తమలో పెట్టబడిన సంగీత వాయిద్యములచేత సంగీతమును ఉత్పత్తి చేస్తాయి. ఇది దేవుడు వాటికిచ్చిన తలాంతే. లోకమంతటిని ఆకాశములు మరియు సముద్రముల యందున్న జీవరాసులు సంగీతముతో నింపుచున్నాయి.

సంగీతమును ఒక మాధ్యముగా దేవుడు సృష్టించెను. ఒక చిత్రకళాకారుడు రంగులను కూర్చి ఒక చిత్రము ద్వారా తన వర్తమానమును అందించగలిగే రీతిలోనే సంగీత కళాకారుడు శబ్దముల ద్వారా ఒక గానమును సృష్టించి తన వర్తమానమును అందించగలడు. కాబట్టి ఒక వ్యక్తియొక్క ప్రాణాత్మ దేహములను స్పందించగలుగు శక్తివంతమైన మాధ్యము – **సంగీతము.**

## సంగీతము ఒక ఆధ్యాత్మిక మాధ్యము

దైవసంబంధమైన సంగీతము మన హృదయములో నున్న పరిశుద్ధాత్మను ప్రేరేపించి ఆయన కదలికలను విడుదల చేయగలదు. 1 సమూ 16:23లో దావీదు అభిషిక్తుడై సన్నాయి వాయించినప్పుడు, రాజైన సౌలును వత్తిడి చేస్తున్న దురాత్మ తనను విడిచిపోయెను. సంగీతమనేది పరిశుద్ధాత్మ కృపావరములను కూడా విడుదల చేయుటకు సహాయపడవచ్చును. ఉదాహరణకు ప్రవచనవరము విషయములో ఇది సంభవించవచ్చును (2 రాజు 3:15, 1 సమో10:5, 1 దిన 25:1). సంఘారాధనలో సంగీత వాయిద్యకులు మరియు గాయకుల ద్వారా పరిశుద్ధాత్ముని సంచారము కలిగి అనేకులు స్వస్థతనొందు కొనుట లేక పాపవిముక్తులు కాగల్గుట ఎంతో ఆశీర్వాదకరమైన విషయము.

ఒకానొక సమయములో నేను ఒక గాయకునిగా ఒక భక్తుని సమాధి కార్యక్రమము నందు ఉంటిని. పరలోకమునుగూర్చి మేమొక గేయము పాడుచుండగా అద్భుతమైన అభిషేకము మా అందరిమీదికి దిగివచ్చింది. పరిశుద్ధాత్ముని తరంగములు మా చేతుల ద్వారా ప్రవహించగా గాయకులు అనేకమంది దేవుని మహిమను ఆ స్థలమంతా నిండుకొనుట చూసిరి. దేవుని మహాగొప్ప సన్నిధి అనేకులకు పాప ఒప్పుకోలును ఆ సమయమందు కలిగించింది. అంతట వారు తమ చెవులను మూసుకొని వేదనతో బయటకు పరుగెత్తసాగిరి. అయితే తమలో అనేకులు అక్కడనే ఉండి పరిశుద్ధాత్ముని శక్తిద్వారా రూపాంతరము చెందిరి.

సంగీతమనేది పరిశుద్ధాత్మునికి మాధ్యముగా దేవుడు సృష్టించెను. కాని సాతాను కూడా దానిని వాడుకుంటాడు; ఇతర మతములవారు దురాత్మలను ఆకర్షించుటకు సంగీతమును ప్రయోగిస్తారు. వారి సంగీతము మనుష్యులను దురాత్మ పీడితులు కావడానికి సిద్ధపరుస్తుంది. అంతేగాక హాని కలుగకుండా నిప్పుల మీద నడుచుటకు కూడా వారికి సహాయపడుతుంది. ఇంకనూ దురాత్మల ద్వారా ప్రవచించుటకు కూడా సహాయ పడుతుంది.

మనము నేర్చుకోబోయే అనేక విలువైన పాఠములన్నింటితో మనము గ్రహించవలసిన ప్రాముఖ్యమైన సంగతేమనగా సంగీతము ద్వారా సంఘములోనికి అనేక ఆత్మీయ పోరాటములను శత్రువు ప్రవేశపెట్టగలడు. ఇలాంటి సంఘటన నా స్నేహితుడైన ఒక సేవకుని సంఘములోనుండగా నేను చూసాను. ఆరాధనా కార్యక్రమము ప్రారంభమై కొన్ని పాటలు పాడిన తదుపరి ప్రభువు తన సన్నిధిని మా మధ్యలో ప్రత్యక్ష పరచుకున్నారు. అంతట ఒక క్రొత్త గాయకుడు వేదికమీదికి ఎక్కి ఇతర గాయకులతో పాలు పంచుకొన నారంభించెను. వెంటనే సంగీతము మరియు అక్కడ ఉన్న ఆత్మీయ వాతావరణము మారిపోయింది. ప్రభువు నాకు దర్శన రూపములో ఆ వ్యక్తిద్వారా దురాత్మలు సంఘములోనికి ప్రవేశిస్తున్నవని చూపించారు. ఆ క్రొత్త గాయకుడు పురుష సంయోగియని తనతో కూడా అపవిత్రాత్మలను ఆరాధన మరియు సంఘములోనికి ప్రవేశ పెడుతున్నాడని ప్రభువు నాకు రుజువు చేసారు.

పరిశుద్ధాత్ముడుండగా దురాత్మలు ఒక ఆరాధనా క్రమములోనికి ఎలా ప్రవేశించగలవని మీరనుకొన వచ్చును. యోబు ఒకటవ అధ్యాయమును యోచిస్తే దీనిని తేటగా గ్రహించగలము. పరలోకములో ప్రభువు సన్నిధిలో ఇతర దూతలు నిలిచియుండగా సాతాను తనతోకూడా నిలిచియుండెను. దేవుని సింహాసనము యెదుట సాతాను నిలువ గలిగితే సంఘారాధనలో నిలువగలిగే దురాత్మలు కూడా ఉంటాయని మనము తెలుసుకోగలము.

ఈ సత్యమును ఆది 15:11లో చూస్తాము, "గ్రద్దలు ఆ కళేబరముల మీద వాలినప్పుడు అబ్రాము వాటిని తోలి వేసెను". ఆకాశపక్షులు దురాత్మలకు సూచన. దీని విషయమై ప్రభువు మార్కు 4:15లో కూడా ఉదహరించెను. అబ్రహాము వాటిని తోలివేయవలసి వచ్చెను. అంతట ప్రభువు తన అర్పణను అంగీకరించెను (ఆది 15:9-21). అదే విధముగా ప్రభువుకు మనమర్పించు స్తుతి అర్పణలను పాడు చేయుటకు దురాత్మలు వస్తాయి. వాటిని పారద్రోలే బాధ్యత మనపైనున్నది. అప్పుడు ఆ అర్పణలు కలుషితము చెందక ప్రభువుకి అంగీకారయోగ్యములగును.

సంగీతమనేది బహుశక్తివంతమైన ఆత్మీయ మాధ్యమము. అది మంచికైనా లేక చెడుకైనా కావచ్చును. దేవుని గృహమందు వీటి విషయమై వివేచన అత్యవసరము. అపవాది మన సంఘ ఆరాధనలలోనికి ప్రవేశింపకుండా జాగ్రత్త పడవలసియున్నాము. దైవిక సంబంధమైన సంగీతము మరియు ఆరాధన ఉన్నచోటనే పరిశుద్ధాత్ముడు స్వతంత్రము గా సంచరించి దేవుని రాజ్యము కొరకైన విజయములను కలిగించగలడు.

## సంగీతము మనస్సును ప్రేరేపిస్తుంది

సంగీతము ద్వారా మనస్సును స్పందించగలము. వివిధ రకములైన సంగీతము మన భావోద్రేకములను ప్రభావితము చేస్తాయి. కొన్ని సంతోషమును మరికొన్ని విచారమును ఇంకాకొన్ని నెమ్మదిని మరికొన్ని అల్లరిని కలిగించగలవు. మహాగొప్ప నాయకుడైన నెపోలియన్ తన పరిశోధనలో సంగీతమనేది అతి గొప్ప ప్రభావమును కలిగించేదని పేర్కొనెను. మార్టిన్ లూథర్ ఇలా సెలవిచ్చెను, "దుఃఖించు వారిని ఓదార్చుటకైనను, సంతోషిస్తున్నవారిని భయపించుటకైనను, నిస్పృహచెందిన వారిని ప్రోత్సహించుటకైనను, గర్విష్టులను తగ్గించుటకైనను, ఉద్రేకపరులను నిమ్మళ పరచుటకైనను ద్వేషముతో నిండుకొన్నవారిని నిదానపరచుటకైనను సంగీతము బహుశక్తివంతముగా ప్రయోగపడగలదు.

లూకా 7:32లో ప్రభువు తానే ఇలా సెలవిస్తున్నారు, "సంత వీధులలో కూర్చుండియుండి - మీకు పిల్లన గ్రోవి ఊదితిమి గాని మీరు నాట్యమాడరైతిరి; ప్రలాపించితిమి గాని మీరేడ్వరైతిరి అని యొకనితో ఒకడు చెప్పుకొని పిలుపులాట లాడుకొను పిల్లకాయలను పోలియున్నారు''. బాప్తిస్మమిచ్చు యోహానును ప్రేరేపించుటకు ప్రయత్నించువారు ఇలా అన్నారు. కాబట్టి సంగీతమనేది మనుష్యులను ప్రేరేపించుటకు ప్రయోగపడుతుంది. ప్రచార మాధ్యమము ఒకే పాటను పదే పదే ప్రచారము చేయుట ద్వారా తమ వస్తువులను కొనిపించుటకు ప్రేరేపించగలదు.



అదే విధముగా భక్తిగీతముల ద్వారా ఒక సైనికుని ప్రేరేపించి యుద్ధములో మరణించుటకు సాహసింపచేయగలము.

సంగీతము ద్వారా వినయోగదారులను ప్రేరేపితులను చేయగలమని కొన్ని వ్యాపార సంస్థలు పరిశోధనల ద్వారా కనుకొనిరి. సాయంత్రము నాలుగు గంటల వరకు ఎక్కువ మంది వినియోగదారులు ఉండరు గనుక, ఉన్నవారు ఎక్కువ సమయము గడిపి మరింత కొనుగోలు చేయు నిమిత్తమై నిమ్మళమైన సంగీతమును ప్రయోగపరచుట ఉపయోగకరమని వారు కనుగొనిరి. సాయంత్రము నాలుగు గంటల తర్వాత అనేకులు షాపింగ్ చేయుటకు వస్తారు గనుక వారు త్వరగా తమ పని ముగించుకొని వెళ్ళాలంటే ఉత్తేజకరమైన సంగీతముతో వారిని ప్రేరేపించాలనేది కూడా వారి పరిశోధనలో తెలుసుకొనిరి. సంగీతమనేది వ్యక్తిగతముగానేకాక సామూహికముగా మరియు దేశవ్యాప్తముగా కూడా ప్రభావము కలిగియుండగలదు. 19వ శతాబ్దములో జర్మనీనాయకుడైన బిస్‌మార్కు సంగీతము ద్వారా దేశమును ఏకము చేయగలమని పేర్కొన్నాడు. సైన్యము యొక్క సంఖ్యబలము కాదని దానివెనకున్న ఆత్మద్వారా విజయము సాధ్యపడుతుందని తానన్నాడు. కాబట్టి ధైర్యమును మరియు భక్తిని ప్రేరేపించుశక్తి సంగీతముకున్నదన్న సంగతిని చిన్నచూపు చూడజాలము. గ్రీకు వేదాంతియైన ప్లేటో ఇలా అన్నాడు, 'ఒక దేశము యొక్క సంగీతమును మారిస్తే ఆ దేశమును మార్చగలము'. కన్‌ఫూషియస్ ఏమన్నాడంటే, 'ఒక దేశము యొక్క పరిపాలన మరియు నైతిక విలువలు ఉన్నతమైనవని మీరు చూస్తే మొదట వారు వింటున్న సంగీతమును వినండి'.

## సంగీతము దేహమును ప్రభావితము చేస్తుంది.

సంగీతము దేహమును కూడా ప్రభావితము చేయగలదు. సంగీతము యొక్క శబ్దము, వేగము మరియు తాళము మానవదేహమునందున్న రక్తపోటు, గుండెచప్పుడు, నరముల స్పందన మరియు శ్వాస యొక్క వేగమును నిర్ణయించగలదు. బిగ్గరైన సంగీతము ఒక వ్యక్తి దేహమును ఎలా ప్రభావితము చేస్తుందో చూడగలము. ప్రతి ఒక్కరికీ మూత్రపిండములపైన రెండు చిన్న కణములు ఉంటాయి. అవి అడ్రెనలిన్ అను ఒక సహజ ఔషధమును ఉత్పత్తి చేస్తాయి. ఇది వత్తిడి సమయములలో లేక ఆపద కాలములలో ఆదుకోడానికి కావలసిన ఉత్తేజ ద్రవము. ఇది ఉత్పత్తి చేసినప్పుడు ఒక వ్యక్తి యొక్క ఉత్తేజ స్థాయి ఉన్నతమైన శిఖరముకు వెళుతుంది. ఏదైనా వత్తిడి లేక దాడికి మానవ దేహము లోనైనప్పుడు ఈ పదార్థము ఉత్పత్తి చేయబడుతుంది. అయితే బిగ్గరైన సంగీతము వాయించబడుచుండగా దేహము ఆ ఒత్తిడిని లేక

దాడిని ఎదుర్కొను నిమిత్తము ఆడ్రేనెలిన్‌ను ఉత్పత్తిచేసి పరిస్థితిని ఎదుర్కొనుటకు ఆ వ్యక్తిని సిద్ధపరుస్తుంది. తద్వారా ఆ వ్యక్తి ఉన్నత శిఖరానికి చేరుకున్న స్థితిని స్పర్శిస్తాడు. అయితే ఈ ఉజ్జీవ స్థితి వేరేపదార్థమును బట్టికాక తమ సొంత శరీరము ఉత్పత్తి చేసిన ఆడ్రేనెలిన్ ద్వారానే సంభవిస్తుందని గమనించాలి.

ఒక పాటను వేగము పెంచి జోరుగా పాడితే అది మన రక్తపోటును అధికము చేస్తుంది. అయితే మనుష్యుల ఉత్తేజ స్థాయిని పెంచుటకు గాయకులు మరియు సంగీత బృందనాయకులు ఈ ఉపాయమును ప్రయోగిస్తారు. అయితే సున్నితమైన నెమ్మదైన సంగీతము నరములను మరియు కండరములను నిమ్మళపరుస్తాయి. ఆందోళన మరియు వత్తిడికి లోనైన ప్రజలు సున్నితమైన మరియు నెమ్మదైన సంగీతమును వినుట ద్వారా స్వస్థతను రుచి చూసారని డాక్టర్ సియర్సు తన పరిశోధనలో కనుగొన్నారు. అందుచేతనే జ్ఞానయుక్తమైన దంతవైద్యులు తమ ఆసుపత్రులలో ఓదార్పును కలిగించు నెమ్మదైన సంగీతమును ప్రయోగిస్తారు. నరములు మరియు కండరములు నిమ్మళ పరచబడియుండగ దంతవైద్యులు సులువుగా తమ పనిని చేసుకోగలరు.

సంగీత మనేది ప్రపంచ వ్యాప్తమైన గుర్తింపును పొందుకొంటుంది. డాక్టర్లు, మానసిక వైద్య నిపుణులు సంగీతము ద్వారా తమ యొద్దకొచ్చిన రోగులను స్వస్థపరచగలమని భావిస్తున్నారు. సంగీతము ద్వారా స్వస్థతను చేకూర్చగలుగు నిపుణులు ఆయా దేశములలో ముందుకొస్తున్నారు. మానసిక, భౌతిక మరియు ఆత్మ సంబంధమైన సమస్యలకు సంగీతము పరిష్కారముగానున్నది. మానసిక వేదన, వత్తిడి మరియు తదితర రోగములకు సంగీతము సమాధానమివ్వగలదని నిపుణులు భావిస్తున్నారు.

## సంగీతము - కలుషితము

సంగీతము ఒక శక్తివంతమైన మాధ్యముగా నుండుటకు దేవుడు దానిని సృష్టించెను. లోకము కూడా సంగీతములో నున్న శక్తిని ఎరిగి వినోదము, ప్రచారము మరియు ప్రజలను ప్రభావితము చేయుటకై సంగీతముపైపెద్ద మొత్తములు వ్యయము చేస్తున్నది. అయితే సాతాను కూడా సంగీతమును ఎరిగియున్నవాడు. మానవుడు సృష్టింపబడకముందు దేవదూతలు సంగీత పరిచర్యకొరకు నిర్మించబడిరి.

లూసీఫర్ తన సంగీత సామర్థ్యమునకై పేరునొందిన వాడు. అయితే తన పేరు యొక్క అర్థము 'వెలుగుదూత'. యెహెజ్కేలు 28:13లో లూసీఫర్‌ను గూర్చి



ఇలా వ్రాయబడియున్నది, “దేవుని తోటయగు ఏదెనులో నీవుంటివి, మాణిక్యము, గోమేధికము, సూర్యకాంతమణి, రక్తవర్ణపురాయి, సులిమానిరాయి, మరకతము, నీలము, పద్మరాగము, మాణిక్యము అను అమూల్య రత్నములతోను, బంగారముతోను నీవు అలంకరింపబడి యున్నావు; నీవు నియమింపబడిన దినమున పిల్లన గ్రోవులు వాయించు వారును నీకు సిద్ధమైరి” ఒక వ్యక్తి తనయందు సంగీతవాయిద్యములతో సృష్టింపబడినట్లే దేవదూతయైన లూసీఫర్ తనలో తంబురలు మరియు సితారలతో సృష్టింపబడెను.

లూసీఫర్ కొరకు దేవుడు రూపొందించిన వస్త్రములను బట్టి అతడు దేవదూతల కొరకైన ప్రధాన యాజకుడని గ్రహించగలము (యెహెజ్కేలు 28:13, నిర్గమ 39:10-13). అయితే తానొక ఆరాధన నడిపించు గొప్ప నాయకుడని తెలియబడుతుంది. దీని యొక్క నిర్ధారణ యెహెజ్కేలు 28:14లో కూడా చూడగలము. ప్రకటన గ్రంథము 4 మరియు 5 అధ్యాయములు పఠించినప్పుడు పరసంబంధమైన జీవులు దేవుని సింహాసనము కప్పియుండునని అవి ఆరాధన నడిపించు నాయకులని కనుకొనగలము. దూతలలో లూసీఫర్ ప్రధాన గాన నాయకుడు మరియు సంగీత వాయిద్యకుడు. అంతేగాక పరలోకములో ఆరాధనను నడిపంచినవాడు. అయితే అహంకారము చేత దేవునికి వ్యతిరేకముగా తాను హెచ్చించుకొని మరికొన్ని దూతలతో కూడి తిరుగుబాటు చేయగా తాను పరలోకము నుండి కొట్టి వేయబడెను. అయితే తన సంగీత తలాంతులను ప్రయోగపరచి ఇతర దూతలను తనతో జత కూర్చుకొనెనని గ్రహించగలము.

తిరుగుబాటు సంభవించకముందు పరలోకమెలా ఉండేదో ఊహించు కొనగలము. అభిషేకించబడిన కెరూబైన లూసీఫర్ సంగీతమును వాయిస్తూ దేవదూతల బృందమును ఆరాధనలో నడిపంచేవాడు. పరలోకపు దేవాలయము ఎంతటి అభిషేకముతో నిండియుండేదో అంతుచిక్కనిది అలాంటి వాతావరణములో దైవ ప్రత్యక్షత పొర్లిరాగా వెలుగుదూతయైన లూసీఫర్ మరికొన్ని నూతన గానములను రచించి దేవుని మహిమార్థమై మరింత ఉన్నతమైన ఆరాధనలోనికి ఇతర దూతలను నడిపస్తూ ఉండేవాడేమో!

లూసీఫర్ అహంకారము చేత తన్ను తాను హెచ్చించుకున్నప్పుడు కొంత మహిమ మరియు శక్తిని తన కొరకు భద్రపరచుకోవాలని ఉద్దేశించినట్లు లేఖనములు మనకు తెలియజేస్తున్నవి (యెహెజ్కేలు 28:15-18, యెషయా 14:12-14). తన అహంకారముతో నిండుకొనిన గానములను నాటినుండి రూపొందించ

సాగియుండెనేమో. అయితే తన సౌందర్యము మరియు అహంకారమును వర్ణించు పాటలు పాడగా కొందరు తనతో కూడిరి. ఆ తిరుగుబాటు పరిపక్వము చెందగా వారు ఏకుమ్మడిగా కలిసి దేవుని వ్యతిరేకించి తమ గానములే యుద్ధములుగా మార్చి తమను తాము ప్రోత్సహించుకొనసాగిరి.

నేటికీ గాయకులు మరియు సంగీత వాయిద్యకులు వలన సంఘములు చీలిపోవు చున్నవి. వారు తలాంతు మరియు అహంకారము అభివృద్ధి చెందుచున్న కొలదీ మేమే నడిపించువారము అన్నట్లుగా వారు ప్రవర్తిస్తారు. అంతేగాక సంఘకాపరులను ఏమాత్రమూ సంగీత జ్ఞానము లేనివారుగా చిన్న చూపుచూస్తారు. 'ప్రసంగములైతే మీరు చేస్తారుగాని ఆరాధనను స్తుతిని మేము అదుపు చేస్తున్నామనే గర్వము వారిలో తల యెత్తుతుంది. మీరు మా మీద మీ ఆధిపత్యమును చూపించాలని ప్రయత్నిస్తే మా సంగీత వాయిద్యమువలనైన తలాంతుతో మేమే క్రొత్త సంఘాన్ని స్థాపించగలము సుమీ', అనివారు హెచ్చరిస్తారు. మంచికైనా లేక చెడుకైనా సంఘస్థులను ప్రభావితులను చేసి వారిని నడిపించుటయందు చాతుర్యము గలవారై యుండుటచేత, సంగీత నాయకులు సంఘములను చీల్చేవారుగా ఉంటారు.

లూసీఫర్ కూలినప్పుడు తన సంగీత కళలను తనతోనే ఉంచుకున్నాడు. కాని అవి కలుషితము చెందాయి. లూసీఫర్‌ను గూర్చి యెషయా ప్రవచిస్తూ యెషయా 14:13లో ఇలా అంటున్నాడు, "నేను ఆకాశమున కెక్కిపోయెదను దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును ఉత్తర దిక్కుననున్న సభాపర్వతము మీద కూర్చుందును". లోకమును కలుషితము చేయాలని ఆశిస్తున్న సాతాను, సంగీతమును ప్రయోగించి మనుష్యులను లోకమువైపుకి, శరీరము వైపుకి మరియు సాతాను వైపుకి త్రిప్పుచున్నాడు. సంగీతము మరియు దైవారాధనలో నున్న శక్తి సాతాను ఎరిగినవాడు. యేసు సాగిలపడి తనను ఆరాధిస్తే లోక రాజ్యములను తనకిస్తానని క్రీస్తుతో అంటున్నాడు (మత్తయి 4:8-10). ఆరాధనను స్వాధీనపరచుకుంటే సమస్తాన్నీ స్వాధీన పరచుకోగలడని సాతానుకు తెలుసు.

సంగీతమనేది మంచికొరకై దేవుడు సృష్టించగా దానిని సాతాను మరియు తన అనుచరులు చెడ్డగా ప్రయోగిస్తున్నారు. 'సమస్తమూ అనగా సంగీతము కూడా దేవుని చేతే సృష్టింపబడినది గనుక అది చెడ్డది ఎలా కాగలదు' అని ఒక క్రైస్తవ గ్రంథములో వ్యాఖ్యానమును చూసాను. ఇది తప్పుడు అభిప్రాయము. దేవదూతలన్నిటిని దేవుడు మంచిగానుండుటకే సృష్టించాడు. అయితే ఆ దూతలు కొన్ని దుష్ట దూతలుగా ఎలా మారుచున్నవి? ఈ కూలిన దూతలు తమ సంగీతమును



ప్రయోగపరచి మానవాళిని చెడుకొరకై కలుషిత పరుస్తున్నారనేది గుర్తించాలి. దేవుని సైన్యములకు మరియు అపవాది యొక్క దండులకు మధ్య జరుగుచున్న ఆత్మీయ పోరాటమును గుర్తించాలి. ఈ పోరాటము ముఖ్యముగా సంగీత వాయిద్యములతోనే జరుగుతుంది (యెషయా 30:31-32, కీర్తన 149:6-9). ఒక సైన్యాధిపతి యుద్ధ ఉపాయములు ఎరిగియుండవలసి యున్నాడు. అటువలె సంగీతము మరియు దైవారాధన పరిధిలో జరుగుచున్న ఆత్మీయపోరాటములో గుర్తించవలసిన సంగతులు అనేకములు ఉన్నాయి. అవి జ్ఞానయుక్తమైన నాయకుడు గుర్తిస్తాడు.

ఒక వ్యక్తి ఎన్నో తలాంతులు కలిగి పేర్కొనబడిన గాయకునిగా ఉండవచ్చును, కాని అతడు తిరిగి జన్మించాక క్రీస్తునందు నూతన శిశువువలె ఆత్మద్వారా దైవ సంబంధమైన సంగీతమును నేర్చుకొననారంభించాలి. పరిశుద్ధాత్ముని అభిషేకమునకు వెలుపల ప్రకృతి సంబంధమైన తలాంతు కేవలము మనుష్యులను వినోదపరచగలదేమో గాని అది ఎన్నటికీ క్షేమాభివృద్ధిని కలిగించలేదు. కాబట్టి క్రొత్త విశ్వాసియైన ఒక వ్యక్తికి సంగీత పరిచర్యను సంఘములో అప్పగించరాదు. ఆ వ్యక్తి ఎంతటి తలాంతు గలవాడైనా ఆత్మ సంబంధమైన పరిపక్వత మొదట తనలో కలగాలి. క్రొత్తగా రక్షింపబడిన రాజకీయనాయకుడు లేక నటుడు వేదికనెక్కి ప్రసంగించుటకు ప్రయత్నించరాదు. ఒక చాతుర్యముగల వక్తకావటమనేది అర్హతగా పేర్కొనబడజాలదు. ఇది ఎంతో ఆత్మీయ ప్రమాదమును కలిగిస్తుంది. పరిచర్య అనేది కేవలము తలాంతులు మరియు సామర్థ్యముల ప్రతిఫలము కాదు. దేవుని ఆత్మ పవిత్రపరచిన పాత్రద్వారా శక్తి మరియు బలము కదలాడినప్పుడు నిజపరిచర్య సంభవిస్తుంది.

మనము రక్షింపబడిన తరువాత మన మనస్సులు రూపాంతర పరచబడి ఆత్మ సంబంధమైన వివేచన కలిగియున్నంతటి పరిపక్వత నొందాలి. అప్పుడే మన చుట్టూ ప్రభావము చేస్తున్న ఆత్మీయ శక్తులను గ్రహించగలము మరియు వివేచించ గలము. దేవునికి మరియు సాతానుకి మధ్య జరుగుచున్న ఈ పోరాటమును తేటగా చూడగలము. అప్పుడు భక్తిగల అభిషేకింపబడిన సంగీతముతోకూడిన జీవితము మరియు పరిచర్యకు మనల్ని మనము సిద్ధపరచుకొని దేవుని ప్రజలకు ఉజ్జీవమును రప్పించగలుగు సంగీతమును కలిగి యుంటాము.

# రెండవ అధ్యాయము

## ఆరాధన - అంగీకారయోగ్యమైనది మరియు తిరస్కరించబడినది

సమస్త ఆరాధనను దేవుడు అంగీకరించడని పరిశుద్ధ గ్రంథము మనకు స్పష్టము చేస్తున్నది. యదార్థముగా చేయు ఆరాధన అది ఎలాంటి క్రైస్తవుని నుండి వచ్చినా దేవుడు అంగీకరిస్తాడని కొందరంటారు. అయితే పరిశుద్ధ గ్రంథములో లిఖింపబడిన మొట్టమొదటి ఆరాధన సందర్భమందు ఇలా జరగలేదని మనము చూడగలము. ప్రభువైన యేసుక్రీస్తు యోహాను 4:23లో ఆత్మతో మరియు సత్యముతో ఆరాధించు నిజ ఆరాధికుల కొరకే దేవుడు చూస్తున్నాడని సెలవిచ్చాడు. అయితే దేవుడు ఆశించు రీతిలో కాని ఆరాధన కూడా వేరొకటి ఉన్నదని ఈ మాటలు మనకు స్పష్ట పరుస్తున్నవి.

ఆది 4:3-5లో లిఖింపబడిన మొట్టమొదటి ఆరాధనను చూద్దాము, "కొంతకాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడా తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతనియర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతనియర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్న బుచ్చుకొనగా".

కయీను యొక్క ఆరాధనను దేవుడు తిరస్కరించెనని మనమిక్కడ చూస్తున్నాము. అయితే కయీను అవిశ్వాసి అని మనమెంత మాత్రము చెప్పలేము. అతడు ఒక విశ్వాసే. అంతేగాక దేవునితో మాట్లాడినవాడు, ఆయనను ఆరాధించినవాడు, ఆయన సన్నిధిని ఎరిగినవాడు. అంతేగాక కయీను ఒక ఆరాధన నడిపించు నాయకుడని కూడా మనము చెప్పవచ్చును. ఎందుకంటే తన ఉదాహరణను బట్టి తమ్ముడైన హేబెలు కూడా ఆరాధించెను. అయినను దేవుడు కయీను ఆరాధనను తిరస్కరించెను.

ప్రకృతి రీత్యా చూస్తే ఒకరి ఆరాధనను అంగీకరించి మరియొకరి ఆరాధనను తిరస్కరించుట అన్యాయమనిపించవచ్చును. కయీను వ్యవసాయకుడు గనుక తనకు కలిగిన ఉత్పత్తిలో తానొక అర్పణను తెచ్చాడు, అయితే హేబెలు గొఱ్ఱెలను కాచుకునేవాడు గనుక తన మందలో ఒక దానిని అర్పణగా తెచ్చాడు. ఆధ్యాత్మిక దృష్టిలో చూస్తే ఒకరి ఆరాధనను దేవుడు తిరస్కరించుటకు మరియొకరి ఆరాధనను అంగీకరించుటకు స్పష్టమైన కారణములు దేవునికి ఉన్నవి. విసర్జింపబడిన కయీను అర్పణ భూఫలమైయుండెను. దీనిని దేవుడు ఆది 3:17లో శపించియుండెను. అయితే



అంగీకరింపబడిన హేబెలు అర్పణ ఆది 3:21లో దేవుడు ఉంచిన నమూనా చొప్పున అర్పించబడినది. అంతేగాక హేబెలు అర్పణ క్రీస్తు మనకొరకు దేవుని గొఱ్ఱెపిల్లగా రాబోయే సంగతిని గూర్చిన ప్రవచనాత్మిక నెరవేర్పుగా నున్నది.

నేటికీ దేవుడు అంగీకరింపని ఆరాధన విధానములు సంఘములో ప్రబలుచున్నవి. కయీనుకువలె మనుష్యులు తమ ప్రకృతి తలాంతులను మరియు ఆరాధనను తమ సొంత ఉపాయముల చేత అర్పిస్తూ ఉంటారు. ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని వీరు నేర్చుకునేటంతవరకు వీరి అర్పణను దేవుడు అంగీకరింపడు. తద్వారా వారు కోపగించుకొని నిరుత్సాహం చెంది కయీనుకువలె వెనక్కి జారిపోయే ప్రమాదము కూడా ఉన్నవి. కాబట్టి దేవుని గొఱ్ఱెపిల్లకున్న విధేయతతో కూడిన సాత్వీకమైన ఆరాధనను మనము దేవునికి అర్పింతుము గాక.

పరిశుద్ధ గ్రంథములో చివరిసారిగా ప్రస్తావించబడిన ఆరాధనను ప్రకటన 22:8-9లో చూద్దాము, "యోహానను నేను ఈ సంగతులను వినినవాడను చూచినవాడను; నేను విని చూచినప్పుడు వాటిని నాకు చూపుచున్న దూతపాదముల యెదుట నమస్కారము చేయుటకు సాగిలపడగా, అతడు – వద్దు సుమీ, నేను నీతోను, ప్రవక్తలైన నీ సహోదరులతోను, ఈ గ్రంథమందున్న వాక్యములను గైకొనువారితోను సహదాసుడను; దేవునికే నమస్కారము చేయుమని చెప్పెను".

పరిపక్వము చెందిన ఈ అపొస్తలుని ఆరాధన తిరస్కరింపబడియున్నట్లు చూస్తున్నాము, తానొక దేవదూతను ఆరాధిస్తున్నాడు. తనకివ్వబడిన ప్రత్యక్షతలను బట్టి దేవునికి ప్రతిగా ఆ ప్రత్యక్షతలను అందించిన పాత్రను తాను ఆరాధిస్తుండెను. ఈ ప్రమాదము మన సంఘారాధనలో కూడా సంభవింపవచ్చును. మనుష్యులు కొందరు ఆరాధనను నడిపించు నాయకునిపట్లనున్న గౌరవము లేక మెప్పు ద్వారా ఆరాధిస్తూ ఉంటారు. అయితే మరింత ప్రమాదకరమైన విషయమేమనగా ఆ మెప్పును మరియు స్తుతిని, ఆరాధన నడిపించు నాయకుడు మరియు సంగీత వాయిద్యకులు తమకు ఆరోపించుకుంటే లూసీఫర్‌కు వలె వారుకూడా గర్వాంధులవుతారు.

లోక సంబంధమైన గాయకులు మరియు సంగీత వాయిద్యకులు ఇలాంటి ధోరణిని ప్రోత్సహిస్తారు. తమను మెచ్చుకునేవారు మరియు ఆరాధించేవారు తమను ఐశ్వర్య వంతులుగా చేస్తారు గనుక అట్టి అనుచరులను వారు తమ వైపుకి ఆకర్షించుకుంటారు. కాబట్టి దేవుని గృహమందు గాయకులుగా మరియు సంగీత వాయిద్యకులుగా నున్నవారు అలాంటి లోకసంబంధమైన వైఖరికి లోనుకాకుండా

తమను తాము జాగ్రత్త పరచుకోవాలి. మన గురి, పేరు ప్రఖ్యాతులు మరియు ఉన్నత స్థాయిని చేరుకొనుట కాదుగాని కేవలము దేవునివైపుకు ప్రజలను ఆరాధనలోనికి నడిపించాలని ఉండాలి. పరిశుద్ధ గ్రంథమంతటిలో ప్రతివిధమైన ఆరాధనను దేవుడు అంగీకరింపడనే సంగతిని తరచు చదువుతాము. అయితే ఈ అంశము యొక్క ప్రాముఖ్యతను చూపించు నిమిత్తమై మొట్టమొదటి ఆరాధన మరియు చివరి ఆరాధనను ఉదాహరణగా మనము చూస్తున్నాము.

**సమస్త ఆరాధనను దేవుడు అంగీకరించడని పరిశుద్ధ గ్రంథము మనకు స్పష్టము చేస్తున్నది.**



# మూడవ అధ్యాయము

## దావీదు ద్వారా సంగీతము పునరుత్థరింపబడుట

సంగీతము సరియైన రీతిలో వాడబడునట్లు దానిని దావీదు పునరుత్థరించెను. అతడు 2 సమో 23:1లో ఇశ్రాయేలు యొక్క మధుర గాయకునిగా పేర్కొనబడెను. పూర్వకాలమందు సంగీతము మరియు గానములు ఆయా సమయములలో వాడబడెను. కాని దానికొక క్రమము లేక సరియైన వాడుక లేక పోయెను (నిర్గమ 15, న్యాయాధి 5, 1 సమూ 10:5). ప్రత్యక్షపు గుడారము మోషే కట్టించినప్పుడు సంగీతమును లేక గానమును ప్రయోగించలేదు. నీవొక ఇశ్రాయేలీయుడవై మోషే ప్రత్యక్షపు గుడారము లోనికి ఆరాధించుటకు ప్రవేశిస్తే నీకక్కడ ఏమి వినిపిస్తుంది? ప్రాణములు కోల్పోతున్న జంతువుల కేకలు, బలియర్పణలు నరకబడుచున్న శబ్దమే నీకు వినబడును. మోషే తన ఆరాధన క్రమములో సంగీతమును గాని లేక పాటలుగాని ప్రయోగించలేదు. తన ఆరాధన కేవలము రక్త బలియర్పణపైనే ఆధారపడి యుండెను.

అయితే రాజైన దావీదు ఒక క్రొత్త ప్రత్యక్షపు గుడారమును నిర్మించి దేవుని ఆరాధించుటకు సంగీతము మరియు గానములను నిర్వహించెను (1 దిన 15, 16). అతడు దేవుని హృదయానుసారి గనుక మోషే ప్రత్యక్షపు గుడారములోనున్న క్రమముకు మించినదానిని చూడగలిగాడు. కీర్తన 40:6లో దావీదు ఇలా వ్రాస్తున్నాడు, "మనుష్యులు వట్టి నీడ వంటివారై తిరుగులాడుదురు. వారు తొందరపడుట గాలికేగదా, వారు ధనము కూర్చుకొందురు గాని అది ఎవనికి చేజిక్కునో వారికి తెలియదు". కీర్తన 141:2లో కూడా తానిలా వ్రాస్తున్నాడు, "నా ప్రార్థన ధూపమువలెను నేను చేతులెత్తుట సాయంకాల నైవేద్యమువలెను నీ దృష్టికి అంగీకారములగును గాక". కాబట్టి దావీదు తన ఆరాధనలో మోషే ఆచరించిన వాటిని తిరిగి ఆచరింపలేదు. అయితే దానికంటే శ్రేష్టమైనది మరియు పవిత్రమైన విధానమును తాను అవలంభించెను. అదేమనగా సంగీతము మరియు గానములు.

కొన్ని శతాబ్దముల తరువాత ప్రవక్తయైన ఆమోసు దావీదు ఆరాధన విధానము యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాడు. అంతేగాక దావీదుయొక్క ప్రత్యక్షపు గుడారమును దేవుడు తిరిగి నిలబెట్టుకుంటాడని కూడా ప్రవచించాడు. ప్రభువు తన సంఘముతో చేయనుద్దేశిస్తున్నది ఈ ప్రవచనము యొక్క నెరవేర్పని నూతన నిబంధన సంఘనాయకులు గ్రహించారు. వారు ఆమోసు 9:11ను ప్రస్తావిస్తూ యెరూషలేములో జరిగిన సమావేశమందు దానిని గూర్చి చర్చించారు, "ఆ తరువాత



నేను తిరిగి వచ్చెదను, మనుష్యులలో కడమవారును నా నామము ఎవరికి పెట్టబడెనో ఆ సమస్తమైన అన్యజనులును ప్రభువును వెదకునట్లు పడిపోయిన దావీదు గుడారమును తిరిగి కట్టెదను దాని పాడైన వాటిని తిరిగి కట్టి దానిని నిలువబెట్టదనని అనాది కాలము నుండి ఈ సంగతులను తెలియపరచిన ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (అపొ.కా. 15:16-17).

ఆది సంఘనాయకులు మోషే ప్రత్యక్ష గుడారములో సంభవించిన బలియర్పణలు మరియు అర్చనాచారాదులు సంఘములో తిరిగి పునరిత్థరింపబడుట దైవచిత్తము కాదని గ్రహించిరి. ఆలాగైయున్నట్లయితే అన్యజనులందరు మోషే ధర్మశాస్త్రము చొప్పున సున్నతి పొందవలసియుండును కదా? సంఘములో తిరిగి నిర్మించబడవలసినది, దావీదు ప్రత్యక్షపు గుడారము. అంతేగాని మోషే ప్రత్యక్షపు గుడారము ఎంత మాత్రము కాదు.

దేవుడు నివసించుటకు కేవలము ఒక గుడారము నిర్మించబడుట ప్రభువు ఆశించినది కాదని కూడా నాటి అపొస్తలులు ఎరిగియుండిరి. ప్రత్యక్షపు గుడారములో దావీదుకు కలిగిన అనుభూతి దేవుని ప్రజలయందు పునరుత్థరింపబడాలనేది దేవుడు ఆశించెను. ప్రత్యక్షపు గుడారములో కేవలము సంగీతము మరియు గానములతో దావీదు నిరంతరము దేవుని స్తుతించినట్లు లేఖనములు తెలియజేస్తున్నవి. "మరియు అతడు యెహోవా మందసము ఎదుట సేవచేయుచు, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాను ప్రసిద్ధి చేయుటకును, వందించుటకును ఆయనకు స్తోత్రములు చెల్లించుటకును లేవీయులలో కొందరిని నియమించెను. వారిలో ఆసాపు అధిపతి, జకర్యా అతని తరువాత వాడు, యెయీయేలు షెమీరా మోతు యెయీయేలు మత్తిత్యా ఏలీయాబు బెనాయా ఓబేదెదోము యెయీయేలు అనువారు స్వరమండలములను సితారాలను వాయించుటకై నియమించబడిరి, ఆసాపు తాళములను వాయించువాడు" (1దిన 16:4-6).

దావీదు ఏర్పరచిన ఆరాధనా క్రమాన్ని గూర్చి పై వచనములు తెలియజేస్తున్నవి. దేవుని ఆరాధించుటకు దావీదు ప్రయోగించిన సంగీతము మరియు గానములను గూర్చిన వివరణ పాత నిబంధనలో అనేక అధ్యాయముల యందు కనుగొనగలము. వీటన్నిటిని తిరిగి నూతన నిబంధనలో ప్రస్తావించుటకు ప్రభువు ప్రయత్నింపక కేవలము అపొ. కా. 15:16-17ను మాత్రమే మనకు సూచిస్తున్నాడు. దానిద్వారా దావీదు ప్రత్యక్షపు గుడారములో దైవారాధన వివరమును మనము గ్రహించాలి. దానిని తిరిగి నేడు తన ప్రజలలో పునరిత్థరించాలని దేవుడు ఆశిస్తున్నాడు.

సంఘములలో ఎక్కువ సమస్యలు, మనస్పర్థలు సంగీతము మరియు దైవారాధన విషయములలో సంభవిస్తూ ఉంటాయి. దేవుని ప్రజల కొరకు ఈ ప్రాముఖ్యమైన సత్యములను దావీదు పునరుద్ధరించాలనే విషయములో తలెత్తిన మనస్పర్థలే ఇవి. కొన్ని క్రైస్తవ శాఖలు సువార్తలయందు సంగీత వాయిద్యములు ప్రయోగింపబడలేదు గనుక వాటిని నేడు మనము ఉపయోగింపరాదని బోధిస్తారు. మరికొందరు నూతన నిబంధనలో మన సంగీతము మరియు దైవారాధన విషయములో సరియైన వివరణ లేక ఉపదేశము లేనందువలన ఏది ప్రజల మెప్పు నొందుకుంటుందో దానిని చేయాలని ప్రయత్నిస్తుంటారు.

నూతన నిబంధనలో సంగీతము, గానములు మరియు స్తుతి ఆరాధనను గూర్చి బహు తక్కువ వివరణ ఉన్నదనేది వాస్తవమే కాని దావీదు తన ప్రత్యక్షపు గుడారములో నెలకొల్పిన ఉపదేశము మన కొరకై యున్నదని మనము గ్రహించాలి. ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని ప్రభువు మనకిచ్చిన ఆజ్ఞను నెరవేర్చుటకు ఆ పాతనిబంధన వివరణ ఉపయోగపడుతుంది. యోహాను 17:17లో యేసు 'నీ వాక్యమే సత్యము' అని సెలవిచ్చారు. కాబట్టి సత్యమందు ఆరాధించాలంటే దేవుని వాక్యములో ఆరాధనను గూర్చిన ఉపదేశమును మనము పాఠించాలి.

వాక్యములోనున్న ఈ ఉపదేశము మనకింతవరకు గ్రహింపుకురాని యెడల కీర్తనాకారునివలె మనమిలా ప్రార్థించాలి, "నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము" (కీర్తన 119:18). సామె 25:2 ఇలా ప్రకటిస్తుంది, "సంగతి మరుగుచేయుట దేవునికి ఘనత సంగతి శోధించుట రాజులకు ఘనత". రాబోవు ప్రభువుతో మహిమగల రాజ్యములో పాలుపంచుకొని పరిపాలన చేయు రాజులు మరియు యాజకులుగా ఉండనావించువారు దేవుడు తన వాక్యములో దాచియుంచిన గూఢమైన సంగతులను వెదకి పరిశీలించి వాటిని పఠించవలసియున్నారు.

## దావీదు యొక్క సంగీతము మరియు దైవారాధన పరిశుద్ధాత్మ యొక్క అనుగ్రహము వలన కలిగెను.

దావీదు ఇంకను యవ్వనునిగా ఉన్నప్పుడే ప్రవక్తయైన సమూయేలు తనను అభిషేకించెను. లేఖనములు ఇలా సెలవిస్తున్నవి, "సమూయేలు తైలపు కొమ్మును తీసి వాని సహోదరుల యెదుట వానికి అభిషేకము చేసెను. నాటినుండి యెహోవా ఆత్మ దావీదు మీదికి బలముగా వచ్చెను. తరువాత సమూయేలు లేచి రామాకు



వెళ్లిపోయెను" (1సమూ 16:13). ఈ బలమైన అభిషేకము యొక్క ప్రతిఫలమేమనగా దావీదు తన తండ్రి గొఱ్ఱెలను కాయుచున్నప్పుడు పరిశుద్ధాత్ముని శక్తి ద్వారా దేవుని ఆరాధించుట నేర్చుకొనెను. అతడు కీర్తన 23లో ప్రభువు తనకు తైలాభిషేకము చేసెననియు, తనగిన్నె పొంగి పొర్లుచున్నదనియు వ్రాసెను. దేవుని ఆత్మ మన హృదయములలో పొంగిపొర్లాలంటే అది సంగీతము మరియు గానములచేతనే సంభవించును.

దావీదు తన ద్వారా పరిశుద్ధాత్ముని కదలికను అనుమతించి ఆ శక్తిని బట్టి సంగీతమును విడుదల చేయగా వెనక్కి దిగజారిన రాజైన సౌలును పీడించిన దురాత్మనుండి తనకు తాత్కాలిక విడుదలను కలుగజేస్తుండేవాడు. 1 సమూ 16:23లో ఇలా చదవగలము, "దేవుని యొద్ద నుండి దురాత్మ వచ్చి సౌలును పట్టినప్పుడెల్ల దావీదు సితారా చేతపట్టుకొని వాయింపగా దురాత్మ అతనిని విడిచి పోయెను, అతడు సేదదీరి బాగాయెను".

దేవునితో ఏకాంత సమయములయందు పరిశుద్ధాత్ముడు దావీదుకు ఆరాధించుట నేర్పించెను. దావీదు పేర్కొనబడిన సంగీత నిపుణులయొద్దగాని లేక నాటి సంగీత బోధకుల యొద్దగాని పాఠములు నేర్చుకోలేదు. వ్యక్తిగత ప్రార్థన సమయములయందు ఆత్మద్వారా గానములు పాడుచు సంగీతమును వాయించుట ద్వారా దావీదు దైవారాధన నేర్చుకొనెను. రహస్య స్థలములలో పలుకబడినది మిద్దెలపైన ప్రకటింపబడునని ప్రభువైన యేసు సెలవిచ్చెను. అదే విధముగా వ్యక్తిగత ప్రార్థన సమయములలో యవ్వనుడైన దావీదు నేర్చుకున్న గానములు సౌలు యెదుట ప్రదర్శింపబడెను. అంతేగాక సొలొమోను కట్టించిన దేవాలయములో కూడా ఈ ఆరాధన విధానము ప్రకటించబడెను.

నేనొక యవ్వన క్రైస్తవునిగా నున్నప్పుడు ప్రభువు యొక్క ఆత్మ చొప్పున ఆరాధనలో ఎలా కొనసాగాలో ఆయన నాకు నేర్పించెను. నేనొక పెంతుకోస్తు సంఘములో తిరిగి జన్మించి స్తుతించుట, చేతులెత్తుట, ప్రభువు యెదుట నాట్యము చేయుట ఎరిగియుంటిని. అయినను ఆ కార్యకలాపములయందు నేను సౌఖ్యతను పొందలేదు, దేవుని ఆరాధించుటకు బదులు చేతులెత్తుట మరియు ఎలా నాట్యము చేయాలనే వాటియందే నా ధ్యాస నిలిచిపోయింది.

అంతట ప్రభువును నిజముగా ఎలా ఆరాధించాలో నేర్చుకోవాలనేది నా హృదయవాంఛగా మిగిలిపోయింది. అయితే నేను నేర్చుకున్న విలువైన పాఠములు దేవునితో నా ఏకాంత సమయము యందే. ఆ దినములలో నేనొక నైట్ వాచ్‌మెన్‌గా

పనిచేసేవాడను. రాత్రులు పెద్ద పనిలేకపోవుట చేత ఎక్కువ సమయము ప్రార్థించుట మరియు దేవుని ఆరాధించుటయందే గడిపేవాడిని. దేవుని యెదుట చప్పట్లు కొట్టుట పూర్ణాత్మతో ఆయన సన్నిధిలో చేతులెత్తుట సంతోషముతో ఆయన యెదుట నాట్యము చేయుట వంటివి నేను నేర్చుకున్నాను. దేవుని మహాశక్తివంతమైన సన్నిధి ఆ స్థలమంతా నిండుకొనునంతవరకు నేనలా ప్రభువుని స్తుతించి ఆరాధిస్తుండేవాడిని. కొన్నిసార్లు సాక్షాత్తూ దేవుని యొక్క మహిమను కూడా నేను చూసాను.

సంఘ ఆరాధనలలో దేవుని నేను ఆరాధించుట నేర్చుకున్నప్పటికి అతిశ్రేష్ఠమైన పాఠములు ఏకాంత సమయములోనే నేర్చుకున్నాను. అలా జరుగుట వలన సంఘములో ఎవరు దేవుని ఎలా ఆరాధిస్తున్నారనే ధ్యాసకంటే ప్రభువుకి నేను సన్నిహితుడ్ని అవుతున్నానా లేదా అనే దానిమీదే నా మనస్సు పెట్టేవాడిని.

వ్యక్తిగత ఏకాంత ప్రార్థనా సమయములలో దేవుని ఆరాధించుట నేర్చుకోవటము ముఖ్యము. అయితే అందునుబట్టి వేరెవ్వరితో కూడ కలిసి సంగీత పాఠములు నేర్చుకొనుట తప్పుని అనుకొనరాదు. బాగా నేర్పించగలిగే వానియొద్ద నుండి పాఠములు తీసుకోవటం సహాయపడవచ్చును. కీర్తన 33:3 అలా నేర్చుకోవటాన్ని గూర్చి హెచ్చరిస్తుంది. అయితే క్రైస్తవ సంగీత వాయిద్యకులు తప్పుడు పునాదిపై తమ సంగీతమును అభ్యసించియుండుట దురదృష్టకరము. వారు రక్షింపబడక ముందు నేర్చుకున్న సంగీతము వారిని ప్రభావితము చేస్తుంది. మరికొందరు క్రైస్తవులైన తర్వాత పాడుట, సంగీతము వాయించుట నేర్చుకున్నప్పటికి లోకసంబంధమైన సంగీతముచేత ప్రభావితము చెందియుండవచ్చును. ఈ తప్పుడు ఆధ్యాత్మిక పునాదులు అపవిత్రమైన సంగీతము మరియు ఆరాధనను సంఘములోనికి ప్రవేశపెడుతుంది. కాబట్టి ప్రభువు దానిని పవిత్రపరచి మరియు పునరుత్థరించడానికి మనము అనుమతించాలి.

నా జీవితములో ఇది నాకు కలిగిన నా వ్యక్తిగత అనుభవము. నేను ప్రభువును కలుసుకొనకముందు లోక సంబంధమైన సంగీతము వాయించేవాడను. చిన్నప్పుడే ఒక పాట వ్రాసి దానిని రేడియోలో కూడా ప్రసారము చేసాను. అంతేగాక పెద్ద జన సమూహముల యెదుట నా సంగీతమును ప్రదర్శింపజేసాను. నేను పాడిన పాటలు యొక్క భావము మరియు విధానము నాలోనున్న పాపమును ప్రతిభింబించాయి.

అయితే నేనొక క్రైస్తవునిగా మారిన తరువాత నా సంగీత కళలు ప్రభువు కొరకు సాక్ష్యముగా ప్రయోగించాలని నేను ఆశించాను. అనేకమైన సంగీత గుంపులను నేనునిర్వహించాను. మేము చక్కని ఆరాధన పూర్వకమైన పాటలు పాడుతున్నప్పుడు



దిగివచ్చిన దైవాభిషేకము, లోకసంబంధమైన సంగీతమును వాయించినప్పుడు మేము చూడలేక పోయాము. మనుష్యులను ఉత్తేజ పరచగలిగినను ప్రభువు సన్నిధి మా మధ్య లేకపోయెను. అలా ఆరు సంవత్సరములు క్రైస్తవునిగా నేను జీవించి పూర్వకాలపు సంగీతము నుండి పవిత్ర పరచబడకయుంటిని.

అపొస్తలుడైన పౌలుకు కలిగిన వైఖరి మనము కలిగియుండాలి. అతడు ఫిలిప్పీ 3లో తన లోకసంబంధమైన తలాంతులు మరియు సామర్థ్యములు క్రీస్తు యెదుట పెంటను పోలియున్నవని ప్రకటించాడు. మనము నిజముగా క్రీస్తును గెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నామా? దేవుని యొక్క అభిషేకమును మాత్రమే మనము కలిగి యుండాలని ఆశిస్తున్నామా? అయితే మనమిదివరకు లోకములో నేర్చుకున్నవాటిని విడిచి, శరీరమును ఆస్పదము చేసుకొనక దేవుని ఆత్మతో ఆరాధించుట నేర్చుకోవాలి (ఫిలిప్పీ 3:3).

దావీదు పరిపక్వత నొంది ప్రవక్తగా మారినప్పుడు తన సంగీతము మరియు దైవారాధన తనతోకూడా పరిపక్వము చెంది జ్ఞానమందు, పరిశుద్ధాత్మ శక్తియందు అభివృద్ధి నొందాడు. తన కీర్తనలు అనేకములు ఈ ఎదుగుచున్న పరిచర్యయొక్క ప్రతిఫలమే. కీర్తనలు మనము పఠిస్తున్నప్పుడు దావీదుకువలె మధుర కీర్తన కర్తలుగా మనమెలా మారగలమో నేర్చుకోగలము.

తదుపరి దావీదు ఇశ్రాయేలుకు రాజైన తరువాత తన రాజ్యములో తాను పునరుత్థరించిన వందలాదిమంది లేవీయులను తాను ప్రతిష్ఠించి ప్రభువుకు పరిచర్య చేయుటకు సంగీతము మరియు గానములను తిరిగి నెలకొల్పెను. 1దిన 25:1 ఇలా సెలవిస్తుంది, “మరియు దావీదును సైన్యాధిపతులును ఆసాపు హేమాను యెదూతను అనువారి కుమారులలో కొందరిని సేవనిమిత్తమై ప్రత్యేకపరచి, సితారాలను స్వరమండలములను తాళములను వాయించుచు ప్రకటించునట్లుగా నియమించిరి”. వారు సంగీతము ద్వారా పరిశుద్ధాత్మ శక్తిని బట్టి ప్రవచించుట నేర్చుకొనిరి. అయితే దావీదు మాత్రమే ప్రవక్తయైయుండక తనతోకూడ పాడిన గాయకులు మరియు సంగీత వాయిద్యకులు కూడా ప్రవక్తలుగానుండుటకు ప్రభువుచేత లేపబడిరి. వారిలో ఒకడు సమూయేలు మనుమడు. తనపేరు హేమాను (1దిన 6:33-34). తన తాతగారి మీదున్న ప్రవచనాత్మిక అభిషేకము తనమీదికి దిగివచ్చెను. అంతట హేమాను కూడా ప్రవక్తగా పేర్కొనబడెను (1దిన 25:5). తనపై నున్న సంగీత పరిచర్య తన కుమారులైన పధ్నాలుగుమందికి కొనసాగెను. దావీదు సొలొమోను దేవాలయంలో నెలకొల్పిన ఇరవై నాలుగు గుంపుల గాయకులలో హేమానుకు చెందిన వారు పధ్నాలుగుమంది.

దావీదు మరియు తన సహప్రవక్తలు తమసంగీతము మరియు గానమును పరిశుద్ధాత్మ ప్రత్యక్షత ద్వారా రూపొందించిరి. వారు తమ సొంత ఉపాయములను ప్రయోగపరచలేదు. అంతేగాక మనకున్నట్లు ఆధునిక సదుపాయములు ఏవీ వారికి లేవు. మనమైతే నేడు వివిధమైన పుస్తకముల ద్వారా క్రొత్త పద్ధతులను నేర్చుకోగలము. అంతేగాక వారు టెలివిజన్ ద్వారా భక్తిహీనమైన సంగీత విధానమును నేర్చుకునే అవకాశము కూడా వారికి లేదు. కాబట్టి ప్రభువునుండే సమస్త ఉపదేశమును పొందుకొనిరని దిగువ లేఖనములద్వారా మనము చూడగలము, "మరియు దావీదును దావీదు రాజుకు దీర్ఘదర్శియైన గాదును ప్రవక్తయైన నాతానును చేసిన నిర్ణయము చొప్పున యెహోవా మందిరములో తాళములను స్వరమండలములను సితారాలను వాయించుటకై అతడు లేవీయులను ఏర్పాటు చేసెను" (2దిన 29:25).

గొఱ్ఱెలు కాచుకునే ఒక బాలునిగా దావీదు తన ఆరాధన పరిచర్యను ఆరంభించి ఒక ప్రవక్తగా పరిపక్వత నొందెను. దేవుని ఆరాధన కొరకై తన సంగీతమును మరియు గానములను రూపొందించెను. తనతోకూడా ఇతర ప్రవక్తలు మరియు సేవకులను కూడ్చుకొని ఒక ఆరాధనా బృందముగా తయారై తాను కట్టించిన ప్రత్యక్షపు గుడారముయందు ప్రభువుకు పరిచర్య చేసిరి. వీరు అభివృద్ధి చెంది సంపూర్ణ పరిపక్వతతో సొలొమోను దేవాలయమునందు ఆరాధనను నెలకొల్పిరి. సొలొమోను దేవాలయములో జరిగిన మహిమోన్నతమైన ఆరాధనను గూర్చి 2 దిన 5:13-14లో చదవగలము, "వారితో కూడా బూరలు ఊదు యాజకులు నూట ఇరువదిమంది నిలిచిరి; బూరలు ఊదువారును పాటకులును ఏకస్వరముతో యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు గానము చేయగా యాజకులు పరిశుద్ధస్థలములో నుండి బయలువెళ్లి, ఆ బూరలతోను తాళములతోను వాయిద్యములతోను కలిపి స్వరమెత్తి-యెహోవా దయాళుడు, ఆయన కృప నిరంతరముండునని స్తోత్రము చేసిరి".

ఈ బైబిలు కథనములలో సంగీతము మరియు గానములు దేవుని ఆరాధించుటకు ప్రయోగపడేవన్న సంగతి మనకు శ్రద్ధ కలిగిస్తుంది. ఆరాధనను గూర్చిన వివిధమైన అధ్యాయములు పాతనిబంధనలో చూడగలము. ఈ అంత్య దినముల దేవుని సంఘములో దేవుడు లేవనెత్తుకోనుద్దేశిస్తున్న వాటిని పాతనిబంధనలో కనుగొనగలము. ఆమోసు 9:11 మరియు అపొ.కా. 15:15-17 సంఘ యుగమందు దావీదుయొక్క ప్రత్యక్షపు గుడారము ప్రభువుచేత పునరుద్ధరింపబడునను సంగతి తెలియజేస్తుంది, "పడిపోయిన దావీదు గుడారమును ఆ దినమున నేను లేవనెత్తి దానిగోడను బాగుచేసి దానిపోయిన చోట్లను బాగుచేసి, ఎదోము శేషమును నా నామము ధరించిన అన్యజనులందరిని నా జనులు స్వతంత్రించుకొనునట్లు



పూర్వపు రీతిగా దానిని మరల కట్టుదును" "ఇందుకు ప్రవక్తల వాక్యములు సరిపడియున్నవి; ఎట్లనగా ఆ తరువాత నేను తిరిగి వచ్చెదను; మనుష్యులలో కడమ వారును నా నామము ఎవరికి పెట్టబడెనో ఆ సమస్తమైన అన్యజనులును ప్రభువును వెదకునట్లు పడిపోయిన దావీదు గుడారమును తిరిగి కట్టెదను దానిపాడైన వాటిని తిరిగి కట్టి దానిని నిలువబెట్టెదనని అనాదికాలమునుండి ఈ సంగతులను తెలియపరచిన ప్రభువు సెలవిచ్చుచున్నాడు". సంఘము ద్వారా భూరాజ్యములన్నియు అభిషేకింపబడిన సంగీతమును వింటారని తెలుస్తుంది. సొలొమోను సమాధానముతో కూడిన రాజ్యము తదుపరి వచ్చినట్లే క్రీస్తు వెయ్యి సంవత్సరముల పరిపాలనకు ముందు ఈలాగు జరుగుతుంది. దావీదు ప్రత్యక్షపు గుడారములో ఆరాధించుట నేర్చుకున్నవారు, నూతన నిబంధన సంఘము వెయ్యి సంవత్సరముల పరిపాలనలో వికసించి ప్రభువు కొరకు సిద్ధపడి యుండగా ఎలా ఉంటుందో హబక్కూకు 2:14లో చదవగలము, "ఏలయనగా సముద్రము జలములతో నిండియున్నట్లు భూమి యెహోవా మహాత్మ్యమును గూర్చిన జ్ఞానముతో నిండియుండును".

అపొ. కా. 13:22లో దావీదు సాక్ష్యమును చూస్తున్నాము, అదేమనగా అతడు దేవుని హృదయానుసారి మరియు అట్టి వారినే తన చెంత చేర్చుకున్నాడు. ఈ తరము కొరకు దేవుడు లేవనెత్తుకోనుద్దేశించు గాయకులు మరియు సంగీత వాద్యకులు ఇలాంటివారే. వీరు తమ వ్యక్తిగత భక్తి జీవితములో దేవుని ఎదురుపడిన స్త్రీ పురుషులై యుండాలి. తదుపరి సంఘములను తమలోనుండి ప్రవహించు బలమైన అభిషేకము ద్వారా దేవుని మహిమోన్నతమైన సన్నిధిలోనికి నడిపించగలిగి యుందురు. నిజమైన ఆరాధనను గూర్చిన దర్శనము ప్రభువు మనకు అనుగ్రహించును గాక. అంతకంటే తక్కువ స్థాయితో మనము తృప్తినొందకుందుము గాక.

**వ్యక్తిగత ఏకాంత ప్రార్థనా సమయములలో**
**దేవుని ఆరాధించుట నేర్చుకోవటము ముఖ్యము.**

# నాల్గవ అధ్యాయము

## ఆత్మలో ఆరాధించుట ఎలా?

ప్రతీ తిరిగి జన్మించిన క్రైస్తవుని హృదయములో దేవుని ప్రేమించి ఆయనను ఆరాధించాలనే కోరిక మన పరలోకపు తండ్రి పెడతాడు. అంతేగాక పరిచర్య పదవి కొరకై పిలువబడిన ప్రతి పరిశుద్ధుడు స్తుతి ఆరాధన సమయములలో ఇతరులను దేవుని సన్నిధిలోనికి నడిపించుట నేర్చుకోవాలి. అయితే మనమిదివరకు చూచిన ప్రకారము ప్రతివిధమైన ఆరాధనను దేవుడు అంగీకరింపడు. పరిశుద్ధాత్ముని కదలికను స్పర్శించుట మనము నేర్చుకొన్నకొలదీ ఆరాధన కూటములలో దేవుని సన్నిధిలోనికి మనము ప్రవేశించి అక్కడే నిలిచి యుండగలము. కొందరు తమ సొంత ఆలోచన చొప్పున సమాజమును పెడద్రోవపట్టించినా నిలకడగా దేవుని సన్నిధిలోనే ఉండగలుగు ఆరాధనను మనము కలిగియుండగలము.

యోహాను 4:23లో నిజ ఆరాధికులముగా మనమెలా ఉండగలమో ప్రభువైన యేసు తెలియజేసెను. "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు".

నిజమైన ఆరాధనకు తాళపుచెవి ఆత్మలో ఆరాధించుటయే. ఆత్మలో ఆరాధించుట నేర్చుకోవడానికి దిగువనున్న నాలుగు తాళపుచెవులు మనకు సహాయపడగలవు.

## ఆత్మలో ఆరాధించుటకు గల నాలుగు తాళపు చెవులు

1. **స్వాతంత్ర్యము (స్వేచ్ఛ) :** 2 కొరింథీ 3:17 ప్రభువు ఆత్మ ఉన్న చోట స్వాతంత్ర్యముంటుందని తెలియజేస్తుంది. దేవుని సన్నిధిలోనికి మనము ప్రవేశిస్తున్నప్పుడు అక్కడ మనకు స్వతంత్రత లభిస్తుంది. స్వేచ్ఛగా ప్రభువును మనము స్తుతించగలము మరియు ఆరాధించగలము. బంధింపబడిన ఆత్మతో మనముండుట ప్రభువుకు ఇష్టము లేదు. కాబట్టి రాజైన దావీదుకు వలె స్వేచ్ఛ కలిగి యుండుట నేర్చుకుందాము. అతడు ప్రభువు సన్నిధిలో నాట్యమాడుటకు వెనుకాడలేదు.

2. **సంతోషము :** ఆయన సన్నిధిలో సంపూర్ణ సంతోషమున్నదని కీర్తన 16:11 తెలియజేస్తుంది. దేవుని సన్నిధిలోనికి మనము ప్రవేశించినప్పుడు దుఃఖము,



ఆయాసము మరియు దిగులు మనల్ని విడిచిపోతుంది (యెషయా 61:3, యెషయా 35:10). ప్రభువు సంతోషముతో ఎల్లవేళలా నిండుకొనియున్నవానిగా ప్రభువైన యేసును మనము ఎరిగియున్నాము. అంతట తన శత్రువులు తాను మద్యము చేత మత్తుడైయున్నాడని నిందించిరి (మత్తయి 11:19, హెబ్రీ 1:9).

3. **దేవుని సమాధానము :** దేవుని సమాధానము మన హృదయములను ఏలవలసియున్నదని కొలొస్సీ 3:15 తెలియజేస్తుంది, ఏలుట అనగా పరిపాలన లేక మధ్యవర్తిత్వము చేయుట. సరిగ్గా ఆట ఆడునంతవరకు ఎంపైర్ మౌనము వహిస్తాడు. కాని ఎప్పుడైతే నియమములు ఉల్లంఘించబడతాయో అతడు సమాధానమును కోల్పోయి ఈల ఊది ఆటను ఆపివేస్తాడు. మరల ప్రతీది సరిదిద్దబడిన తర్వాత ఆట కొనసాగుతుంది. అదే విధముగా స్తుతి ఆరాధనలో సరిగ్గాముందుకు సాగకయున్నప్పుడు దేవుని సమాధానము మన హృదయములో పోగొట్టుకుంటాము. అంతట అలా జరుగుటకు హేతువును తెలుసుకొని తప్పును సరిదిద్ది పరిశుద్ధాత్మలో ప్రవహించుట యందు మనము కొనసాగాలి.

4. **ఐక్యత :** సహోదరుల ఐఖ్యత అభిషేక తైలము వంటిదని కీర్తన 133:1-2 తెలియజేస్తుంది. ఆరాధన కూటములో ప్రజలందరు ఏకభావము కలిగి ప్రభువును ఆరాధిస్తున్నట్లైతే పరిశుద్ధాత్ముని అభిషేకము అక్కడున్నదని చెప్పగలము.

పరిశుద్ధాత్ముని పై నాలుగు కార్యములు సమతూకముతో మనమధ్య పనిచేస్తే ఆత్మయందు మరింత లోతైన దేవుని సన్నిధిలోనికి మనము చేరుకుంటాము. అయితే వీటిలో ఏ రెండైనా ఎక్కువగా ఉన్నట్లైతే ఆత్మ ప్రవాహము నుండి తొలగిపోతాము.

## 1. పారంపర్యాచారము

స్తుతి ఆరాధన ఒక పారంపర్యాచారముగా మారవచ్చును. ఒక మనుష్యుడు నెలకొల్పిన నమూనాను పాటించే రీతిలో మనముండవచ్చును. దేవుని ఆత్మచేత నడిపించబడుటయందు మనము కొనసాగనియెడల ఇటువంటి పరిస్థితిని చేరుకుంటాము. పైకి చూడ్డానికి బాగానే ఉన్నప్పటికి మనుష్యుల హృదయములు నిజమైన ఆరాధన యందుండవు. దీని విషయమై మత్తయి 15:8-9లో ఇలా అంటున్నాడు, "వేషధారులారా – ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశకులని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు".

పూర్వకాలపు సంఘములయందు ఇటువంటి పారంపర్యాచారముతో కూడిన ఆరాధన క్రమమును చూస్తాము. ఎప్పుడు ఏ పాట ఎంతసేపు పాడాలనేది కూడా వారు కాగితముల మీద ముద్రించి యుంచుతారు. అయితే ఆత్మపూర్ణులైన సంఘములు ఈ పద్ధతిని వ్యతిరేకిస్తారు. వారము వెంబడి వారము ఒకే విధమైన ఆరాధనా కార్యక్రమమును వీరు కలిగియుంటారు. నూతనమైన రీతిలో పరిశుద్ధాత్ముడు వారిమధ్య సంచరించుటకు వారెంతమాత్రము అవకాశమివ్వరు. అయితే ఇలాంటి పరిస్థితిని మనమెలా గుర్తించగలము? పై వివరించబడిన నాలుగు తాళపు చెవుల ద్వారా దీనిని పరీక్షించగలము. వీరు కేవలము సమాధానము మరియు ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తారు. వీరు సంతోషము మరియు స్వాతంత్ర్యతకు చోటివ్వరు.

## మతాచారము నుండి విడుదల

1. స్వాతంత్ర్యము మరియు సంతోషమును గూర్చి ప్రకటించాలి మరియు బోధించాలి. ఆచారములచేత బంధింపబడినవారు విడుదల నొందుటకు ఇది ప్రోత్సాహకర మగును.

2. ప్రభువు సంతోషము మరియు స్వేచ్ఛను గూర్చి బోధించే నాయకులను మరియు సంగీత వాయిద్యకులను నియమించాలి. వివిధరకములైన వ్యక్తులు వివిధ రకములుగా ఆరాధనా కూటమును నడిపిస్తారు. కాబట్టి సమతూకము కలిగియున్న నాయకుడనే మనము నియమించాలి. తంబురతో స్తుతించుటను ప్రోత్సహించాలి.

3. ప్రతీ ఆరాధనా కూటమును ఒకే నమూనా చొప్పున నడిపించరాదు. వివిధ రకములుగా నడిపిస్తూ సంతోషము, స్తుతి, ఆరాధనను ప్రేరేపించాలి. ప్రభువు మనల్ను నడిపించనాశించు విధానముకు అవకాశము ఇవ్వాలి. ఆత్మను ఆర్పక పరిశుద్ధాత్మ కదలికకు చోటు చెయ్యాలి. కొన్నిసార్లు స్తుతి ఆరాధనకు సమయమును కేటాయింపకూడదు. కొన్ని ఆరాధన కూటములలో స్తుతి ఆరాధన పరిశుద్ధాత్మ కృపావరముల ప్రవాహము ఎన్నో గంటలు కొనసాగిన పిమ్మట ప్రసంగీకుడు వేదిక నెక్కి ప్రసంగించుటకు బదులు ముగింపు ప్రార్థన. చేయుట నేను చూసాను.

4. పాటలు ఉజ్జీవ పూర్వకముగా పాడాలి. స్తుతి కీర్తనలతో ప్రారంభించి ప్రభువు సన్నిధిచేత మనము నింపబడాలి.



5. ప్రజలు ఆయా రీతులలో బంధింపబడియుంటే ఆరాధన కూటమును ఎక్కువ సమయము కొనసాగింపకూడదు. వేరొక కార్యక్రమము ద్వారా ఆధ్యాత్మిక విడుదల కలగవచ్చునేమోనని నమ్మి తదుపరి కార్యక్రమము లోనికి నడవాలి.

6. క్రొత్త పాటలు నేర్పించాలి. పాతపాటలు పదే పదే పాడుటవలన నిస్పృహ మిగులును. కాబట్టి క్రొత్త వర్తమానము మరియు అభిషేకముగల విధానముల కొరకు కనిపెట్టి చూడాలి.

7. నాయకులైనవారు స్నేహభావము కలిగి చిరునవ్వుతో ప్రజలను పలకరించి ప్రభువు సన్నిధికి వారిని ఆహ్వానించాలి. మన వైఖరిని బట్టి మనము ప్రజలను ప్రభువు సన్నిధికి నడిపించగలమా లేదా అనేది నిర్ణయింపబడుతుంది. మనము క్రీస్తుకొరకు రాయబారులము గనుక మనతో ప్రజలు స్వేచ్ఛగా సంభాషించగలిగితే దేవునితో కూడా సంభాషించగలిగియుంటారు. గనుక వారిని ఆ రీతిలో ప్రోత్సహిద్దాము.

8. దిగజారిన స్థితిలో ఎవరైనా ఉంటే పాటల ద్వారా వారిని ప్రోత్సహించి విడుదలను కలిగింపజెయ్యాలి.

9. వేదికపై నున్న గాయకులు మంచి మాదిరి గలవారై ప్రభువు సంతోషములోనికి ప్రజలను నడిపించగలిగియుండాలి. వారందరు సంతోషింగలిగేవారైయుండాలి. వారు కేకలు వేస్తూ నాట్యము చేస్తూ చప్పట్లు కొడుతూ చేతులెత్తుట ద్వారా విజయమును తేగలరు.

## ఉద్రేకము

ఉద్రేకముతో కూడిన ఆరాధన శరీరము లేక మనస్సుకు కలిగిన స్పందన వలన సంభవించును. రాజకీయ నాయకులు మరియు నటీనటులు తమ ప్రకృతి సంబంధమైన సామర్థ్యము మరియు తలాంతుల చేత ప్రజలను కదిలింపజేస్తారు. అయితే క్రైస్తవులముగా మనకు తెలియకనే ఇలా కొన్నిసార్లు చేస్తుంటాము. (జకర్యా 4:6, ఫిలిప్పీ 3:3). స్వతంత్ర పూరితమైన శరీర సంబంధమైన ఉద్రేకము ఆరాధన క్రమములోనికి అల్లరిని ప్రవేశ పెడుతుంది. దేవుని కొరకైన ఆశక్తి వివేచనా పూర్వకమైన జ్ఞానముతో సరితూగపరచబడియుండకపోవుటే దీనికి కారణము. ఇటువంటి పరిస్థితిని కూడా ముందు వివరించబడిన నాలుగు పరీక్షల చేత పరిశీలించవచ్చును. ఉద్రేకతకు ప్రాముఖ్యత నిచ్చు ఆరాధనయందు సంతోషము మరియు స్వతంత్రత ఉంటుందిగాని, సమాధానము మరియు ఐక్యత ఉండదు.

## ఉద్రేకముకు విరుగుడు

1. కేవలము ఉద్రేకతకే ప్రాధాన్యతనిచ్చే ఆరాధన కూటములలో సమాధానము, క్రమము, ఐక్యత మరియు భక్తిగల ఆరాధన గూర్చి బోధించాలి.

2. పాటలతో ఆరాధన కార్యక్రమాన్ని ప్రారంభించియుంటే అది ప్రజల హృదయములను సిద్ధపరుస్తుంది. గాయకులైన వారు కూటమునకు ముందే ప్రార్థనలో తమను తాము సిద్ధపరచుకోవాలి. ఆలశ్యముగా వచ్చువారు దేవుని ఆత్మతో ప్రవహించుటకు సిద్ధపడలేరు. తద్వారా దేవుడు ఆశించు ఆరాధన అక్కడ సంభవించదు.

3. సున్నితముగా నిమ్మళమైన సంగీతమును వాయించు వారినే పెట్టుకోవాలి. కొంతమంది సంగీత వాద్యకులు రక్షింపబడకముందు నేర్చుకొనిన సంగీతమును బట్టి మనుష్యులను ఉత్తేజ పరచగలరు. అది బిగ్గరగా వాయించుటవలన కూడా జరగవచ్చును. అయితే ఉద్రేకముతో నిండుకొన్న ఆరాధన కూటములకు సమ తూకమును తేవటానికి సమాధానకరమైన నెమ్మదైన సంగీతము వాయించాలి. కాబట్టి ఆరాధనను నడిపించు నాయకులను ఎంపిక చేసుకొనుటయందు జాగ్రత్త వహించాలి. కొన్ని సంగీత పరికరములు నెమ్మదైన సంగీతమును ఉత్పత్తి చేస్తాయి. మరికొన్ని కేవలము పెద్ద శబ్దమునే సృష్టిస్తాయి. కాబట్టి వాటి విషయములో గమనిక కలిగి నాయకుడైనవాడు ఉండాలి.

4. సౌండ్ సిస్టమ్ మరియు ఏంప్లీఫైర్‌ల ద్వారా పెద్ద శబ్దమును సృష్టింపరాదు. ఎక్కువ శబ్దము చేసిన చోట అధికమైన అభిషేకమొస్తుందనేది అవివేకము. శబ్దమెక్కువైన చోట శరీరముకు ఉత్తేజము కలిగి శరీరమును బట్టి కదలాడుట ఆత్మాభిషేకముతో కలిగిన కదలికకాదు. ఆత్మయందు స్వాతంత్ర్యమున్నది. అయితే ఆ స్వాతంత్ర్యమును శరీరమునకు ఆస్పదము చేసుకొనకయుండాలి.

5. ఉద్రేక పూర్వకముగా నున్న ఆరాధనా కూటములలో పాటలు నడిపించు నాయకుడు మధ్యలో హెచ్చరికలు ఇవ్వ ప్రయత్నించరాదు. ఎందుకనగా ప్రజలు ప్రభువుపై ధ్యాసను కోల్పోయి ఆ నాయకుని మాటలవైపుకు తమ ధ్యాసను మళ్ళిస్తారు. అలా హెచ్చరికలిచ్చేవారు కొందరుండగా సర్వమును పెడద్రోవ పట్టించగలరు. పాటవెంట పాట పాడుట ద్వారా ప్రజలు దేవుని సన్నిధిలో ప్రవేశించుటకు త్రోవ ఏర్పడును.

6. గాయకులు మనుష్యులను తమ వైపుకి ఆకర్షించ ప్రయత్నించరాదు. లోక మందున్న గాయకులు తమ వైపుకే కేవలము మనుష్యులను ఆకర్షించుకుంటారు.



క్రైస్తవ గాయకుడైనవాడు కేవలము మనుష్యులను ప్రభువు సన్నిధికే ఆకర్షింపజేయాలని చూడాలి.

7. ఇతరులను ఆధ్యాత్మిక వివేకము మరియు పరిపక్వతకు నడిపించాలి. అప్పుడు వారు పరిశుద్ధాత్ముని కొరకైన పాత్రలుగా విశాలపరచబడి, తమ భావోద్రేకముల వలన కాక దేవుని అఖండమైన శక్తి చేత కదలింపబడతారు. మత్తయి 11:7లో బాప్తిస్మమిచ్చు యోహాను ప్రజలను తనవైపుకు కాక యేసువైపుకే ఆకర్షించెను. అతడు దేవుని శక్తి కొరకైన స్వచ్ఛమైన మాధ్యముగా నుండెను. యవ్వన క్రైస్తవులు గాలికి ఇటూ అటూ కొట్టుకుపోయే రెల్లువలె ఉంటారు గనుక, దేవుని శక్తి అధిక మోతాదులో వారిమీదికి దిగివచ్చినప్పుడు దాన్ని ఎలా ప్రయోగించుకోవాలో తెలియక దారితప్పుతూ ఉంటారు. తద్వారా కూటములో గలిబిలి లేక అల్లరి సృష్టింపబడుతుంది.

మేమెరిగిన ఒక ప్రశస్తమైన సహోదరి ప్రభువు సన్నిధిని అనుభవిస్తున్న సమయములలో బిగ్గరగా కేకలతో పాటలు పాడేది. కీచుకంఠము కలిగి ఆమె అలా పాడుచుండగా అనేకులు గలిబిలి చెందుచుండేవారు. ఆమె యదార్థముగా దేవుని ఆత్మచేత కదలింపబడుతుందని మేము ఎరిగినప్పటికి ఆ శక్తిని సరియైన రీతిలో ప్రవహింపజేయకపోవుట చేత ఆమె అల్లరికి కర్తగా మారింది. ఆమెను మేము ప్రత్యేకముగా కలుసుకొని, దైవాభిషేకమును క్షేమాభివృద్ధి కలిగించు రీతిలో ప్రయోగించమని సలహాను ఇచ్చాము.

8. కొందరు తరచు ఆరాధన కూటములలో ఐక్యత మరియు సమాధానమును పాడు చేస్తుంటారు. అయితే ఆరాధనా కూటములో అందరితో కలసి ఎలా ప్రవహించాలనేది తెలియక ఇలా చేస్తుంటారు. వారి ఆశక్తి జ్ఞానానుసారమైనది కాకపోవుట దీనికి కారణము.

మరికొన్ని సార్లు కొందరు అహంకారులై అందరి ధ్యాస వారివైపుకి మళ్ళించుకోవాడానికి భిన్నమైన రీతిలో ప్రవర్తిస్తారు. వారు ఆత్మీయులై యున్నారని ప్రజలకు సూచింప యత్నిస్తారు. ఇలా తరచూ ఆరాధనా కూటములను పాడుచేయువారిని ప్రత్యేకముగా పిలిచి ఉపదేశమును నాయకులైనవారు ఇవ్వవలసియున్నారు. అలా స్పందించని యెడల మత్తయి 18:15-17లో నున్న రీతిలో చేయాలి.

9. కొన్నిసార్లు ఆరాధన కూటమును గలిబిలి పరచు ప్రభావమును దురాత్మవలన కూడా కలుగువచ్చును. 1 కొరింథీ 14:33 ఇలా సెలవిస్తుంది, "అలాగే

పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్తగాని అల్లరికి కర్తకాదు". అయితే దురాత్మలు అల్లరికి కర్తలు. తద్వారా దేవుని ప్రజలకు ఓటమిని కలిగిస్తాయి. కొన్నిసార్లు ఆరాధనా కూటములు సాఫీగా సాగకపోవటానికి కారణము గాయకుల మధ్యగల అనైఖ్యత కావచ్చును. లేక వారు ప్రయోగిస్తున్న పరికరములు సరిగ్గా పనిచేయకపోవచ్చును. ప్రకృతి సంబంధమైన ఇలాంటి పరిస్థితులు ఉండగా ఆత్మసంబంధమైన కారణములు అనగా దురాత్మ ప్రభావము చేతకూడా ఆరాధన కూటములలో గలిబిలి మరియు అల్లరి కలగవచ్చును.

శత్రువు కొన్నిసార్లు ఒక వ్యక్తి ద్వారా తప్పుడు కృపావరమును ప్రత్యక్షపరచి తద్వారా ఆరాధన కూటమును పాడుచేయ ప్రయత్నిస్తాడు, అపొ.కా 16:16-18లో ఇలా చదవగలము, "మేము ప్రార్థనా స్థలమునకు వెళ్లుచుండగా (పుతోనును) దయ్యముపట్టినదై, సోదె చెప్పుటచేత తన యజమానులకు బహులాభము సంపాదించుచున్న యొక చిన్నది మాకు ఎదురుగా వచ్చెను. ఆమె పౌలును మమ్మును వెంబడించి – ఈ మనుష్యులు సర్వోన్నతుడైన దేవుని దాసులు. వీరు మీకు రక్షణ మార్గము ప్రచురించువారై యున్నారని కేకలు వేసి చెప్పెను. ఆమె ఈలాగు అనేక దినములు చేయుచుండెను గనుక పౌలు వ్యాకులపడి దానివైపు తిరిగి – నీవు ఈమెను వదలిపొమ్మని యేసుక్రీస్తు నామమున ఆజ్ఞాపించుచున్నానని ఆ దయ్యముతో చెప్పెను; వెంటనే అది ఆమెను వదలిపోయెను". ప్రవచించు సభ్యులు సంఘములో కలిగి ఉండాలని సంఘ నాయకులు ఆశిస్తారు. అంతేగాక తాము గొప్పదైవజనులని ప్రవచింపగల సభ్యులను మరింత ఇష్టపడతారు. అయితే ప్రవచనముల మూలము దురాత్మవలనైనదని పౌలు వివేచించి దానిని యేసుక్రీస్తు నామములో వెళ్లగొట్టాడు. అట్టి వివేచన నిజపరిశుద్ధాత్మ కృపావరముల వలన నాయకులు కలిగియుండాలి. అప్పుడు శత్రువు వారి ఆరాధన కూటములలోనికి ప్రవేశించకుండా చూచుకోగలరు. కొందరు మంచి క్రైస్తవులు కూడా తమకు తెలియకనే మోసగించబడి తప్పుత్రోవ పడతారు. యేసు క్రీస్తనే ప్రత్యక్షత అపొస్తలుడైన పేతురు కలిగిన మరుక్షణమే యేసు పేతురును సాతానా అని సంబోధించారు (మత్తయి 16:22). అంటే పేతురు తనకు తెలియకుండగనే అపవాదిచేత వాడబడ్డాడు. క్రీస్తు అపొస్తలులకు నాయకుడైనవానికే ఇలా సంభవిస్తే మనము అపవాదిచేత పెడత్రోవపట్టింపబడుట అసాధ్యమా? కాబట్టి శత్రుదాడులను ఎదిరించి దేవుని అద్భుత సన్నిధిని కాపాడుకోవడానికి ఆత్మ సంబంధమైన వివేచన మనకెంతో అవసరము.



## ఆత్మలో ఆరాధించుట

స్వాతంత్ర్యము, సంతోషము, ఐక్యత మరియు సమాధానము మన ఆధ్యాత్మిక ఆరాధనలో పదార్థములైయున్నవి. అయితే ఇవన్నీ కలిసి పనిచేసినప్పుడే సరియైన మార్గములో మనముంటాము. లేని యెడల నిర్జీవ పరిచర్యయైన పారంపర్యాచారమును ఆచరిస్తూ లేక ఉద్రేకముతో కూడిన అల్లరిని సృష్టిస్తాము. ఆత్మయందు ఆరాధించుటకు గల తాళపు చెవులను కనుగొన్న కొలదీ యోహాను 4:23లో తండ్రి ఆశించు నిజ ఆరాధికులము అవుతాము. ఆయన మహిమోన్నతమైన సన్నిధిలోనికి ప్రవేశిస్తుండగా దేవుని హృదయాన్ని మెప్పించు ప్రజలముగా మనమవుదము గాక.

**మరికొన్ని సార్లు కొందరు అహంకారులై అందరి ధ్యాస వారివైపుకి మళ్ళించు కోవాడానికి భిన్నమైన రీతిలో ప్రవర్తిస్తారు.**

# ఐదవ అధ్యాయము

## సత్యముతో ఆరాధించుట

యోహాను 4:23లో మన ప్రభువు ఇలా సెలవిచ్చారు, "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు". గత అధ్యాయములో ఆత్మతో ఆరాధించు నిజ ఆరాధనను గూర్చి పఠించాము. ఈ ఉపదేశమందు రెండవ భాగమును మనమిప్పుడు పరిశీలిద్దాము. ఇందు నిజ ఆరాధికుడు సత్యముతో ఆరాధించాలని క్రీస్తు సెలవిస్తున్నారు. సత్యముతో ఆరాధించుటయందు రెండు ప్రధాన పరిధులున్నవి – ఆరాధికుడు మరియు ఆరాధన.

## నిజ ఆరాధికుడు

నిజ ఆరాధికుడు కావాలంటే మొదట నీవు రక్షింపబడిన విశ్వాసివి అయ్యుండాలి. ఈ హేతువు చేతనే ప్రభువైన యేసు బావియొద్దనున్న స్త్రీతో సమరయులకు నిజ ఆరాధన తెలియదని చెప్పారు. పాత నిబంధన కాలములో రక్షణ కేవలము యూదులకే ఇవ్వబడెను (యోహాను 4:22). ఇతర మతస్థులు వివిధ ఆరాధన విధానమును పాటించిరి. కాని నిజ ఆరాధికులు అవ్వాలంటే సత్యమైయున్న క్రీస్తును మొదట అంగీకరించాలి (యోహాను 14:6). తండ్రిని ఆరాధించుటకు వచ్చుటయందు ఇది మొదటిమెట్టు.

కీర్తన 40:6–8లో ఆరాధన యందు ఉన్న ముఖ్యాంశమును దావీదు తెలియజేస్తున్నాడు, "బలులనైనను నైవేద్యములనైనను నీవు కోరుటలేదు. నీవు నాకు చెవులు నిర్మించియున్నావు. దహన బలులనైనను పాపపరిహారార్థ బలులనైనను నీవు తెమ్మనలేదు. అప్పుడు –పుస్తకపుచుట్టలో నన్ను గూర్చి వ్రాయబడిన ప్రకారము నేను వచ్చియున్నాను. నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము. నీ ధర్మశాస్త్రము నా ఆంతర్యములో నున్నది". దేవునికి మనమర్పించగలుగు నిజ ఆరాధన – విధేయతగల హృదయము మరియు జీవితమే. అంతేగాక తన చిత్తముకు లోబడియుండుట వలన కూడా దేవుని సంతోషపెట్టగలము. ఇదంతా లేకుండా మన సంగీతము మరియు గానములు ప్రభువు ఎదుట వ్యర్థమైన శబ్దముగానే నిలిచిపోతాయి (ఆమోసు 5:21–24). ఇదంతా ఉన్నప్పటికి నిజ ఆరాధికులైనవారు తమ జీవితములో వారు చేయు ప్రతి క్రియ ద్వారా దేవునికి వారు ఆరాధనను తెలుపగలరు.



## నిజ ఆరాధన

నిజ ఆరాధికునిగా అర్హత నొందుటకు మన జీవితమునకు ఎంత అవసరమో మన ఆరాధన సత్యమందు జరగాలనేది కూడా అంతే అవసరమని ప్రభువు సెలవిచ్చారు. యోహాను 17:17లో నీ వాక్యమే సత్యమని యేసు సెలవిచ్చెను. గత అధ్యాయములో ప్రస్తావించిన ప్రకారము మన ఆరాధన దేవుని వాక్యమైన సత్యానుసారముగా ఉండాలి. సమతూకముగల ఆరాధన కలిగియుండుటకు గల తాళపు చెవులను పరిశుద్ధ గ్రంథము మన కనుగ్రహించింది. తద్వారా మన గానము మరియు సంగీతము సరియైన రీతిలో నుంటుంది. రానున్న అధ్యాయములలో సత్యముతో దేవుని ఆరాధించుటకు కావలసిన ఆధ్యాత్మిక తాళపు చెవులను పరిశీలించ ప్రయత్నిద్దాము.

## తాళపు చెవి -1-స్తుతి ఆరాధనకు కావలసిన తొమ్మిది పద్ధతులు

ఇది వరకు చూచిన ప్రకారము దావీదు దేవుని హృదయానుసారియై సంగీతము మరియు గానములతో ప్రభువును ఆరాధించుటను పునరుద్ధరించాడు. దావీదు మరియు ఇశ్రాయేలీయులు స్తుతి ఆరాధన ద్వారా తమను తాము ప్రభువుకు సమర్పించుకున్నారు. ఈ దిగువ తొమ్మిది పద్ధతుల ద్వారా సత్యముతో ఆరాధించుట ఎలా అనేది మనము నేర్చుకుందాము.

***స్వరముతో :***

1. కృతజ్ఞతాస్తుతులు : (కీర్తన 100:3, 69:30, 1దిన 16:4).
2. గానములతో : (కీర్తన 47:6, 147:1, కొలొస్స 3:16).
3. కేకలతో : (కీర్తన 32:11, 47:1,5,27:6).

***చేతులతో :***

4. సంగీత వాద్యములతో : (కీర్తన 150:3–5, 1 దిన 16:4–6).
5. చేతులెత్తుట ద్వారా : (కీర్తన 134:2, 63:4).
6. చప్పట్లు కొట్టుట ద్వారా : (కీర్తన 47:1, 98:8).

***దేహముతో :***

7. నాట్యముతో మరియు గంతులు వేయుటతో : (కీర్తన 149:3, 2 సమూ 6:14,16).
8. మోకరించుట మరియు సాగిలపడుట ద్వారా : (కీర్తన 95:6, ఆది 24:52)
9. నిలువబడుటతో : (కీర్తన 134:1, కీర్తన 135:1–2, 33:8).

## స్వర ప్రయోగము

మొదటి మూడు పద్ధతులలో మన స్వరములను ఉపయోగించగలము. కృతజ్ఞతాస్తుతి అనేది మాటల ద్వారా మన కృతజ్ఞతను తెలియజేయుట. అయితే పాటల ద్వారా చేసినప్పుడు సంగీత వాద్యములుండుట మంచిది. కేకలు వేయుటద్వారా కూడా మన స్వరమెత్తి మన బలమంతటితో ప్రభువును స్తుతించగలము.

సంతోషముతో ఉత్సాహధ్వని చేయమని కీర్తన 32:11 మనకు చెబుతుంది. హెబ్రీ భాషలో ధ్వని అనగా 'తెరుహ' అని ఉంది. విజయోత్సవమైన ధ్వని అని అర్థము. ఇదే పదము యుద్ధరంగ ప్రవేశములో కూడా ఉపయోగిస్తారు. యెహోషువ మరియు ఇశ్రాయేలీయులు యెరికో ప్రాకారములు కూలినప్పుడు వేసిన కేకను తెరుహాగా చూడగలము.

స్తుతిలో భాగముగా విజయోత్సవము చేయుట విశ్వాస ప్రకటనైయున్నది. విజయోత్సవముతో కూడిన కేకలు దైవాభిషేకమును విడుదల చేస్తాయి. దీనికి ఉదాహరణ 2దిన13:15లో చూడగలము, "అప్పుడు యూదావారు ఆర్భటించిరి; యూదావారు ఆర్భటించినప్పుడు యరొబామును ఇశ్రాయేలు వారందరును అబీయా యెదుటను యూదావారి ఎదుటను నిలువలేకుండునట్లు దేవుడు వారిని మొత్తినందున".

సంఘ ఆరాధన కూటములో మనము చేయు ఆధ్యాత్మిక పోరాటమందు కూడా ఇది ప్రయోగపడును. దీనికి ఉదాహరణ కీర్తన 27:6లో చూడగలము, "ఇప్పుడు నన్ను చుట్టుకొనియున్న నా శత్రువులకంటె ఎత్తుగా నాతల యెత్తబడును. ఆయన గుడారములో నేను ఉత్సాహ ధ్వని చేయుచు బలులు అర్పించెదను, నేను పాడెదను, యెహోవాను గూర్చి స్తుతిగానము చేసెదను". విశ్వాసము ద్వారా దావీదు తన శత్రువులపై విజయమును సాధించుకొనెను. ఎందుకనగా యుద్ధమునకు వెళ్ళకముందే ప్రభువు సన్నిధిలో ప్రత్యక్ష గుడారమందు విజయోత్సాహమైన కేకలు ఆయన వేసెను (కీర్తన 27:1-6).

కొన్నిసార్లు ఆరాధనా కూటమందు స్తుతి సంతోషము మరియు విశ్వాస లోపమైనదిగా ఉండవచ్చును. అయితే అకస్మాత్తుగా ఒకని హృదయములో విజయము తలెత్తి, హల్లేలూయా లేక దేవునికి స్తోత్రం అని కేకలు వేయుట ఆరంభించినప్పుడు సమాజములో నున్న నిద్రిస్తున్న పరిశుద్ధులను ఆత్మీయముగా మేల్కొనజేసి తాజాయైన అభిషేకమును విడుదల చేస్తుంది. దీని అర్థము మౌనముగానున్న సమయములలో అకస్మాత్తుగా కేకలు వేసి ఆరాధనా కూటమును గలిబిలి పరచమని కాదు లేక



ఇతరులదృష్టి మనవైపుకు త్రిప్పుకోమనికాదు. సరియైన అనుకూల సమయములో స్తుతి విజయోత్సవమైన స్వరముతో పలికినప్పుడు అది అభిషేకమును విడుదల చేస్తుంది. కొన్నిసార్లు ఆరాధన నడిపించు నాయకుడు సమాజమంతటిని ఏకుమ్మడిగా విజయోత్సవమును ప్రకటించు కేకలు వేయిస్తాడు.

## చేతులతో

చేతులతో మనము చేయగలుగు క్రియలను ఇప్పుడు చూద్దాము. మొదటిగా సంగీతమును వాయించుట. సంగీత వాయిద్యములు వాయిస్తున్నప్పుడు చేతులను ప్రయోగిస్తాము. ఉదాహరణకు హెబ్రీ భాషలో సంగీతము వాయించుట అంటే సితారాను వాయించుట అని అర్థము. కీర్తన 33:3లో మన తలాంతును అభివృద్ధి పరచుకోవాలని హెచ్చరింపబడుచున్నాము.

చేతులెత్తుట ద్వారా కూడా మనము స్తుతి ఆరాధన చేయగలము. లోకమందు చేతులెత్తుట ద్వారా ఓటమిని తెలియజేస్తారు. అంటేవారు లోబడిపోయినట్లు సూచిస్తారు. అదే విధముగా ప్రభువుకు మనల్ని మనము లోబరచుకున్నామని తెలియజేయుటకు చేతులెత్తుట సరియైన పద్ధతి. 1తిమో2:8లో ఇలా వ్రాయబడి యున్నది, "కావున ప్రతిస్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను". ఈ ప్రక్రియ ద్వారా మనల్ని వెదకి శోధించమని ప్రభువును మనము ఆహ్వానించుచున్నాము. దావీదు కీర్తన 139:24లో ఇలా అంటున్నాడు, "దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము, నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము".

దేనినైనా ప్రకటించాలన్నా లేక ముఖ్యమైన ప్రసంగమేదైనా చెయ్యాలన్నా మనుష్యులు చేతులెత్తుతారు. మనుష్యులను నిమ్మళపరచుటకు ధ్యాసను మళ్ళించుటకు కూడా చేతులెత్తుతారు (అపొ.కా. 12:17, 21:40). వట్టుపెట్టుకున్నప్పుడు కూడా మనుష్యులు చేతులెత్తుతారు (ప్రకటన 10:5-6). చేతులెత్తుట ద్వారా మనము దేని విషయమై గానము చేస్తున్నామో తెలియజేస్తున్నాము.

సంగీత వాయిద్యములు వాయిస్తూ చేతులెత్తుట మాత్రమే కాక చప్పట్లు కొట్టుట ద్వారాకూడా దేవుని మహిమ పరచగలము. పాటకు తాళము చప్పట్లు ద్వారా మనము కొట్టగలము. ఆ చేతులను ఒక సంగీత వాయిద్యముగా కూడా వాడగలము. చేతులెత్తుట

అనేది ప్రభువుకు స్తుతిని తెలియజేయుట మరియు ఆయన చేసిన కార్యముల కొరకై కృతజ్ఞత చెప్పుట (2 రాజు 11:12).

## దేహముతో

దేహముతో మనము మూడువిధములుగా ప్రభువును స్తుతించగలము. మొదటిగా నాట్యము చేస్తూ గంతులు వేయుట ద్వారా; ఇది గొప్ప సంతోషాన్ని సూచించేదని గ్రహించగలము. మన హృదయములో నున్న ఉత్తేజము మనల్ని మౌనముగా ఉండనివ్వదు. అది నాట్యము మరియు గంతులు వేయుట ద్వారా బయలు పరచబడుతుంది.

అనేక దినముల పరిచర్య ముగించుకొని ఇంటికి వచ్చినప్పుడు నా పిల్లలు సంతోషముతో గంతులు వేయుట నాకిప్పటికీ జ్ఞాపకమే. నా స్వరము వినగానే పిల్లలు నాన్నగారు ఇంటికి వచ్చారని నాట్యము చేస్తూ గంతులు వేసేవారు. నీ రాక వారి హృదయాన్ని సంతోషముతో ఉప్పొంగజేసి వారిని ఉత్తేజపరచేది. అంతట నేను వారిని ఎత్తుకొని వారిపట్ల నా ప్రేమను తెలియజేసేవాడిని. మన పరలోకపు తండ్రి మనకొరకు అదే విధముగా కనిపెట్టుచున్నాడు. చిన్న పిల్లలువలె మనము గంతులు వేయుచు సంతోషముతో ఆయన పట్ల మనకున్న కృతజ్ఞత, ఆయనను బట్టి మన ఆనందాన్ని వ్యక్తం చేసినప్పుడు ఆయన కూడా మనలను అలా చేరదీసి ఆయన ప్రేమను మన పట్ల వ్యక్తము చేయనిష్టపడతాడు.

నాట్యము చేయుట మరియు గంతులు వేయుటను గూర్చి కీర్తన 149:3 ఇలా సెలవిస్తుంది, “నాట్యముతో వారు ఆయన నామమును స్తుతించుదురుగాక. తంబురతోను సితారతోను ఆయననుగూర్చి గానము చేయుదురుగాక”. హెబ్రీ భాషలో నాట్యము అనగా గుండ్రముగా తిరుగుట అని సూచిస్తుంది. మరియు 1 దిన 15:29లో నాట్యము చేయుట గంతులు వేయుటను సూచిస్తుంది. ఆదిమ హెబ్రీభాషలో నాట్యమనగా ‘మాకొల్’, మరియు గంతులు వేయుట అనగా ‘రాకాడ్’.

పరిశుద్ధ గ్రంథములో ఈ రెండు పదములు నాట్యముకు మరియు గంతులు వేయుటకు సూచనగా నున్నవి. అయితే పరిశుద్ధ గ్రంథము ఎంతమాత్రము కూడా నడుము త్రిప్పుట లేక ఆధునిక నాట్యరంగములో కనిపించే అశ్లీల శరీర కదలికలను ప్రోత్సహించుట లేదు. ఇది కేవలము దురాశను ప్రోత్సహించే అసభ్యకరమైన నాట్యవిధానము.



అనేక సంవత్సరముల క్రితము ఒక సేవకుల సదస్సులో దీని ప్రమాదమును నేను చూసాను. సుమారు మూడువేలమంది ఈ కూటముకు హాజరైరి. వారిలో తొంభైశాతము పురుషులే. ఈ కూటమును నడిపించుటకు ఇద్దరు స్త్రీలు గాయక బృందనాయకులుగా నుండిరి. స్తుతిని నడిపించుటయందు వారు గొప్ప ప్రావీణ్యత కలిగియుండిరి. కాని పాటను ఆరంభించుటతోనే ఆ పాటలోనున్న మాటలను ప్రయోగిస్తూ వాటికి తగిన శరీర కదిలికలను కూడా చేస్తుండిరి. ఇలా శరీర అవయవములను కదలిస్తూ నడుము ఊపుట కూడా ప్రారంభించారు, అయితే వారి పరిచర్యలో కనబడిన ఈ మిశ్రమము వలన ఆత్మలో నుండాలని ఇష్టపడిన సేవకులందరు తమ కళ్లు మూసుకున్నారు. కాబట్టి సంఘనాయకులైనవారు సంగీత బృందనాయకులను నియమిస్తున్నప్పుడు వారి ఉద్దేశ్యములు మరియు పద్ధతులను పరిశీలించి వివేచనా పూర్వకముగా వారిని నియమించాలి.

ఆరాధనలో మరొక విధానము మోకరించుట లేక సాగిలపడుట. పరిశుద్ధ గ్రంథములో ఆరాధన అనేమాటకు సాగిలపడుట అని అర్థము. ఇది కేవలము తమను తాము తగ్గించుకొనుట మాత్రమేగాక, దేవుని తమలో ఆరాధించుటను కూడా వ్యక్తపరుస్తుంది.

కొన్నిసార్లు సమాజములో మోకరించుటను గూర్చి లేక సాగిలపడుటను గూర్చి పాటలైతే పాడుతారు కాని అనేకసార్లు ఆ ప్రకారముగా చేయనే చేయరు. స్తుతి ఆరాధనను గూర్చి లేఖనాను సారమైన పదములు ఉపయోగించుట సరిపడదు. ఆ ప్రకారముగా చేయువారముగా మనముండాలి (యాకోబు 1:22). పాటలు నడిపించే నాయకులు సంఘస్థుల యెదుట నిలిచి సంఘమును ఆ ప్రకారము నడిపించాలి. స్తుతి ఆరాధన విషయములో వారు మంచి మాదిరి నెలకొల్పినప్పుడు ఇతరులు కూడా సహాయపడతారు.

నిలబడుట స్తుతి ఆరాధనను వ్యక్తపరచుటయందు మూడవ విధానము. ఒకరి పట్ల గౌరవమును నిలబడుటద్వారా మనము సూచించవచ్చును. ఉన్నతాధికారి ఎదురుపడినప్పుడు సైనికులైనవారు నిలబడి నిటారుగా ఉండాలి. రాజు యెదుట నిలబడియుండుట గౌరవార్థమైన సంగతి.

ప్రభువును ఘనపరచుటకు సంఘమంతటిని నిలబెట్టుటనేది మంచి పద్ధతేగాని, దీర్ఘకాలము అలా చేయుట లేక వృద్ధులైన పరిశుద్ధులను అలా నిలువబెట్టుట అనేది అంత పద్ధతికాదు. మధ్యలో అప్పుడప్పుడు కూర్చొని యుండుటనేది మంచి పద్ధతి. కాబట్టి సంఘ సభ్యులు మనతో పూర్తిగా పాలిపంపులు పంచుకునేటట్లుగా మన ఆరాధన కూటములు ఉండాలి. అయితే అందరూ మనతో ఏకీభవిస్తారని చెప్పలేము.

## పాలిపంచుకో లేక గొడ్రాలిగా మిగిలిపో

రాజైన దావీదు 1దిన15:28–29లో జాతీయ స్తుతి ఆరాధన కూటమును నడిపిస్తున్నప్పుడు మీకాలు తప్ప ఇశ్రాయేలీయులందరూ తనతో ఏకీభవించిరి. ఆ వచనములు దిగువరీతిలో నున్నవి, “ఇశ్రాయేలీయులందరు ఆర్భాటము చేయుచు, కొమ్ములు, బూరలు ఊదుచు, తాళములు కొట్టుచు, స్వరమండలములు సితారాలు వాయించుచు యెహోవా నిబంధన మందసమును తీసికొని వచ్చిరి. యెహోవా నిబంధన మందసము దావీదు పురములోనికి రాగా సౌలు కుమార్తెయైన మీకాలు కిటికీలోనుండి చూచి రాజైన దావీదు నాట్యమాడుటయు వాయించుటయు కనుగొని తన మనస్సులో అతని హీనపరచెను”.

మీకాలు స్తుతి ఆరాధనను తిరస్కరించి దానిని విమర్శించసాగింది. అందరితో కలిసి ప్రభువును స్తుతించుట మాని, ఇంటనే ఉండి తన కిటికీలోనుండి క్రిందకి చూస్తూ ఉంది.

ఈ లేఖన భాగములో మీకాలు సౌలుకు కుమార్తెయని, దావీదు భార్యయని మనము గమనించగలము. తన జీవితములో రెండు ప్రధాన సాంఘీక పదవులను సేవించింది. అయితే ఈ రెండు కూడా ఒక క్రైస్తవునికి కావలసిన రెండు గుణలక్షణములను సూచిస్తుంది. ఆదాము వలన కలిగిన ప్రాచీన స్వభావము అనగా వెనక్కిజారిన ఆమె తండ్రియైన సౌలు అవిధేయతను మీకాలు పొందుకుంది. అయితే మనము తిరిగి జన్మించినప్పుడు క్రీస్తునందు నూతన స్వభావమును ధరించుకుంటాము. అటువలె మీకాలు దావీదు భార్యకావడంతో ఆ నూతన స్వభావాన్ని కొంతమేరకు ధరించుకొంది.

విచారకరముగా దావీదుతో ఆమె ఏకీభవించలేదు. అలా అనుమతించి యుండియుంటే ఆమె భర్తతో కలిసి ఆమె కూడా ప్రభువు యెదుట ఆరాధన చేసియుండేది. ఈ లేఖన భాగములో ఆమె సౌలు కుమార్తెగా సంభోదించబడుతుంది. ఎందుకనగా సౌలు గుణమును అక్కడ వ్యక్త పరుస్తుంది. రాజైన సౌలు దావీదును అసహ్యించుకున్న ప్రకారమే విమర్శతో కూడిన తన కుమార్తె కూడా దావీదును అసహ్యించుకుంది. మన హృదయములు మరియు జీవితములలో ఇటువంటి పోరాటము ఉంటూనే ఉంటుంది. రోమా 6–8లో పూర్వపు ఆదాము స్వభావము మరియు నేడు క్రీస్తువలనైన నూతన స్వభావము మధ్యగల పోరాటమును చూడగలము. ప్రాచీనమైన ఆదాము స్వభావముకు మృతిచెంది క్రీస్తుతో ఐఖ్యపడాలి. మీకాలు ఆమె తండ్రిని విడిచి దావీదుతో ఏకమవ్వాలి. క్రైస్తవులమైన తరువాత కూడా మనమింకను



శరీర సంబంధమైన ఆదాము స్వభావమునందే నిలిచియుంటే, మన హృదయములు కఠినమై దేవుని సంగతులపట్ల విమర్శనాత్మను పొందుకుంటాము. అప్పటినుండి నిజమైన ఆరాధన కూటములను విమర్శిస్తూ కేవలము ఉజ్జీవమును చూస్తామేగాని దానిలో పాలు పంచుకొనము.

2 సమూ 6:20–23లో మీకాలు యొక్క అంతిమ స్థితిని చూస్తాము. దావీదు ఇంటికి రాగానే ఆమె తనను గద్దించింది. ఆమె వైఖరిని బట్టి జీవితాంతము గొడ్రాలుగా మిగిలిపోయింది. దేవుని తీర్పు ఆమె మీదికి అలా దిగింది. అయితే స్తుతి ఆరాధనను తిరస్కరించి దానిని విమర్శించువారు కూడా ఆధ్యాత్మికముగా గొడ్రాళ్ళుగా ఉండిపోతారు. మన జీవితములు మరియు పరిచర్య నిష్ఫలముగా ఉంటుంది. ఒక సంఘము మీకాలువలె స్తుతి ఆరాధనను తిరస్కరిస్తే అది యెన్నటికీ ఎదగదు.

స్తుతి ఆరాధన విషయమైన దేవుని నమూనాను ఎంతమాత్రమును అసహ్యించుకొనకుండా మనల్ని మనము జాగ్రత్త పరచుకోవాలి. మన సంఘములో నున్న ప్రతీ సభ్యునికి కూడా చప్పట్లు కొట్టుట, పాటలు పాడుట, కేకలు వేయుట, చేతులెత్తుట, నాట్యమాడుట, మరియు సాగిలపడుటను నేర్పించాలి. వారు సిగ్గు పడినా లేక తమను గూర్చి తాము ఆలోచించేవారుగా ఉంటే అట్టివారిని ప్రభువు సన్నిధిలో ఏకాంత సమయముల యందు దేవుని స్తుతించమని ప్రోత్సహించవలెను. వ్యక్తిగత ప్రార్థనా సమయములో వారు విడుదలను పొందుకొన్న పిమ్మట సామూహికముగా మిగిలిన వారందరితో కలిసి స్తుతి ఆరాధనలో పాలిపంచుకోగలరు.

## రెండవ తాళపుచెవి - స్తుతి ఆరాధనను అర్థము చేసుకొనుట

స్తుతికి మరియు ఆరాధనకు వ్యత్యాసమేమి? ఇవి రెండూ ఒక్కలాగే ఉంటాయి గనుక వీటి మధ్యనున్న తేడాను వివరించుట కష్టతరమవుతుంది. అయితే దిగువ వివరణ వాటి మధ్యనున్న అంశమును తెలుసుకొనుటకు సహాయపడవచ్చును.

స్తుతి అని ఇంగ్లీషులో మనము చూసే పదముకు పర్యాయపదములు అనేకములున్నవి. ఉత్సహించుట, ఆమోదించుట, మెచ్చుకొనుట మరియు గొప్ప చేయుట. స్తుతి అనేది సంతోషముతో కూడిన అనుభూతి. అది ఉత్సాహమును తెలియజేసేది.

ఆరాధనకు వివిధ పర్యాయ పదములున్నవి. అవేమనగా సాగిలపడుట, గౌరవించుట, సన్మానించుట మరియు భక్తిని వ్యక్తపరచుట. కాబట్టి ఈ పదములను

బట్టి స్తుతి కంటే ఆరాధన లోతైన అనుభవమని, దేవునితో సన్నిహిత సంబంధము కలిగియుండటను సూచించేదని తెలుసుకోగలము.

మనుష్యులు స్తుతికి పాత్రులు కావచ్చునని లేఖనములు స్పష్టపరుస్తున్నవి. సామె 31:30లో మనమిలా చదవగలము, "యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును". దేవుడు ఒక్కడే ఆరాధనకు యోగ్యుడనికూడా లేఖనములు తెలియజేస్తున్నవి (మత్తయి 4:10, అపొ.కా. 10:25-26, ప్రకటన 22:8-9).

స్తుతి అనేది దేవుని క్రియలు లేక పనులను వ్యక్తపరచేది (కీర్తన 7:17, 21:13, 42:5, 106:2, 118:21, 139:14). అందును బట్టి స్తుతించుట ఆరంభించుట ఆరాధనకంటే సులభమైనది. ఎందుకనగా అది దేవుని క్రియలను బట్టి ప్రేరేపించబడే క్రియ. అయితే ఆరాధననేది దేవుని స్వభావమును బట్టి మనలో నుండి కలుగు కృతజ్ఞతాభావము (నిర్గమ 34:5-8, యోహాను 9:35-38). కాబట్టి దేవుని హృదయాంతరంగము నుద్దేశించి చేయు ఆరాధననారంభించుట కష్టతరమవుతుంది.

స్తుతిలో వేగము, ఉత్తేజము, రాగము మరియు తాళము ఇమిడియుంటాయి (కీర్తన 149:1-3, 150:3-5, 30:11-12). వీటిని బట్టి మనము మెలకువ కలిగి ప్రభువు మీద మనస్సు కేంద్రీకరించుటకు సాధ్యపడుతుంది.

ఆరాధనలో క్రియ కనబడదు. దానిలో తాళము అంతగా ఉండదు (కీర్తన 95:6, ప్రకటన 7:11, మత్తయి 2:11). దేవుని మహిమోనత్నతమైన సన్నిధిలోనికి ప్రవేశింపగా మన ధ్యాసంతయు ఆయన మీద కేంద్రీకరింపబడుట ద్వారా మన శరీర క్రియలన్నియు కూడా తగ్గింపబడి ప్రభువునే ఆరాధించే స్థాయికి మనము వస్తాము (హబక్కూకు 2:20, 1 కొరింథీ 1:29).

స్తుతికి మరియు ఆరాధనకు మధ్యనున్న వ్యత్యాసము మరొకటియున్నది. స్తుతించుటకు ఆ వ్యక్తి అక్కడుండనక్కరలేదు (సామె 31:31, 1 కొరింథీ 11:2, ప్రసంగి 4:2). కానీ ఆరాధించాలంటే ఆరాధనకు యోగ్యుడైన వారు అక్కడ ఉండాలి (మత్తయి 2:2, మార్కు 5:6, నిర్గమ 34:5-6).

ఈ వ్యత్యాసమును బట్టి దేవుని సన్నిధి సాక్షాత్తూ లేకపోయినప్పటికి ప్రభువును మనము స్తుతించుట ఆరంభించగలము. ఆరాధనాకూటములు ఈ విధముగా ప్రారంభమవ్వాలి. అలా కొంతసమయము గడిచిన తరువాత ప్రభువు సన్నిధి మనమధ్య ప్రత్యక్షమైన పిమ్మట, మనము నిజమైన ఆరాధనలోనికి ప్రవేశిస్తాము. అనేక ఆరాధన కూటములు నెమ్మదిగా ప్రారంభమైనప్పటికి ప్రభువును స్తుతించుట కొరకు మనల్ని మనము సిద్ధపరచుకొనుచుండగా దేవుని సన్నిధిలోనికి మనము ప్రవేశింప



నారంభిస్తాము. దేవుని సన్నిధి లేనప్పటికి ఆయనను మనము స్తుతించినప్పుడు తక్కువ సమయములోనే ఆస్తుతి మనల్ని దేవుని సన్నిధికి నడిపిస్తుంది (కీర్తన 100:4, 95:2). ఇక దేవుని సన్నిధిలోనికి మనము ప్రవేశించిన పిమ్మట స్తుతినుంచి ఆరాధనలోనికి మనము సాగగలము (కీర్తన 132:7, మత్తయి 28:9). కాబట్టి ఆరాధనా కూటములు స్తుతితో ఆరంభమై ఆరాధనతో ముగిస్తాయి.

స్తుతి ఆరాధన క్రమక్రమాభివృద్ధి చెందేదని మోషే యొక్క ప్రత్యక్షపు గుడారము కూడా మనకు బోధిస్తుంది. కృతజ్ఞతా స్తుతులతో ఆయన గుమ్మాలలోనికి ప్రవేశిస్తామని కీర్తన 100:4 తెలియజేస్తుంది. ఇది కృతజ్ఞత, ప్రార్థన, హెచ్చరికల ద్వారా కావచ్చును. ఈ ప్రారంభ దశలో ప్రభువు సన్నిధిని వెదకులాగున జనులను మనము ప్రోత్సహించాలి. అంతట ఆవరణమును దాటి లోపలున్న పరిశుద్ధ స్థలము లోనికి మనము ప్రవేశించినప్పుడు స్తుతి యాగమును అర్పించువారముగా మనముంటాము (హెబ్రీ 13:15). పాత నిబంధన పరిశుద్ధులు కూడా తమ బలులను బయట ఆవరణములో అర్పించిరి. కాని ఆరాధననేది పరిశుద్ధ స్థలములో జరిగేది.

మనస్తుతి మరియు పాటల ద్వారా ప్రభువు సన్నిధి సాధారణముగా మనమధ్య ప్రత్యక్షమవుతుంది. ఈ దశలో మనము ప్రత్యక్షపు గుడారములో ప్రవేశించు వారమవుతాము. అలా ప్రవేశించిన మనల్ని ప్రభువు సన్నిధి ఆవరిస్తుంది. ఇక్కడ అనగా పరిశుద్ధ స్థలములో ఆరాధన ప్రారంభమవుతుంది (కీర్తన 132:2). అయితే దానిని దాటి తెరలోగుండా ప్రవేశించి మన క్రియలకు స్వస్తి చెప్పి, ప్రభువు సన్నిధికి ప్రవేశించినప్పుడు అది అతి పరిశుద్ధ స్థల ప్రవేశముగా నుంటుంది (మార్కు 15:35-38, హెబ్రీ 10:20). అతి పరిశుద్ధ స్థలములో మనము చేయగల్గేది ఆరాధనయే. దేవుని షేకీనా మహిమ ప్రత్యక్షమవుతుంది. అంతట మన హృదయము ప్రభువు పట్ల ప్రేమతోనే నిండిపోయి ఆయన యెదుట మౌనము వహిస్తాము (జకర్యా 2:13, కీర్తన 46:10).

## బైబిల్ సంఖ్య శాస్త్రము మరియు సంగీతము-మూడవ తాళపు చెవి

దేవుడు తన జ్ఞానము చొప్పున సమస్తము సృజించి దానిలో సంగీతమును కూడా ఇమిడ్చి అది ప్రతివిధమైన శాస్త్రీయ మరియు ఆధ్యాత్మిక తత్వములకు అనుకూలపరచెను. లేఖనములు మనము పరిశీలిస్తున్నప్పుడు సంఖ్యలకు ఆధ్యాత్మిక గుర్తింపు ఉన్నదని స్పష్టమగుచున్నది. కాబట్టి పరిశుద్ధ గ్రంథములో నున్న సంఖ్యలకు ఆధ్యాత్మిక గూఢార్థములు ఉంటాయి.

గాలిని ఊదుటద్వారా సంగీతమును ఉత్పత్తి చేయగలము. అయితే దానిని రెట్టింపు చేసినప్పుడు స్వరము మారుతుంది. సంగీతమందు సప్తస్వరములున్నవి (స.రి.గ.మ.ప.ద.ని). పరిశుద్ధ గ్రంథములో ఏడు అనే సంఖ్య సంపూర్ణత, పరిపూర్ణత, మరియు విశ్రాంతికి సూచన. అదే విధముగా ఈ ఏడు స్వరములు సంగీతమును సంపూర్తి చేస్తాయి. ఎనిమిది నూతన ఆరంభమును సూచించే సంఖ్య. కాబట్టి ఎనిమిదవ స్వరము ఒక నూతన అంతస్థుకు మనల్ని తీసుకుపోయేది.

అర్ధ స్వరములను పై సప్తస్వరములతో కూడితే దానిని క్రొమెటిక్ స్కేల్ అంటారు. ఈ పన్నెండు స్వరములు సంగీతమును నిర్ణయిస్తాయి. సంగీతమనేది ప్రభుత్వమును సూచించు సంఖ్య. ఇది ఇశ్రాయేలు పన్నెండు గోత్రములు, సంఘమును స్థాపించిన పన్నెండు అపొస్తలులు, పగలు రాత్రిని విభజించు పన్నెండు గంటలు మరియు సంవత్సరములో పన్నెండు మాసములకు సూచన.

మూడు సరియైన స్వరములను సమకూర్చితే ఒక రాగము తయారవుతుంది. ఈ రాగము మూడు స్వరములచేత సమకూర్చ బడుట త్రిత్వమైన తండ్రికుమార పరిశుద్ధాత్మలకు సాదృశ్యము.

ఈ రాగములో మొదటి స్వరము ప్రారంభ స్వరమైతే సమస్తానికీ ప్రారంభమైన తండ్రికి సూచన. రెండవ స్వరము మధ్యంతర స్వరమంటే మధ్యవర్తియైన కుమారునికి సాదృశ్యము. మూడవ స్వరము పాలించు స్వరము. ఇది పరిశుద్ధాత్మునికి సాదృశ్యము.

త్రిత్వ శబ్దములతో కూడిన రాగము రెండు రకములైన శృతులతో ఏర్పడియుంటుంది. ఒక రకము సంతోష శబ్దమును చేసేదైతే రెండవది విచారమును సూచిస్తుంది. పరలోకముకు భూమికి ఉన్న వ్యత్యాసమును ఇది సూచిస్తుంది. జంతు మరియు పక్షుల ప్రపంచము దీనిని నిర్ధారిస్తుంది. ఆదాము కూలిన నాటినుండి భూమి విచారమును సూచించు శృతిగా సంగీతమును కలిగియుంది (రోమా 8:20-22). కాబట్టి మన సంగీతములో ఇటువంటి శృతిని ప్రయోగించు రాగములు లేకుండా చూచుకోవాలి. ఎందుకంటే ఈ లోక సంబంధమైన విచారము మరణాన్ని చేకూరుస్తుంది (2 కొరింథీ 7:10).

ఈ రెండు రకములైన శృతులకు మధ్యరకమైనదొకటి కలదు. ఇది మధ్యవర్తియైన క్రీస్తుకు సాదృశ్యమని చెప్పవచ్చును. శాపము నుండి మనుష్యులను విమోచించుటకు క్రీస్తు పరలోకమునుండి దిగివచ్చి భూమిపై మనుష్యునిగా జన్మించెను. పాపము యొక్క ప్రతిఫలమును తనపై మోపుకొని శిలువపై మరణించి మనలను ఆయనతో కూడా పరలోకానికి లేపుకున్నాడు. కాబట్టి మనమిప్పుడు క్రీస్తు నందు



పరలోక సంబంధమైన స్థలములలో కూర్చుండబెట్టబడియున్నాము. కాబట్టి ఈ మధ్య కాలమందున్న స్వరము సంతోషాన్ని సూచించేదిగా ఉంటుంది.

సప్తస్వరములకు మరొక రెండు స్వరములు కలిపినట్లయితే ఆత్మలో తాజాయైన విడుదలను రుచికరమైన సంగీతము ఉత్పన్నమవుతుంది. ఇది 9 కృపావరములు మరియు 9 ఆత్మఫలములకు సూచన. సార్వత్రిక ప్రపంచమందు పెంతుకోస్తు అనుభవము పునరుత్థరింపబడినప్పుడు సంగీత వాయిద్యకులు ఈ నవ స్వరములను ప్రయోగించిరి. వీటికి మరొక రెండు స్వరములు సమకూడితే అది బహుభిన్నమైన రాగమును సృష్టిస్తుంది. యూదా తిరుగుబాటు చేసి మిగిలిన 11మంది అపొస్తలులను విడిచిపెట్టుట, తద్వారా పదమూడవవ్యక్తి అపొస్తలుడుగా నియమింపబడుట. అంతేగాక ఆది 14:4లో సూచింపబడిన ప్రకారము పదమూడు తిరుగుబాటుకు సూచన. ఈ విధముగా 11 మరియు 13వ స్వరము భిన్నమైన సంగీతమును సృష్టిస్తుంది. కాబట్టి పరిశుద్ధ గ్రంథములో గల సంఖ్యలను సంగీత నియమములతో సరిపోల్చుట మనకు నూతన ప్రోత్సాహమును ఇచ్చి జ్ఞానయుక్తముగా ప్రభువును ఆరాధించుటకు సహాయపడుతుంది. కాబట్టి ఈ జ్ఞానమును ప్రయోగించి సంగీతమును దేవుని రాజ్య వ్యాప్తి కొరకు ప్రయోగింతుము గాక.

**దీని అర్థము మౌనముగానున్న సమయములలో అకస్మాత్తుగా కేకలు వేసి ఆరాధనా కూటమును గలిబిలి పరచమని కాదు లేక ఇతరులదృష్టి మనవైపుకు త్రిప్పుకోమనికాదు.**

# ఆరవ అధ్యాయము

## సమతూకముగల సంగీతము మరియు దైవారాధన

ఆధ్యాత్మిక ఎదుగుదలకు కావలసిన ప్రధానమైన తాళపుచెవి మన జీవితములో వివిధమైన పరిధులలో సమతూకము కలిగియుండుటయే. ఈ పరిధులలో ప్రాముఖ్యమైనవి ఆరాధనయని లేఖనములు రుజువు చేస్తున్నవి. ప్రభువు మనల్ని సృష్టించిన విధానమును చూడండి. ఆరాధించు సామర్థ్యము ప్రభువు మనలో పెట్టాడు. ఇందును బట్టి వీటి మధ్య సమతూకము అవసరము.

## మనుష్యులలో గల మూడు భాగములు

మానవుని మన పోలిక చొప్పున సృష్టిద్దామని ప్రభువు తలంచినప్పుడు (ఆది 1:26) ఆయన తనను మూడు భాగములుగా సృష్టించాడు. దీనినే పౌలు 1థెస్స 5:23 ప్రాణాత్మ దేహములుగా (ప్రాణము, ఆత్మ, దేహము) తెలియజేస్తున్నాడు.

ఆత్మీయుడైన ఒక వ్యక్తి పరిశుద్ధాత్మ చేత నడిపించబడతాడు. పరిశుద్ధాత్ముడు తిరిగి జన్మించిన ప్రతిక్రైస్తవుని ఆత్మలో నివాసముంటాడు (రోమా 8:9-14). మన ఆత్మ మన ప్రాణమును నడిపిస్తుంది. మనల్ని ఆధ్యాత్మికులనుగా చేస్తుంది (రోమా 8:5-6). తద్వారా మన ఆత్మ మన మనస్సుతో కలిసి ఆత్మ సంబంధులమై యుండునట్లు మన శరీరమును నడిపిస్తాయి (రోమా 8:11-13). శరీరాను సారముగా నడిపించబడువాడు శరీరాను సారుడైన క్రైస్తవుడవుతాడు. అంతేగాక తన మనస్సుచేత మాత్రమే పాలించబడు క్రైస్తవుడు కేవలము తన తెలివితేటల చేతనే పాలించబడతాడు.

## ఆరాధనలో మూడు భాగములు

పై నియమము ఆరాధన క్రమమును మనకు సూచిస్తుంది. ఆధ్యాత్మిక ఆరాధన మన ఆత్మలో ప్రారంభమై మన మనస్సును లోబరచుకొని మన దేహము ద్వారా వ్యక్తము చేయబడాలి. ద్వితి 6:5లో ఇవ్వబడిన అతిగొప్ప ఆజ్ఞ మనకిదే నేర్పిస్తుంది, "నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణ ఆత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను". మన హృదయము ఆరాధనలో పూర్తిగా లీనమైనప్పుడు మన మనస్సు దానితో జతపడి మన దేహమందున్న శక్తి అంతటితో ప్రభువును ప్రేమించి ఆరాధించుటకు సహాయపడుతుంది. రాజైన దావీదు తన ప్రాణాత్మ దేహములతో దేవుని ఆరాధించి తన శక్తి అంతటితో ప్రభువు సన్నిధిలో రాత్రంతా



నాట్యము చేసినట్లు 2 సమో 6:14 తెలియజేస్తుంది. ఆత్మలో ప్రారంభము కాకుండా కేవలము మనస్సు లేక శరీరమందు వ్యక్తపరచబడు ఆరాధన సమతూకములేనిదిగా ఉంటుంది. అంతేగాక అది దేవునికి అంగీకారయోగ్యముకాదు. అట్టివాడు దేవుని ఆత్మతో మరియు సత్యముతో ఆరాధించుటలేదు.

## సంగీతములో మూడు భాగములు

సంగీతములో మూడు భాగములు కలవు. 1.శృతి 2.లయ 3.తాళము. ఈ మూడు ప్రాణాత్మ దేహములకు సూచన. శృతి అనేది సంగీతాన్ని నడిపించే రాగము. దీనిని మనము పాడతాము. అయితే వీటి మధ్యలో లయను కలిపితే అది పాటను నడిపిస్తుంది. ఒక పాటకు గల లయ శృతిని వెంబడిస్తుంది. చక్కగా రూపొందించబడిన లయ మన హృదయములను తెప్పరిల్ల జేస్తుంది. అది మన మనస్సుకు నెమ్మదిని కలిగిస్తుంది (ఎఫెసీ 5:19, కొలొస్సీ 3:16). సంగీతములో రెండవ భాగము లయ. లయ అనేది వివిధ స్వరముల సమ్మేళన. ఇది పాటకు ప్రాణము పోస్తుంది. సంగీతములో మూడవ భాగము తాళము. తాళమనేది సంగీతము యొక్క వేగమును నిర్ణయిస్తుంది. ఇది కేవలము శరీరమునే స్పందిస్తుంది. మరియు చప్పట్లు, నాట్యము లేక ఇతర కదిలికలనే ప్రేరేపిస్తుంది. సంగీతములో నున్న మూడు భాగములు మానవునిలో నున్న మూడు భాగములపై ప్రభావము కలిగియుంటుంది. శృతి అనేది ఆత్మకు క్షేమాభివృద్ధి కలుగజేస్తుంది. లయ అనేది మనస్సును తెప్పరిల్ల జేస్తుంది. మరియు తాళము కేవలము దేహాన్ని ప్రేరేపిస్తుంది.

## సమతూకముగల ఆధ్యాత్మిక ఆరాధన

గత అధ్యాయములలో ప్రభువు దైవారాధన మరియు అభిషేకింపబడిన సంగీతమును పునరుద్ధరించుటకు దావీదును ఎలా ఉపయోగించుకొనెనో చూసాము. దావీదు పొందుకున్న ప్రత్యక్షతలలో ప్రాముఖ్యమైనది సమతూకముగల ఆధ్యాత్మిక దైవారాధన చేయుటయే. దానిద్వారా ప్రభువు తనను సంధించేవాడు. దావీదు కీర్తన 68:24-25లో ఇలా వ్రాస్తున్నాడు, "దేవా నీ గమనమును పరిశుద్ధ స్థలమునకు పోవు నా రాజగు దేవుని గమనమును వారు చూచియున్నారు. చుట్టును కన్యకలు తంబురలు వాయించుచుండగా కీర్తనలు పాడువారు ముందర నడచిరి. తంతి వాద్యములు వాయించువారు వెనుక వచ్చెదరు".

దావీదు ఏర్పరచిన దైవారాధనలో మూడు భాగములున్నవి : మొదట గాయకులు తదుపరి వాయిద్యకులు మూడవది తంబుర వాయిద్యకులు. ఈ ఆరాధన బృందము

కలిసి పనిచేయగా ప్రభువు సంతోషించి ఆ స్థలములోకి ప్రవేశించేవాడు. మనము కూడా దీనినే ఆశిస్తున్నాము. మన ఆరాధనా కూటములలో ప్రభువు సన్నిధిని అపేక్షిస్తున్నాము.

దైవారాధనలో మొదటిది మరియు మిక్కిలి ప్రాముఖ్యమైనది గాత్రము. మన ఆరాధనా కూటములలో కూడా ఇది ప్రాముఖ్య భాగముగా ఉండాలి. సభ్యులందరు పూర్ణహృదయముతో తాము పాడుచున్న పాటలు వినగల్గురీతిలో పాడాలి. ఇది లోక సంబంధమైన సంగీతముకు భిన్నముగానుంటుంది. లోక సంబంధమైన సంగీతము పాటలకు ప్రాధాన్యత నివ్వదు. కొన్నిసార్లు వారు పాడుతున్న పాటలు వారికే వినబడనంతగా ఉంటాయి. కాబట్టి మైకులు ఉపయోగిస్తున్న గాయకులు దీని విషయమై జాగ్రత్త వహించాలి. వారు పాడుతున్న పాటలు ఇతరులు వినగల్గురీతిలో ఉండాలి. సంగీత బృందము విపరీత శబ్దమును చేస్తే ఇతర సభ్యులు వారితో పాడలేరు. తద్వారా వారు కేవలము వినువారిగా మాత్రమే ఉంటారు. అలా జరిగినప్పుడు ఆ ఆరాధన కూటము ఒక సంగీత ప్రదర్శనగానే ఉంటుందిగాని అందరూ పాలిపంచుకున్న ఆరాధన కూటముగా నుండదు. కాబట్టి ప్రతిఒక్కరూ ఆరాధికులు కావాలనే దానిని నాయకుడైనవాడు ప్రోత్సహించాలి. లోకసంబంధమైన సంగీతము ప్రజలపై ప్రభావము చేసినట్లుగాకాక సభ్యులందరూ గానముల ద్వారా ప్రభువును మహిమ పరచేవారుగా ఉండాలి.

దావీదు నెలకొల్పిన ఆరాధన క్రమములో రెండవ భాగము సంగీత వాయిద్యకులు. సమతూకముగల ఆరాధనలో సంగీతము అనేది గాయకులను ప్రోత్సహించుటకు సహాయపడేది. పాటలు ఒక వ్యక్తి హృదయమును ప్రభువు వైపుకి త్రిప్పుతాయి. అయితే తన మనస్సును కూడా ప్రభువుపై కేంద్రీకరించుటకు సంగీతమనేది ప్రోత్సహిస్తుంది.

దావీదు ఆరాధన క్రమములో చివరిభాగము కీర్తన 28:65లో చూడగలము. ఇక్కడ స్త్రీలు తంబురను వాయించిరి. ఈ వాయిద్యము సంగీతమునకు లయను జతపరుస్తుంది. అది రాగానికి సహాయపడదు. అయితే ఈ లయ ఆ పాటలకు జీవమును పోస్తుంది.

మన పాటలకు మరియు సంగీతముకు సరియైన తాళము కూడా అవసరము. మానవ దేహమునకు తాళము నిర్ణయించేది మన హృదయ చప్పుడే. అది కొట్టుకొనుట ఆగిపోతే మనము చనిపోతాము. ఆ విధముగా మన సంగీతమునకు తాళము లేకపోతే అది నిర్జీవముగా మరియు మృతమైనదిగా ఉంటుంది.అయితే మన దేహమునకు



తాళపు వేగము అధికమైతే గుండెపోటు లేక రక్తపోటు సంభవించి మరణిస్తాము. అటువలె మన సంగీతముకంటే తాళమే అధిపత్యము వహిస్తే మన సంగీతము మృతమైనదిగా మిగిలిపోతుంది. తంబురలు నెలకొల్పు లయ దావీదు ఏర్పరచిన ఆరాధన క్రమములో చివరిది.

లోకసంబంధమైన సంగీతము శరీరాన్ని ప్రేరేపించుటకు రూపొందించబడి యుంటుంది గనుక రోమా 12:2లో నున్న హెచ్చరికను మనము లక్ష్యపెట్టాలి. సరియైన ఆధ్యాత్మిక సమతూకము మన సంగీతమునందు కలిగియుండాలంటే ఇలా చేయుట అత్యవసరము. లోక సంబంధమైన సంగీతము దావీదు సంగీతముకు భిన్నముగానుంటుంది. అనేకసార్లు లోకసంబంధమైన సంగీతము ఒక పాటతో ప్రారంభమై ఒక తాళము ఏర్పడిన తరువాత ఇతర సంగీత వాయిద్యములు ఆ తాళముతో సమకూడుతాయి. ప్రేక్షకులు దాన్ని వింటూ తాళమును బట్టి చప్పట్లు మరియు ఇతర శరీర కదలికల ద్వారా స్పందిస్తారు. ఇంకాపాడుట ఆరంభమవ్వక ముందు వారి శరీరము మరియు దేహము ప్రేరేపించబడి ఆ సంగీతముకు స్పందిస్తూ ఉంటాయి. ఈ పద్ధతి దావీదు నెలకొల్పిన ఆరాధనా పద్ధతికి భిన్నమైనది. కాబట్టి అటువంటి విధానము మన ఆరాధనా కూటములలో మనము కలిగియుండరాదు. ప్రవక్తయైన దావీదు దేవుని ప్రజల కొరకై పునరుద్ధరించిన సమతూకముగల ఆరాధనా పద్ధతిని మనము పాటించినప్పుడే దావీదుకు కలిగిన ప్రతిఫలమును మనము చూస్తాము. అవేమనగా మన దేవుడు మరియు మన రాజును మన ఆరాధనా కూటములలో కలిగియుంటాము.

ఎలాంటి సంగీత వాయిద్యమైనా సరియైన రీతిలో ఉపయోగించినప్పుడు దైవారాధనకు సహాయపడుతుందని నేను నమ్ముచున్నాను. అయితే కొన్ని సంగీత పరికరములు దేవునికి అనుకూలమైన సంగీతమును ఉత్పత్తి చేయజాలవు. డ్రమ్స్ సంగీతానికి ఒక తాళాన్ని ఇవ్వవచ్చునేమోకాని లోకసంబంధమైన వాయిద్యకులు, ఈ డ్రమ్స్‌ని వాయించునప్పుడు శరీర సంబంధమైన స్పందనను ఉత్పత్తి చేయజూస్తారు. దీని ద్వారా దురాశ, తిరుగుబాటు మరియు హిప్నోసిస్‌ను కూడా కలిగించగలరు. డ్రమ్స్‌ని ప్రయోగించు క్రైస్తవులు తెలియక ఆ ఉదాహరణను పాటించి దేవుని సంగీత మును కలుషితము చేస్తుంటారు. కేవలము తాళముకు ప్రాధాన్యతనిచ్చు సంగీతము విషయమై మనము జాగ్రత్త వహించాలి. తాళమే మన ఆరాధనా కూటముల సంగీతమును స్వాధీన పరచుకొనకూడదు.

ఒక ఆరాధనా కూటముపై సంగీతము ప్రభావము కలిగియుండగలదనే పాఠము ప్రభువు నాకు నేర్పించారు. ఒకానొక సంఘముకు నేను అతిథి ప్రసంగీకునిగా

నుంటిని. వివిధ రీతులలో అది చాలా మంచి సంఘమే. వారి కాపరి సమర్పించుకున్నవాడు మరియు వారి సంగీత బృందము కూడా మిక్కిలి తలాంతు గలది. వారిని నడిపే సంగీత నాయకుడు కూడా తిరిగి జన్మించకముందు లోకసంబంధమైన రీతిలో మహాగొప్ప ప్రావీణ్యత గలవాడు. అయితే ఎంతో చాతుర్యము గలగి సంఘస్థులను తమ కిష్టమైన రీతిలో నడిపించగలిగియుండేవారు. అయితే అదే వారికి సమస్యగా మారింది. ప్రభువుకు స్పందించు రీతిలో వారున్నప్పుడు ప్రజలను ప్రభువు సన్నిధికి నడిపించేవారు. కాని అనేక సార్లు వారి ఆరాధన కూటములలో ప్రభువు సన్నిధిని స్పర్శించలేని స్థితిని నేను గమనించాను. ఆయా సమయములలో పరిశుద్ధాత్ముని అభిషేకము ఎంతమాత్రము స్పందించలేని స్థితి అది. దీని విషయమై నేను ప్రార్థిస్తుండగా ప్రభువు నాకు ఆధ్యాత్మిక అవగాహనను దయచేసారు. ఆత్మలను వివేచించు కృపావరము ద్వారా ఆత్మ సంబంధమైన పరిధిలోనికి నేను చూడగలిగాను. ఆ యొక్క స్థలమందు ఒక చిన్న సింహాసనముపై కూర్చునియున్న ఒక దురాత్మను నేను చూసాను. ఈ దురాత్మ పార్శ్వక అజమాయిషీ సంఘముపై కలిగియుండెను.

ఆ దురాత్మ ఒక సంగీత వాయిద్యమును వాయించుట నేనప్పుడు చూసాను. వాడా వాయిద్యమును వాయిస్తుండగా అకస్మాత్తుగా సంఘములోనున్న వాతావరణమే మారిపోయింది. వాడి సంగీతము ఆ స్థలమును నింపినకొలదీ, ఆ సంఘము పెరటి దారిలో గుండా పాతాళముకు దిగుమెట్లను నేను చూసాను. అంతట ఒక బలమైన దురాత్మ ఆ మెట్లమీద నుండి ఎక్కి సంఘము లోనికి ప్రవేశించి సంఘస్థుల మధ్య సంచారము చేయుచుండెను.

దీనికి ముందు ఆరాధనా కూటములలో తన ప్రజలను సంధించుటకు ప్రభువు దిగివచ్చుటనేను చూసాను. అయితే మహిమోన్నతమైన దైవారాధన జరుగుచున్న సమయములలో దేవదూతలు పరిలోకమునుండి దిగివచ్చి మనతో ఏకీభవిస్తాయనే అనుభవమును నేను చవి చూసాను. అదే విధముగా దానికి ప్రతికూలమైన రీతిలో కూడా జరుగుతుందని నేనప్పుడు గ్రహించాను. అభిషేకించబడిన సంగీతము దేవదూతలను క్రిందకి రప్పించినట్లు కలుషితమైన సంగీతము పాతాళలోకమునుండి దురాత్మలను పైకి రప్పిస్తుంది.

స్వచ్ఛమైన మరియు సమతూకముగల ఆరాధనను మనము ఎలా కలిగియుండగలమో అనే అవగాహనను ప్రభువు మనకందరికి ఇచ్చి సహాయము చేయునుగాక. ఆత్మసంబంధమైన వివేచనతో పాటు పూర్ణ హృదయముతో మన ప్రధాన కాపరి చూపించు నీతిమార్గమునందు నడవాలనే అపేక్ష ప్రభువు మనకు



ఇచ్చును గాక. ప్రభువిలా సాక్ష్యమిస్తున్నారు, “తరువాత అతనిని తొలగించి దావీదును వారికి రాజుగా ఏర్పరచెను. మరియు ఆయన–నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని; అతడు నాయిష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశ్యములన్నియు నెరవేర్చునని అతనిని గూర్చి సాక్ష్యమిచ్చెను”. పూర్ణ హృదయముతో దేవుని చిత్తాన్ని నెరవేర్చాలని, మనము ఆశించినప్పుడు మన సంగీతము మరియు దైవారాధన దావీదుకు వలె పవిత్రముగా మరియు శక్తివంతముగా ఉంటుంది. అప్పుడు మన రాజు మరియు దేవుడైన యేసు క్రీస్తు ప్రభువును మన ఆరాధనా కూటములలోనికి ఆహ్వానించగలము. అప్పుడు దావీదు యొక్క అభిషేకింపబడిన సంగీతము రాజైన సౌలును పీడించిన దురాత్మలను పారద్రోలినట్లే మన సంగీతము కూడా అట్టి దుష్టశక్తులను పారద్రోలుతాయి.

**అభిషేకించబడిన సంగీతము దేవదూతలను క్రిందకి రప్పించినట్లు కలుషితమైన సంగీతము పాతాళలోకమునుండి దురాత్మలను పైకి రప్పిస్తుంది.**

# ఏడవ అధ్యాయము

## సంగీత నాయకులు

సంగీత నాయకుడైనవాని పరిచర్య బహుప్రాముఖ్యమైనది మరియు కష్టతరమైనది. సంగీత నాయకునిగా నీవు పిలవబడకయున్నప్పటికి క్రైస్తవ నాయకునిగా పిలువబడిన ప్రతిఒక్కరూ కూడా ఈ సంగీత పరిచర్యలో నున్న ఇబ్బందులను గూర్చిన అవగాహనను కలిగియుండుట ప్రయోజనకరము. ఎందుకనగా సంగీత నాయకత్వము మరియు సంఘ నాయకత్వము కలిసి దైవారాధన యొక్క బాధ్యతను వోస్తుంటారు. కాబట్టి నీవు సంఘనాయకునిగా ఉండ ప్రయత్నించకపోయినప్పటికి, ఈ అధ్యాయము నీ పరిచర్య యొక్క ఎదుగుదలకు సహాయపడి ప్రోత్సహిస్తుందని నేను నమ్ముచున్నాను. ఒక సంఘారాధన దేవుని ప్రణాళికను నెరవేర్చి గురిని చేరుకొనుటకు వివిధ కారణములు తోడ్పడతాయి. సంఘనాయకుడైనవాడు తన సంగీత బృందమును తనతో కూడ సమకూర్చి దానిని సరిగ్గా నడిపించవలెను. కేవలము ప్రకృతి సంబంధమైన తలాంతు మరియు చాకచక్యము దీనికి చాలదు. సంఘనాయకుడైనవాడు సంఘస్థుల ఆధ్యాత్మిక స్థాయిని స్పర్శించి వారిని లోతైన దేవుని సన్నిధిలోనికి నడిపించగలిగియుండాలి. అలా చేస్తుండగా ఆత్మసంబంధమైన అభ్యంతరములు మరియు శత్రుదాడులను కూడా ఎదిరించవలసియుంటుంది. సంఘనాయకుడైనవాడు ఆరాధికుడు, గాయకుడు కావలివాడు మరియు ఆధ్యాత్మిక సైనికుడై యుండాలి. ఇవన్నీ సమకూడినప్పుడే మనకు దైవచిత్తానుసారమైన సంగీతనాయకుడు తయారవుతాడు.

### ఆరాధనను నడిపించు నాయకులు కావాలి

సంగీత నాయకుడైనవాడు సరియైన దర్శనము కలిగియుండుట ఆవశ్యకము. అతడు మొదట ఆరాధికుడై యుండాలి. ఇతరులను ఆరాధనలోనికి నడిపించగలిగి యుండాలి. యోహాను 4:23లో తండ్రి నిజమైన ఆరాధికుల కొరకు వెదకుచున్నాడని ప్రభువైన యేసు సెలవిచ్చారు. ఇది దేవుని హృదయమును తృప్తి పరుస్తుంది. అయితే ఇలాంటి ఆరాధన మనుష్యులకు కూడా అవసరము. ఎందుకంటే వారు ఆయనను సరియైన రీతిలో ఆరాధించిన కొలదీ ఆయనకు వలె మారుతారు (2 కొరింథీ 3:18, 1 యోహాను 3:2). సంగీత నాయకులు వివిధ రీతులలో ఉంటారు. ఉదాహరణకు దిగువ వివరించబడిన మూడు రకములైన సంగీత నాయకులను చూద్దాము.



### 1. ప్రోత్సాహకుడు

ఇలాంటి సంగీత నాయకుడు కేవలము ప్రజలను ప్రోత్సహించ ప్రయత్నిస్తాడు. ఉత్తేజమున్న చోట అభిషేకముంటుందని తలస్తాడు. కాబట్టి మంచి ఆరాధనా కూటము బిగ్గరగా ఉత్తేజ పూర్వకముగా సంగీతముతో నిండుకొన్నదై యుండాలని అనుకుంటాడు. ఎప్పుడైతే నెమ్మదిగా లేక సున్నితమైన సంగీతముంటుందో ప్రజలు అక్కడ బంధీలై యున్నారని తలస్తాడు. కాబట్టి ప్రోత్సాహకుడైన సంగీత నాయకుడు ఎల్లవేళలా ప్రజలను పురికొల్పుతూ, ప్రోత్సహిస్తూ, హెచ్చరిస్తూనే ఉంటాడు. అట్టివారు సంఘమును విడుదలలోనికి రప్పించగలరు గాని అది కేవలము శరీర సంబంధమైన విడుదలను కలిగించు ఉత్తేజమేగాని అభిషేకించబడిన నిజ ఆరాధన కొరకైనది కాదు.

### 2. ప్రదర్శకుడు

కొంతమంది కేవలము సంగీత పరిచర్య అనేది ఒక ప్రదర్శనా పరిచర్యగా మాత్రమే భావిస్తారు. వీరు ఆత్మకు, శరీరముకు లేక మనస్సుకు ఉన్న భేదమును గ్రహించలేరు. వారు కేవలము అందము, తలాంతు, వినోదము మరియు సంగీత ప్రదర్శనకే ప్రాధాన్యత నిస్తూ మనుష్యుల మనస్సులను తెప్పరిల్ల జేస్తారు (హెబ్రీ 4:12, ఫిలిప్పీ 3:3, జకర్యా 4:6, 1 కొరింథీ 2:1-5). ప్రదర్శకుడైనవాడు తన ఖ్యాతికి ప్రాధాన్యతనిస్తాడు గనుక ప్రభువుకు బదులుగా తన్నుతాను హెచ్చించు కొన ప్రయత్నిస్తాడు. తద్వారా అతడు మనుష్యులను మెప్పించు వాడేగాని దేవుని మెప్పించువాడు కాజాలడు (గలతీ 1:10). ఇలాంటి ప్రదర్శకుడు సాధారణముగా లోకసంబంధమైన సంగీత గాయకులు మరియు వాయిద్యకులను అనుకరిస్తాడు (2 కొరింథీ 10:12,18).

### 3. ప్రవీణుడు

సంఘనాయకుడైనవాడు కేవలము ప్రభువుకొరకు కాక ప్రావీణ్యత కొరకు ప్రాకులాడతాడు. తన సంగీత తలాంతు మరియు తన బృందము కలిసిచేయు సంగీతముకు ప్రాధాన్యత నిస్తాడు. కాగా వారి సంగీతమే వారికొక విగ్రహముగా మారుతుంది. ఆ బృందము వారి తలాంతులు మరియు వారి ఐఖ్యతను బట్టి ఒక చక్కటి పాటల ప్రదర్శనను ఉత్పత్తి చేయగలరేమోగాని ప్రభువును ఆరాధించలేరు. కేవలము వారి తలాంతునే ప్రదర్శించుకోవాలని ప్రయత్నించేవారు ప్రజలను ప్రభువువైపుకు కాక తమవైపుకే ఆకర్షించుకుంటారు.

# సంగీత ప్రదర్శనలు కాదు - ఆరాధనా కూటములు కావాలి

ఒకానొక సంఘముకు ప్రసంగీకునిగా నేను పిలువబడినప్పుడు ప్రభువు నాకొక ప్రత్యక్షతను దయచేసారు. ఆ దినము ఆరాధనను నడిపించుటకు ఒక క్రైస్తవ బృందమును ఆహ్వానించారు. అయితే అతిధి ప్రసంగీకుడనైన నేను సంగీత నాయకుడనని వారు గ్రహించి తమ సంగీత ప్రదర్శనను ఉన్నతమైన రీతిలో చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే వారాసంగీత ప్రదర్శన మిక్కిలి ప్రావీణ్యతతో చేసిరి. అయితే సంఘమంతా వారితో ఏకీభవిస్తుండగా నా భార్యలో ఏకీభావము ఎంతమాత్రము నాకు కనబడలేదు. అంతట 'అలా చేయుట బాగోలేదు', అని నేనామెను హెచ్చరిస్తుండగా ఆమె నాతో ఇలా అనింది, 'నేను చూస్తున్నది నీవు చూడగల్గితే నీవెంత మాత్రము ఈ యొక్క పాటలతో ఏకీభవించలేవు'. అదేమని నేనడుగగా ఆమె దర్శనరూపములో ఒక పెద్ద విగ్రహమును చూడగల్గింది. ఆ విగ్రహము వారి సంగీతమే. వారి సంగీతమును వారే పూజిస్తూయుండుట ఆమె చూచినప్పుడు అది దైవారాధనతో కూడినది కాదని ఆమె మౌనము వహించింది. ప్రసంగమైన పిమ్మట ఆ బృందనాయకుడు నన్ను సమీపించి తన ప్రదర్శన ఎంత సాఫీగా కొనసాగిందో ఎంత చక్కగా ప్రదర్శించగలిగారో అని నాతో చెప్పసాగాడు. నా అభిప్రాయమును ఆశిస్తాడని ఎరిగిన నేను తన్ను తాను మెచ్చుకొనుట నేను చూచినప్పుడు వారు కేవలము వారి సంగీతమును ఆరాధించువారేగాని ప్రభువును ఆరాధించువారు కారని నేనప్పుడు గ్రహించాను. అంతట నా భార్యకు ప్రభువిచ్చిన దర్శనము నిర్ధారించబడింది. కొన్ని మాసములైన పిమ్మట సంఘనాయకుడు (సంఘకాపరి) ఆరాధనా కూటములకు సంబంధించిన విధానమును మార్చప్రయత్నించినప్పుడు ఆ సంగీత బృంద నాయకులు ఆయనను వ్యతిరేకించి సంఘమును విడిచిపెట్టుట ద్వారా ఎంతో గలిబిలిని ఆసంఘమునకు కలిగించారు.

కాబట్టి దేవుని గృహములో నాయకుడైనవాడు తన హృదయ ఉద్దేశ్యములు మరియు దర్శనము విషయమై జాగ్రత్త వహించాలి. మనము చేయు ప్రతిదానిని ఇది ప్రభావితము చేస్తుంది. దేవుని చిత్తమును నెరవేరుస్తామా, ఆయన గురిని చేరుకుంటామా లేక మన సొంత ఆశయములను నెరవేర్చుకుంటామా. ప్రభువు చిత్తమును చేయుటయందు నేనాందిస్తున్నాను అని చెప్పగలిగే గురి మనకుండాలి. మరియు పూర్ణ హృదయముతో ఆయనను ఆరాధించే వారముగా మనము కావాలనేది మన హృదయవాంఛగా ఉండాలి.



# ఒక ఆరాధనా కూటమును నడిపించుటకు చిట్కాలు

## 1. మన హృదయము సిద్ధపరచబడియుండాలి

దేవుని పట్ల యదార్థమైన హృదయము కలిగియుండుట మొదటి పునాది. కీర్తనాకారుడు కీర్తన 66:18లో ఇలా అంటున్నాడు, "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును". ఎలాంటి ఆధ్యాత్మిక పరిచర్యను నెరవేర్చాలనుకున్నా మన హృదయములలో పాపమనేది ఉండరాదు. దీని అర్థము మనము పరిపూర్ణులమని కాదు. కాని క్రీస్తు రక్తము చేత పరిశుభ్రపరచబడియున్నామని మనము ఎరిగియుండుట అవసరము. మరియు ఆయన సన్నిధిలో సిగ్గు పడనక్కరలేకుండా నిలవబడగలమనే ధైర్యము మనకుండాలి. ఆ ధైర్యము మనయందు లేనప్పుడు విజయము కొరకు ఆశించుట లేక వేరొకరికి ఆ బాధ్యతనప్పగించుట మంచిది.

మన హృదయమును సిద్ధపరచుకొను మరియొక విధానమేమనగా ప్రార్థనతో ఆరాధనా కూటమును ఆరంభించుట. ప్రత్యక్షత కొరకు ప్రభువును వేడుకొనవలెను. అంతేగాక ఆయన ఆశించినదేంటో తెలుసుకొన ప్రయత్నించాలి. ఆరాధన కూటమనేది యుద్ధ పోరాటము వంటిది. మరియు జ్ఞానయుక్తమైన సైనికదళ నాయకుడు యుద్ధ ప్రణాళికను తెలుసుకొన ప్రయత్నిస్తాడు. ఆరాధన నడిపించుటకు మనము నిలువబడి నప్పుడు ప్రార్థన మనకు సహాయము చేస్తుంది.

దేవుని ప్రజల యెదుట నిలువబడినప్పుడు ప్రభువు ధైర్యమును బట్టి మనము నిలవాలి. అందు నిమిత్తము మన హృదయమును సిద్ధ పరచుకోవాలి (ద్వితి 3:6-8, 2 కొరింథీ 3:5-6). సైనిక దళ నాయకుడు భయపడే వాడైతే తన సైన్యము నంతటిని భయభ్రాంతులనుగా చేస్తాడు. అయితే యెహోషువాను సిద్ధపరచినట్లు దేవుడు మన హృదయాన్ని సిద్ధపరిస్తే మన నాయకత్వము చొప్పున నడుచుకోవడానికి ప్రజలు కూడా ఇష్టపడతారు. ప్రజలు యెదుట నిలువబడినప్పుడు ఆయన సన్నిధిలోనికి వారిని నడిపించగలుగుటకు ఆయన సహాయం చేస్తాడని మనము నమ్మాలి. ఆ ధైర్యము చొప్పున చిరునవ్వును కలిగియుండాలిగాని నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండరాదు. మనల్ని మనము సిద్ధపరచుకున్నప్పుడు ప్రభువు వలనైన ఆనందముతో నింపబడి యుంటాము. అప్పుడు ఇతరులను మనకున్న దానివైపుకు నడిపించగలము. హృదయము నిండా సమస్యలతో మనము నిలబడితే ప్రజలను విడుదలకు నడిపించుటకు బదులు మన సమస్యలను గూర్చే ఆలోచిస్తూ ఉంటాము. కాబట్టి

మనల్ని మనము సిద్ధ పరచుకొనియుంటే ప్రజల మనస్సులు మరియు హృదయాలను యేసువైపుకు త్రిప్పగలము.

## 2. పాటల జాబితాను సిద్ధ పరచుకొనుట

ఆరాధన నడిపించు నాయకులు ఏయే పాటలు పాడాలో ముందుగా సిద్ధపడాలి. ప్రసంగీకుడు తన ప్రసంగము సిద్ధపరచుకొనుటకు ప్రార్థనతో ఎలా ప్రయాస పడతాడో పాటలు నడిపించు నాయకుడు కూడా అలాగే ముందుగా సిద్ధపడాలి. అంటే ముందుగా సిద్ధపడిన పాటలు మాత్రమే పాడాలని నేను ఇక్కడ అనుటలేదు. పరిస్థితులను బట్టి ఆత్మ నడిపింపుచేత పాటలు కలిగియుండుటకు సిద్ధపడాలి. కొన్నిసార్లు మనము సిద్ధపడిన జాబితా ప్రకారము పాడనవసరము లేకపోవచ్చును. దేవుని ఆత్మ వేరొక రీతిలో మనల్ని నడిపించవచ్చును. ఐనప్పటికీ ఆరాధన బృందమంతటిని కూడా సాఫీగా నడిపించగలిగే సమర్థత నాయకునికి ఉండాలి.

ఆరాధన కూటమును నడిపించుట ఒక్క మనిషివలన జరిగేదికాదు. సంఘములో గాయకులు మరియు సంగీత వాయిద్య బృందములు ఉంటారు.మరియు వారు ముందుగా హెచ్చరింపబడి పాడవలసిన పాటల యందు తర్ఫీదు నొందాలి. మీ ఆలయములో ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్ ఉన్నట్లయితే మీరు పాడబోవుచున్న పాటల జాబితాను దానిపై ప్రదర్శించుట మంచిది.

మీరు ఎంపిక చేసిన పాటల ప్రవాహములో మీరుండగా దేవుడు ఆయన సన్నిధిలోనికి సంఘాన్ని నడిపించుకోగలడు. దైవ ఉద్దేశ్య పూర్వకముగా పాటలయందు ప్రవహించుటకు వివిధ పద్ధతులున్నవి.

మనము పాడుతున్న పాటలు శృతిని బట్టి క్రమపరచుకొనుట ప్రయోజనకరము. అపశృతికి తావునివ్వకుండా ప్రారంభించినప్పుడే సరియైన శృతిలో ప్రారంభించగలము. స్తుతి ఆరాధనతో హృదయములు నిండుకొన్న సభ్యులు అపశృతిలోనికి నడిపించబడితే చాలా ఇబ్బందికి దారితీస్తుంది.

ప్రతి సంఘము పాటల జాబితాను తయారు చేసినప్పుడు అవి ఏ శృతిలో పాడవలసియున్నదో కూడా నిర్ణయించాలి. ఆ సామర్థ్యము మీకు లేకుంటే వేరొకరికి ఆ పనిని అప్పగించుట మంచిది.

పాటల జాబితాను సిద్ధపరుస్తున్నప్పుడు మొదటిపాట C Keyలో ప్రారంభిస్తే రెండవది D Keyలో కొనసాగవచ్చును. కాబట్టి ఆ వివేకముతో పాటల జాబితాను



తయారు చేసినప్పుడు ఒక పాటవెంట మరియొక పాట పాడుట సులభతరమవుతుంది. అలా చేయుట ద్వారా ఆరాధనా కూటమును సాఫీగా నడపించగలము.

పాటల క్రమమును సాఫీగా నడిపించుటయందు మరియొక విధానమేమనగా ఒకే అంశమును కొనసాగి పాటలు పాడుట ఒకే అంశమును ప్రభువు ఒక్కాణించ ప్రయత్నించవచ్చును. ఆయా అంశములు ఆయాపాటల ద్వారా మనము వ్యక్తపరచగలము. కొన్ని పాటలు కేవలము సంతోషమును లేక విడుదలను లేక క్రీస్తు రక్తమును, అలా వివిధ ఆలోచనలను ప్రేరేపించురీతిలో ఉంటాయి. మీ హృదయమును ఏదైనా అంశముతో ప్రభువు ప్రేరేపిస్తే అ ప్రకారము మీ పాటల జాబితాను మీరు సిద్ధపరచుకోవాలి. కొన్ని సార్లు ప్రసంగీకుడు కూడా అదే అంశమును అనుసరించి ప్రసంగిస్తాడు. అటువంటి సమయములలో పాటల ద్వారా ప్రజలు సిద్ధపడి వర్తమానము ద్వారా ప్రభువు ఆ అంశమును నిర్ధారిస్తే ఉన్నతమైన రీతిలో నడిపించబడతారు.

ఆరాధనా కూటమును స్తుతి నుండి ఆరాధనకు కొనసాగునట్లు చేయాలి. ఇది సరియైన పద్ధతి. అయితే ఈ పద్ధతిని తప్పనిసరి అన్ని సమయములలో అవలంభించాలని నేననుట లేదు. కొన్ని కూటములలో ప్రభువు కేవలము స్తుతికే ప్రాధాన్యత నివ్వవచ్చును. మరికొన్ని సమయములలో ప్రార్థన ద్వారా ప్రజల హృదయములు సిద్ధపడియుంటే స్తుతి లేకుండా సంఘమంతా ఆరాధనలోనికి నడిపించబడవచ్చును. ఆరాధనలో బడలిక లేక భారము ఉందని అనిపిస్తే స్తుతి గీతము ద్వారా విడుదల నొంది ఆరాధనలో మరల కొనసాగవచ్చును. జోరుగా పాడే పాటలతో ప్రారంభమై నెమ్మదైన పాటలతో కొనసాగుట మంచిది. జోరైన పాటలు ప్రజలను మేల్కొల్పి సంతోషించుటకు ప్రోత్సహిస్తుంది. అయితే ఒకసారి దేవుని ఎదురుపడి ఆరాధనలోనికి ప్రవేశించినప్పుడు నెమ్మదైన పాటలతో ప్రభువుతో సహవాసము చేయునిమిత్తమై పూర్తి ఏకాగ్రత ఆయనపై పెట్టాలి.

ఆరాధనా గీతముల జాబితాను తయారు చేస్తున్నప్పుడు మొదట మనకు మనము పాడుకునేపాటలు పాడగా తదుపరి ప్రభువునుద్దేశించిన పాటలు పాడవచ్చును. కొన్నిసార్లు ఒకరినొకరు హెచ్చరించుకునే పాటలతో ప్రారంభమై ప్రభువును ప్రేమిస్తున్నామను పాటలతో కొనసాగవచ్చును. మనకొరకు మనము పాడుకునే పాటలు ఉంటాయి. సంఘము నిమిత్తము పాడేపాటలు వేరే ఉంటాయి. కాబట్టి మనకు మనము పరిచర్య చేసుకొనుట మాత్రమేగాక సంఘమంతటికీ క్షేమాభివృద్ధి కలిగించు పాటలు కూడా పాడాలి. ఏది ఏమైనప్పటికీ పరలోకము

తట్టు మన కనుదృష్టి ఉన్నప్పుడు మరియు మన హృదయములు ప్రభువు వైపు కేంద్రీకరించబడినప్పుడు మన ఆరాధనా కూటము దేవునికి మహిమను చేకూరుస్తుంది. కొన్ని పాటలు సంఘము నుద్దేశించి మరికొన్ని పాటలు దేవుని నుద్దేశించి యుండగా వీటిని కలిపి పాడరాదు. మొదట మనల్ను, సంఘమును ఉద్దేశించిన పాటలు పాడిన తరువాతనే దేవుని నుద్దేశించు పాటలు పాడాలి.

ఆరాధనా కూటములకు పాటల జాబితాను తయారు చేస్తున్నప్పుడు మరియొక సంగతి జ్ఞాపకముంచుకోవాలి. తాజాయైన అభిషేకమును మరియు వర్తమాన సత్యమునుద్దేశించు పాటలు పాడుకోవాలి. కొన్నిసార్లు మెలకువ రావటముతోనే మన హృదయములో ఒక గీతికను కలిగియుంటాము. కీర్తనాకారులు కీర్తన 48:8, 77:6లో ఇలా అంటున్నారు, "సైన్యముల కధిపతియగు యెహోవా పట్టణము నందు మనదేవుని పట్టణమునందు మనము వినినట్టుగానే జరుగుట మనము చూచియున్నాము దేవుడు నిత్యమూ దానిని స్థిరపరచియున్నాడు". "నేను పాడిన పాట రాత్రియందు జ్ఞాపకము చేసికొందును, హృదయమున ధ్యానించుకొందును. దేవా, నా ఆత్మ నీ తీర్పుమార్గము శ్రద్ధగా వెదకెను". మనము నిద్రిస్తుండగనే పరిశుద్ధాత్ముడు మన హృదయములను ప్రేరేపించి మనకు మేల్కొల్పు కలిగిస్తాడు. ఒక ఆరాధనా కూటమును నడిపించుటకు మనము సిద్ధపడుచున్నవారమైతే రానున్న కూటముకు కావలసిన పాటలను క్రితరాత్రే ప్రభువు మనకివ్వవచ్చును.

### 3. మంచి నాయకునిగా ఉండాలి.

నాయకుడైనావాడు కేవలము నాయకునిగానే ఉండాలి. ఆరాధన నడిపించు సంగీతబృందమును మరియు సంఘస్థులను నడిపించే బాధ్యత తనది. బలహీనుడైన నాయకుడు ఎల్లప్పుడూ కళ్లుమూసుకొని ఏదో గొణుగుచూ తన నాయకత్వము ద్వారా ధైర్యమును పురికొల్పజేయడు.

మొదటిగా మనము నడిపిస్తున్న మనుష్యులకు అర్థమయ్యే స్పష్టమైన సూచనలివ్వడం నేర్చుకోవాలి. స్పష్టముగా మాట్లాడుట నేర్చుకోవాలి. ఒక పాట నారంభిస్తున్నప్పుడు చప్పట్లు ద్వారా లేక గట్టిగా పాడుట ద్వారా చేతులు ఊపుట ద్వారా దానిని ఆరంభించవచ్చును. దాని వేగమును పెంచుట చప్పట్లు, తంబుర లేక చేయి ఊపుట ద్వారా చేయవచ్చును. అందరు నీతో కలిసి ఏకీభవించనిష్టపడితే ముందుగా వారికాసంగతిని సూచించవచ్చును.

ఒక పల్లవిని పాడి దానిని తిరిగి పాడాలి అనుకున్నప్పుడు చేతులతో ఏదైనా ఒక సూచనను చేయవచ్చును. పాటను మధ్యలో ఆపాలనుకున్నప్పుడు చప్పట్లు ఆపుట



ద్వారా మౌనముగా ఉండుట ద్వారా లేక చేయి ఊపుట ద్వారా ఆపవచ్చును. అందరినీ కలిపి ఆరాధనలో నడిపిస్తున్నప్పుడు వారిని ఆపనిష్టపడితే మౌనముగా కళ్లుమూసుకొని మైకుకు దూరముగా వెళ్ళుట ద్వారా సమాప్తమును సూచింపవచ్చును.

ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్‌పై పాటలను చూపించు శక్తికూడా చెయ్యితో సంజ్ఞలు చేయుట ద్వారా నడిపించవచ్చును. ఆ ప్రొజెక్టర్‌ను నడిపించేవ్యక్తి కళ్లు మూసుకొని ఆరాధనలో నిమగ్నుడు కాకుండా ఉండాలి. మంచి నాయకుడైనవాడు మంచిగా వెంబడించుటకూడా కొన్నిసార్లు నేర్చుకోవాలి. తాను ఎల్లవేళలా సంఘకాపరికి లోబడియుండాలి. క్లుప్తమైన ఆరాధన క్రమమును కలిగియుండవలసిన సమయములో క్లుప్తముగానే ఉంచాలి. సంఘకాపరికి లోబడియున్నప్పుడే ఆ పరిచర్యపై దైవదీవెనలు ఉంటాయి. నీ పరిచర్యపై నీకు నమ్మకమున్నప్పుడు దానిని సరిగ్గా జరిపించాలి. నీవింకా నేర్చుకుంటున్న స్థితిలో నున్నవాడవైతే నిన్ను నడిపించేవానికి లోబడియుండాలి. కొన్నిపాటలు నడిపించుటకు నీవు పిలువబడినవాడవైతే దయచేసి ప్రసంగించుటకు ప్రయత్నించవద్దు. ప్రవచన వాక్కులు పలుకుటకు యత్నించవద్దు. అంతేగాక మైకు నీ చేతిలో ఉందిగనుక నీ కిష్టమైన మాటలు మాట్లాడవద్దు.

### 4. ఆరాధన కూటమును ప్రారంభించుట

ప్రారంభించుట స్తుతిగానములతో, ప్రార్థన లేక బైబిలు వచనము హెచ్చరిక ద్వారా కూటమును ప్రారంభించవచ్చును. మీకంటేముందు సంఘ కాపరిలేక నాయకుడెవరైనా కూటమును ఆరంభించియుంటే అక్కడనుండి దానిని నడిపించ వచ్చును. మరల ఆదిలోనికి సంఘస్థులను తీసుకొనిపోవద్దు. అప్పటికే స్తుతి గీతము సంఘము పాడియుంటే కొద్ది సమయమే స్తుతిలో గడిపి దానిని ఆరాధనలోనికి నడిపించ ప్రయత్నించాలి. ప్రజల హృదయములు అప్పటికే సిద్ధపడియుంటాయి గనుక వారిని సరాసరి ఆరాధనలోనికి మనము నడిపించగలము.

### 5. ఆరాధన కూటమును నడిపించుట

పరిశుద్ధాత్మ నడిపింపును బట్టి ఆరాధన కూటమనేది ముందుకు సాగాలి. పరిశుద్ధాత్ముడనగా గాలి, నీరు మరియు నూనెతో పోల్చబడుచున్నాడు. ఇవన్నియూ కూడా ఒక విధమైన కదలిక కలిగియుంటాయి. పరిశుద్ధాత్ముడు కూడా అటువలె మనద్వారా కదలాలని ఇష్టపడుచున్నాడు. గాయకబృంద నాయకుడు ఒక పాటను ఎన్నిమార్లు పాడాలనేది నిర్ణయించవలెను. ఒకే పాట పదే పదే పాడవలసిన అవసరత కొన్నిసార్లు ఉండవచ్చును. దీనికి ఆత్మ వివేచన చాలా అవసరము. ఒక పాటను

పదే పదే పాడుట ద్వారా ఆ స్థలమందు దైవాభిషేకము అధికమైనట్లైతే దానిని మరికొన్ని సార్లు పాడవచ్చును. ఏ దినమునకు అవసరమైన పాటను ఆ దినము దేవుడు అనుగ్రహిస్తాడన్న దానికి ఉదాహరణమును నిర్గమ 15:20-21, 1 సమూ 18:6-7లో చూడగలము.

ఒక పాటను పాడుచుండగా దైవాభిషేకము క్షీణిస్తున్నదని గమనించినప్పుడు దానిని వెంటనే ముగించి మరియొక పాట పాడవలసియుండవచ్చును. బహుశా అది పాడకూడని పాటకావచ్చును లేక అది అందించకూడని వర్తమానమును అందిస్తూ ఉండవచ్చును. ఒక పాటపట్ల దేవుడు సంతోషాన్ని వ్యక్తము చేయకయున్నప్పుడు తన అభిషేకమును ఆ స్థలమునకు ఆయన విడుదల చేయడు. దీనిపట్ల మనము సున్నితమైన స్పందన కలిగి మన ప్రణాళికను ప్రక్కను పెట్టి దేవునితో ముందుకు సాగుటకు ఇష్టపడాలి.

స్తుతిలో సంపూర్ణ విడుదలను చవిచూడకుండా ఆరాధనలోనికి ప్రవేశించుటకు ప్రయత్నించరాదు. విజయము, స్వేచ్ఛ లేక సంతోషము లేనప్పుడు దానికొరకైన తాళపు చెవికొరకు త్వరగా ప్రార్థన చెయ్యాలి. బహుశా ఒక పాట, ప్రార్థన, హెచ్చరిక లేక క్రియ ద్వారా విజయమును విడుదలను చేకూర్చవచ్చునేమో.

మనుష్యులు అటు ఇటు చంచల మనస్కులు కాకుండా వారిని సరైన రీతిలో నడిపించాలి. శబ్దములు, ఇటు అటు తిరిగే మనుష్యులు లేక ఏంప్లిఫైర్‌లు ఇతర సంగీత వాయిద్యములు సరిగా పనిచేయక యుండటం ఇవన్నీ కూడా ఆరాధన కూటముకు అభ్యంతరములే. అయితే సంఘస్థులు వాటివైపుకి వారి ధ్యాసను త్రిప్పకుండా ప్రభువుమీదే వారి దీక్ష ఉండులాగున మనము సహాయపడాలి.

ఆరాధనను నడిపించు నాయకుడనువాడు ప్రజల హృదయములను సమకూర్చి, ప్రభువు వైపుకి వారిని నడిపించాలి. మనుష్యుల దృష్టిని ఆకట్టుకొనుట నాయకుని బాధ్యత. ఒకసారి దేవునివైపుకి సంఘస్థుల దృష్టిని మళ్ళించిన తరువాత నాయకుడైనవాడు ప్రక్కకు తొలగాలి. అలా తొలగటానికి గల విధానమును దిగువ చూద్దాము.

1. నీవు ఆరాధికునిగా ఉండాలి - కేవలము నాయకునిగా లేక నడిపించు వానిగా కాదు.
2. అసందర్భమైన మాటలు మాట్లాడవద్దు. పాటపాడుచుండగా హెచ్చరికలు, అసందర్భమైన మాటలు పలుకరాదు.



3. దేవుని ఆత్మ కదలికను అభ్యంతరపరచు సూచనలు ఇవ్వరాదు. ప్రభువు సన్నిధిలో కనిపెట్టుట ద్వారా ప్రభువుకే అవకాశమును ఇవ్వాలి. అవి ప్రవచనముల ద్వారా లేక ఇతర ఆత్మ ప్రత్యక్షతల ద్వారా కావచ్చును.
4. మీ వైపుకు మనుష్యుల దృష్టిని మళ్ళించు కదలికలు ఏమీ చెయ్యవద్దు. ఇతరులతో మాట్లాడుట గాని, గోక్కోవడం గాని, తల సర్దుకోవడం గాని లేక ఇతర చేతి కదలికలు గాని మనము చేయరాదు.
5. ప్రభువువైపుకే ప్రజల ధ్యాస మళ్ళించబడు కదలికలు మాత్రమే మనము చెయ్యాలి. ఆరాధనలో చేతులెత్తుట ద్వారా, కళ్లు మూసుకొనుట ద్వారా, మౌనముగా నిలిచియుండుట ద్వారా, మోకరించుట ద్వారా మనము అలా చేయగలము.
6. ఆరాధన మధ్యలో హెచ్చరికను దేనినైనా ఇవ్వవలసియుంటే ఇచ్చి వెంటనే ప్రక్కకు తప్పుకోవాలి. ఎందుకంటే ప్రభువు ప్రజలతో మాట్లాడుతున్న సమయములో నీ స్వరము దానికి అభ్యంతరము కాకూడదు.
7. పాటలు ఎప్పుడు ఆపాలో తెలుసుకోవాలి. ప్రజలు ఆత్మీయ శిఖరమును ఎక్కియుండగా ఆపేయ్యడం మంచిది. వారక్కడ నుండి దిగి మరల లోయలోనికి వచ్చేవరకు పాటలు నడిపించరాదు. దేవుని సన్నిధి ఆలయములో బలముగా దిగిన సమయానికి ముగించుట ప్రయోజన కరము. అప్పుడు పరిశుద్ధుల హృదయములు సంతోషము, ప్రేమ మరియు విజయముతో నిండియుంటాయి. ఆరాధన కూటము దీర్ఘ కాలము కొనసాగిస్తే ప్రజలు అలసి, ప్రభువు సన్నిధిని కూడా స్పర్శించలేనంతటి స్థితిలో మిగిలిపోవచ్చును.

కూటము సరిగ్గా నడిపింపబడనప్పుడు లేక ఏదైనా ఒక అభ్యంతరము కలిగినప్పుడు దానిపట్ల విజయమును ఎలా చేకూర్చాలనేది నాయకుని బాధ్యత. నీవు అలా చేయలేని యెడల నీతోడి సేవకునికి ఆ కూటమును అప్పగించుము. నీవు పరిష్కరించలేని సమస్య ఆ కూటములో నున్నట్లయితే పాటవెంబడి పాట పాడుచున్న కొద్దీ పరిస్థితులు మరింత విషమిస్తాయి.

## 6. సంగీత వాయిద్యకులతో కలిసి పనిచేయుట

నాయకుడైనవాడు ఇతర సంగీత వాయిద్యకులతో కలిసి పనిచేయుట నేర్చుకోవాలి. దేవుని దీవెనలు దిగిరావాలంటే ఆరాధన కూటములో ఐక్యత ఉండాలి (కీర్తన133:1-3). నీవు నడిపించబోవుచున్న పాటలకు సంగీతము వాయించుట

వారికి తెలిసియుండాలి. ముందుగానే వారికి పాటల జాబితాను ఇవ్వవలెను. వీలైతే కూటముకు ముందే పాడబోయే పాటలను సాధన చెయ్యాలి. అనేక సంఘాలు సాధారణంగా శనివారం పాటల ప్రాక్టీస్ పెట్టుకుంటారు. ఆదివారము ఆరాధన సంగీత ప్రవాహము నిరాటంకముగా ఉండాలనుకున్నప్పుడు ముందుగా వాటి విషయమై సాధన చేయుట బహు ప్రయోజనకరము. కూటమునకు ముందే హాజరై ఆరాధికుల బృందము కలిసి ప్రార్థించి ప్రభువును కనిపెట్టుట చాలామంచిది.

బృందమంతా ఎటువెళ్ళాలనేది నాయకుడు నిర్ణయించాలి. వారికి స్వల్పమైన సూచనలు ఇస్తూ ఎటు వెళ్ళాలో నడిపించగలిగియుండాలి. చేతులుతో చేసే సంజ్ఞల ద్వారా ఎప్పుడు ప్రారంభించాలి లేక ఎప్పుడు ఆపాలి మరియు ఎప్పుడు తిరిగి పాడాలి అనేది బృంద సభ్యులందరు గమనించగలిగియుండాలి. ఈ సంజ్ఞలు సభ్యులు చూడగల్గునట్లుగా చేయుట మంచిదికాదు.

గాయకులు మరియు సంగీత వాయిద్యకులు పాటించ వలసిన సూచనల విషయమై ఈ గ్రంథము చివరిపేజీలలో కొన్ని ముద్రించియున్నాము. వాటిని ఉన్నపాటికే పాటించాలని నేను అనుటలేదుగాని అవి మీకు సూచనలుగా ఉండ వచ్చును. వివిధ సంఘములు వారి వారి పరిస్థితులను బట్టి ఆ సూచనలను అన్వయించుకోవచ్చును.

**మైకు నీ చేతిలో ఉందిగనుక**
**నీ కిష్టమైన మాటలు మాట్లాడవద్దు.**

# ఎనిమిదవ అధ్యాయము

## బీటలను బాగుచేయుట

దావీదు రాజ్యములో మరియు సొలొమోను రాజ్యములో సంభవించిన ఉజ్జీవములలో దావీదు సంగీతము ప్రధాన పాత్రను వహించింది. యూదారాజ్యములో దిగువ ఉజ్జీవములు సంభవించినప్పటికి ప్రతి ఉజ్జీవములో కూడా దావీదు సంగీతము మరియు దైవారాధనే పునరుత్థరింపబడింది (2 దిన 20:21-29, 27:16-18, 29:25-28, 35:15-18, యెహెజ్కేలు 3:10-11, నెహెమ్యా12:27-43). యూదారాజ్యము కొరకు దావీదు నెలకొల్పిన ఆరాధన విధానము బహు ప్రాముఖ్యమైనది. యూదా అనగా స్తుతి అని అర్థము. అంటే వీరు స్తుతించు రాజ్యముగా ఉండాలనేది దేవుని ఉద్దేశ్యము.

ఇలాంటి ఉజ్జీవములు సంభవించినప్పటికి మధ్యలో దీర్ఘకాలము దేవుని ప్రజలు నునువెచ్చనిస్థితిలో పడి వెనక్కు జారినట్లు చూడగలము. దావీదు యొక్క ఆరాధనా విధానమును మరచి, వారు జీవించిరి. అయితే మరల క్రొత్త ఉజ్జీవము సంభవించినప్పుడు ఆ సంగీతము తిరిగి పునరుత్థరింపబడుతుండేది. ఆమోసు 9:11లో దావీదు ప్రత్యక్షపు గుడారము కూలుటను చూస్తాము. అంతేగాక అక్కడ ఒక బీట ఏర్పడునని చదవగలము, “పడిపోయిన దావీదు గుడారమును ఆ దినమున నేను లేవనెత్తి దానిగోడను బాగుచేసి దానిపోయిన చోట్లను బాగుచేసి, ఎదోము శేషమును నా నామము ధరించిన అన్యజనులనందరిని నా జనులు స్వతంత్రించుకొనునట్లు పూర్వపురీతిగా దానిని మరల కట్టుదును”.

యూదా రాజ్యములో సంభవించినట్లే సంఘ యుగములో ఆయా ఉజ్జీవ కాలముల మధ్యగల వ్యవధిలో అనేక బీటలు ఏర్పడియున్నవి. ఈ ఉజ్జీవ కాలములో బీటలు తిరిగి కట్టబడాలి. మన ఆరాధన దావీదు ప్రత్యక్షపు గుడారపు నమూనాకు పునరుద్ధరింపబడాలి.

నిజమైన ఆరాధనను మరియు ఉజ్జీవమును ఆపే కారణములేవి? మరియు ఆ సమయములో ఏర్పడిన బీటలను బాగుచేయుట ఎలా? దావీదు తన ఆరాధనలో అనుభవించిన మొదటి బీట ఉజ్జావలె కలిగింది (2 సమూ 6:8). ఆ సమస్యను గూర్చి అవగాహన మనకు ఇక్కడ సహాయపడుతుంది. దేవుని మహిమను తన ప్రజల యొద్దకు తీసుకొని రావాలని దావీదు చేసిన ప్రయత్నములో ఒక



అభ్యంతరమేర్పడింది. దావీదు అనుభవములో ఇలాంటి బీటలు ఏర్పడినప్పటికి వాటిని బాగుచేసి తిరిగి పునరుత్థరణ కలుగజేసాడు.

## దేవుని మహిమను తీసుకొనువచ్చుటకు దావీదు చేసిన ప్రయత్నము

1 దిన 13లో దావీదు ఇశ్రాయేలంతటికి రాజై, దేవునిమందసమును తిరిగి వారి మధ్యలోనికి తీసుకువచ్చుటకు ప్రయత్నించెను. ఈ మందసము తుమ్మకర్రతో చేయబడి బంగారముతో పూతవేయబడి దానిపై రెండు బంగారపు కెరూబులు ఉండెను. దేవుని సన్నిధికి సూచనగానున్న ఈ యొక్క మందసము కట్టవలసిన విధానమును ప్రభువు మోషేకు సూచించాడు. అది వారి మధ్యనుండగా దేవుని మహిమ వారిమధ్యనున్నట్లుగా వారు గమనించారు.

ఈ మందసము శతాబ్దాలుగా ఇశ్రాయేలీయులయొద్దనే యుండెను. కాని ప్రధాన యాజకుడైన ఏలీ కాలములో ఈ మందసము ఫిలిష్తీయులచేత కొనిపోబడింది. 1 సమూ 4లో ఫిలిష్తీల సైనికులు ఇశ్రాయేలీయులపై దాడిచేసినప్పుడు ఇశ్రాయేలీయులు మందసమును యుద్ధ భూమి యొద్దకు తీసుకొనివచ్చారు. అయితే ఇశ్రాయేలీయుల పాపమును బట్టి దేవుడు వారికి ఓటమిని కలుగజేసాడు. అప్పుడు మందసమును ఫిలిష్తీయులు వారితో కూడా కొనిపోయారు. ఆ దినమున ఏలీ మరియు తన ఇద్దరు కుమారులు చనిపోగా తన కోడలు ఒక కుమారునికి జన్మనిచ్చి అతనికి ఈకాబోదు అని పేరు పెట్టింది. ఈకాబోదు అనగా మహిమ విడిచిపోయెను అని అర్థము. ఆమె ప్రసవ వేదన పడుచుండగా ఇలా అనెను, “దేవుని మందసము పట్టబడి పోయినందున ప్రభావము ఇశ్రాయేలీయులలో నుండి చెరపట్టబడి పోయెనని ఆమె చెప్పెను” (1సమో 4:22).

మందసమును కొనిపోయిన ఫిలిష్తీయులు దానిని వారితో ఎంతోకాలము ఉంచుకోలేదు. ఎందుకనగా ప్రభువు తన శక్తిని వారిమధ్య ప్రదర్శించి వారు కట్టుకొనిన మహా విగ్రహమును కూల్చి వారికి తెగుళ్లు కలుగజేసెను (1సమూ 5:1-12). అంతట దీనంతటికీ కారణము దేవుని మందసమే అని వారెరిగి మందసమును ఒక బండిపైనుంచి, రెండు పాలిచ్చు ఆవుల చేత దానిని పంపివేయ నిర్ణయించుకొనిరి. అవి ప్రకృతి సహజమైన రీతిలో తిరిగి వాటి దూడల యొద్దకు రాకమాని, వారు వెళ్లవలసిన మార్గమందు అనగా ఇశ్రాయేలీయుల వైపుకి నడవసాగిరి. అంతట దేవుడే వాటిని అద్భుతరీతిగా నడిపిస్తున్నాడని ఫిలిష్తీయులు ఎరిగి సంతోషించిరి.

మరొకసారి దేవుడు తనశక్తిని ఫిలిష్తీయుల యెదుట ప్రదర్శించుకున్నాడు. అది ఎలాగనగా ఆయన ఆ పాలిచ్చు ఆవులను నడిపించి మందసమును తిరిగి ఇశ్రాయేలుకు రప్పించెను (1సమూ 6). అయితే మందసము ఇశ్రాయేలు చేరుకున్నప్పుడు దావీదు ఇలా ప్రకటించెను, "మన దేవుని మందసమును మరల మనయొద్దకు కొనివత్తము రండి; సౌలు దినములలో దానియొద్ద మనము విచారణ చేయకయే యుంటిమి" (1దిన 13:3).

దావీదు దేవుని హృదయానుసారి కావటము చేత దేవుని మహిమను తిరిగి తన ప్రజల మధ్యకు తీసుకురావాలని అపేక్షించెను. ఆ మందసమును తిరిగి యెరూషలేము ప్రధాన పట్టణముకు తీసుకురావాలనే తన మొదటి ప్రయత్నము 1దిన 13:6-13లో చదవగలము, "కెరూబులమధ్య నివాసము చేయు దేవుడైన యెహోవా నామము పెట్టబడిన ఆయన మందసమును యూదాలోనుండి కిర్యత్యారీము అనబడిన బాలానుండి తీసుకొనివచ్చుటకై అతడును ఇశ్రాయేలీయులందరును అచ్చటికి పోయిరి. వారు దేవుని మందసమును ఒక క్రొత్త బండిమీద ఎక్కించి, అబీనా దాబు ఇంటనుండి తీసుకొనివచ్చిరి; ఉజ్జాయును అహ్యోయును బండిని తోలిరి. దావీదు ఇశ్రాయేలీయులందరును తమ పూర్ణశక్తితో దేవుని సన్నిధిని పాటలు పాడుచు సితారాలను స్వరమండలములను తంబురలను తాళములను వాయించుచు బూరలు ఊదుచుండిరి. వారు కీదోను కళ్ళమునొద్దకు వచ్చినప్పుడు ఎడ్లకు కాలు జారినందున మందసమును పట్టుకొనవలెనని ఉజ్జా చేయిచాపగా యెహోవాకోపము అతనిమీద రగులుకొనెను, అతడు తన చేయి మందసము నొద్దకు చాపగా ఆయన అతని మొత్తెను గనుక అతడు అక్కడనే దేవుని సన్నిధిని చనిపోయెను. యెహోవా ఉజ్జాను వినాశము చేయుట చూచి దావీదు వ్యాకుల పడెను; అందుచేత ఆ స్థలమునకు నేటివరకు పెరెజ్ ఉజ్జా అనేపరు. ఆ దినమున దావీదు దేవుని విషయమై భయమొంది - దేవుని మందసమును నా యొద్దకు నేను ఏలాగు తీసుకొని పోవుదుననుకొని మందసమును, తన యొద్దకు దావీదు పురమునకు తీసుకొనిపోక, దాని గిత్తీయుడైన ఓబేదెదోము ఇంటిలోనికి కొనిపోయెను".

ఇశ్రాయేలుకు రాజుగా నిలిచిన దావీదు ఆరంభించిన ఈ మొదటి ఉజ్జీవము మొదటిలో బాగానే ఉండెను. ప్రజలందరు కూడా ఆ సభకు హాజరై ఎంతో సంతోషముతో సంగీత వాయిద్యములు వాయిస్తూ గాన ప్రతిగానములతో ప్రభువును సంతోషపెట్టిరి. కాని అకస్మాత్తుగా ఆ ఉజ్జీవము ఆగిపోయెను. ఎందుకనగా దేవుడు వారిమీదికి ఆశీర్వాదముకు ప్రతిగా తీర్పును పంపించనిష్టపడెను.



# కీదోను యొక్క కళ్లము

దావీదు మరియు ఇశ్రాయేలీయులందరు దేవుని మందసమును యెరూషలేము యొద్దకు తీసుకొనివస్తుండగా ఈ కళ్లమునుదాటి వెళ్ళవలసి వచ్చెను. వారిలోనున్న మిశ్రమమును తొలగించాలని ప్రభువిక్కడ నిశ్చయించుకొనెను.

మత్తయి 3:12లో ప్రభువైన యేసు ఇలా సెలవిస్తున్నారు, "ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులోపోసి, ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయునని వారితో చెప్పెను". మనము పరిశుద్ధమైన దేవుని ఆరాధిస్తున్న వారము గనుక ఆయా సమయములలో మనలో నున్న మిశ్రమమును తొలగించి మనల్ని త్వరితమైన తీర్పుద్వారా పవిత్రపరచాలని ఆయన ఆశిస్తూ ఉంటాడు. మన ఆత్మీయ అభివృద్ధిలో ఇలాంటి కళ్లములు దాటవలసి యున్నాము.

ఈ కళ్లముకు కీదోను యజమాని. హెబ్రీ భాషలో తన పేరుకు అర్థము నాశనము లేక ఉపద్రవము. కీదోను కళ్లమును దాటుచున్న సమయములోనే ఈ ఉపద్రవము సంభవించింది. దేవుడు ఉజ్జాను సంహరించెను. అంతట ఉజ్జీవము అకస్మాత్తుగా ఆగిపోయింది.

ఆ స్థలముకు దావీదు పెరెజ్ ఉజ్జా అని పేరు పెట్టెను. అనగా ఉజ్జాయొక్క బీట. దీనిని తిరిగి బాగుచేయునంతవరకు ఉజ్జీవము సంభవించదు.

మన సంఘములలో కూడా ఉజ్జీవము ఆగిపోవటానికి ఇటువంటి బీటలే కారణం. దావీదుకు వలె మంచి ఉద్దేశ్యములు కలిగియున్నప్పటికి మన పరిచర్య నిరాటంకముగా సాగుతుందని మనము నమ్మినప్పటికి మనలోనున్న మిశ్రమమును బయట పెట్టాలని ప్రభువు మనకు ఆ కళ్లము అనుభవమును పెడతాడు. అంతట మనలోనున్న కలుషితము తొలగింపబడి పరిశుద్ధులము అవుతాము.

దావీదు జీవితములో మరొక కళ్లము అనుభవము కలిగెను. అదెప్పుడనగా ఇశ్రాయేలుపై మహాగొప్ప తెగులును ప్రభువు పంపించినప్పుడు (1దిన 21:15). అంతట దావీదు పశ్చాత్తాపపడి ఓర్నాను కళ్లము యొద్ద ఒక బలిపీఠమును కట్టించి దానినే సొలొమోను దేవాలయముకు పునాదిగా చేసెను (1దిన 21:26, 22:1, 2దిన 3:1). కాబట్టి ఈ కళ్లము అనుభవము ద్వారా తీర్పు మరియు పరిశుద్ధత మనలో జరుగుతుంది. ఆ పిమ్మట మహిమోన్నతమైన ఉజ్జీవము మరియు దైవారాధనను మనము చూస్తాము.

ప్రభువు తన ప్రజలను కళ్లముల యొద్దకు తీసుకొనివచ్చుట నేడు కూడా మనము చూస్తున్నాము. అది అంతర్జాతీయ స్థాయిలో కావచ్చును లేక సంఘ స్థాయిలో కావచ్చును. తన ప్రజల మధ్యనున్న మిశ్రమమును ప్రభువు నిర్మూలిస్తున్నాడు. పశ్చాత్తాము పొంది పరిశుభ్రపరచబడునప్పుడు మహిమోన్నతమైన ఉజ్జీవముకు చోటునిస్తాము. ప్రభువును ఆత్మతోను సత్యముతోను సేవిస్తూ ఉండగా ఉజ్జీవము మనకు సంభవిస్తుంది.

## ఎడ్ల కాలు జారుట

1 దిన 13:9లో కీదోను కళ్లము నొద్ద ఎడ్ల కాలు జారుటను చూస్తాము. దీనికి కారణము మందసము తప్పుడు పద్ధతిలో మోయబడుచుండెను. వారు పిలిష్తీయుల పద్ధతిని పాటించి లేఖనములలోనున్న క్రమమును ఉల్లంఘించిరి. (1 సమూ 6:8, నిర్గమ 25:14 చూడండి). వారి ఆరాధనలో నున్న ఈ మిశ్రమము నుండి వారిని పవిత్రపరచాలని ప్రభువు చూచెను.

ఎద్దు అనేది పరిచారకునికి లేక సేవకునికి సూచనయని నూతనిబంధన లేఖనములెన్నో సూచిస్తున్నవి (1కొరింథీ 9:9-10, 1 తిమో 5:17-18). ఎడ్ల కాలు జారుటకు ప్రభువు అనుమతించిన ప్రకారమే, ప్రభువు కూడా మన పరిచర్యలో మనము కాలుజారుటకు అనుమతిస్తాడు. అంటే దేవుని సన్నిధిని రప్పించుటకు మనము తప్పుడు పద్ధతులు ఉపయోగించినప్పుడు ఇలా జరుగుతుంది. ఈ కాలు జారుటవలన ఆ తప్పుడు పద్ధతినుండి ప్రభువు మనల్ను విడిపిస్తాడు. తప్పుడు పద్ధతిని ప్రయోగించి దేవుని ప్రజల మధ్యకు తీసుకురావాలని చూస్తే అక్కడ తప్పక తీర్పు ఉంటుంది. ప్రభువు మనల్ని తన కళ్లముయొద్దకు తీసుకొనివచ్చి పవిత్రపరుస్తాడు.

ఎడ్ల కాలు జారినప్పుడు మందసము కూడా కదిలెను. అంటే దేవుని సన్నిధి అక్కడ అభ్యంతరపడెనని చూడగలము. కాబట్టి ఆరాధనా కూటము చక్కగా ప్రారంభమైనప్పటికి పరిచర్యలో కాలుజారుట సంభవిస్తే దైవాభిషేకము అక్కడ అభ్యంతరపడుతుంది. పరిశుద్ధాత్ముడు ఒక పావురము వంటివాడు. పావురమనునది బహు సున్నితమైన పక్షి. దానిని సులువుగా మనము అభ్యంతరపెట్టగలము, అంతట అది ఎగిరిపోతుంది. మన పరిచర్యలో కాలు జారతాఉంటే దేవుని సన్నిధికూడా అలాగునే ఎగిరిపోతుంది. కాబట్టి మన ఆరాధనా కూటములలో పరిశుద్ధమైన భక్తిని ఆచరించి దేవుని సన్నిధిని అభ్యంతర పెట్టునదేదియు చేయక యుందుము గాక.



మందసము కదలుట ఉజ్జా చూచి వెంటనే అది నేలకూలకుండునట్లు తన చెయ్యిచాపి పట్టుకొనెను. ఉజ్జా అనగా హెబ్రీ భాషలో బలమని అర్థము. ఒక కూటములో అభిషేకము అభ్యంతరపడుతున్నప్పుడు మనము ఏం చేస్తాము? మన బలమంతా ఉపయోగించి ఉజ్జాకువలె ఆ కూటమును కాపాడాలని ప్రయత్నిస్తాము. ప్రకృతి సంబంధమైన వ్యక్తి ఎప్పుడూ తన చెయ్యి చాపి ఆ మందసమును ఆపాలని ప్రయత్నిస్తాడు. తన సొంతసామర్థ్యము మరియు తలాంతుల చేత కూటమును నడిపించాలని ప్రయత్నిస్తాడు. కొన్ని సంఘములు దేవుని యొక్క అభిషేకమును సంవత్సరముల తరబడి పోగొట్టుకొనియున్నాయి. అయితే వారి పరిస్థితిని వారొప్పుకొని తిరిగి దేవుని అభిషేకమును పొందుకొనుట మాని తమ నాయకులు వివిధమైన వినోద కార్యక్రమములతో ప్రజలను సంతోష పెట్టి లేనిదానిని ఉన్నదన్నట్టుగా నడిపించ ప్రయత్నిస్తారు. అయితే ఆత్మసంబంధమైన మనుష్యుడెప్పుడు కూడా శరీరమును ఆస్పదము చేసుకొనడు. యేసు యోహాను 15:5లో చెప్పిన మాటలు మనము గ్రైకొందుము గాక. శక్తి చేతకాదు, బలము చేతకాదు. నా ఆత్మద్వారానే సంభవించునని మనము చూతుము గాక (జకర్యా 4:6).

## మరణము

మందసమును ముట్టుకొన ప్రయత్నించిన ఉజ్జా మొత్తబడి మరణించెను. ఇది మోషే ధర్మశాస్త్ర ప్రకారము నిషేధింపబడిన క్రియ (సంఖ్యా 4:5, 15). ఇదే కారణము చేత ఇశ్రాయేలు 80 సంవత్సరముల క్రితము దేవుని తీర్పును అనుభవించిరి. బెత్‌షేమేషులో వేలాదిమంది ఇశ్రాయేలీయులు ఇలాంటి అతిక్రమము వలనే మరణించిరి (1 సమూ 6:19). దీనంతటి విషయమై ఉజ్జా తెలుసుకున్నప్పటికి ఉజ్జా ఈ అతిక్రమముకు పాలుపడెను. ఇదే విధముగా మనము కూడా ప్రభువు సన్నిధిని మన గృహములలో నిలుపుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటాము. మన సంఘములలో దేవుని మహిమను భద్రపరచుకోవాలని చూస్తుంటాము. అయితే పరిశుద్ధుడైన దేవుని అలా మనము అరికట్టలేము. మనలో సాధారణ లేక భక్తిహీన ప్రవర్తన ఉన్నట్లయితే ప్రమాదకరమైన మార్గములో నడుస్తున్నామని గమనించాలి. మన తలాంతులతో లేక తెలివితేటలతో దేవుని పనిని నడిపిస్తున్నామని మనమనుకుంటే దేవుని ఉగ్రత మనమీదికి దిగివస్తుంది. మనల్ని మనము తగ్గించుకొని దీనదాసులముగా పరిశుద్ధాత్ముని నడిపింపుకే మనము లోబడియుండాలి.

ఉజ్జా నిర్భయముగా తన చెయ్యి చాపినందుకు తాను మొత్తబడెను. అయితే మిశ్రమము ఉన్నచోట మరణము సంభవించుట ఇది మొదటిసారి కాదు.

ఇశ్రాయేలీయులు అరణ్యములో బంగారు దూడను చేసి దానిని పూజించినప్పుడు కొన్నివేలమంది సంహరించబడిరని మనకు తెలుసు. అయితే కొన్ని వారముల క్రితమే ఇదే ప్రజలు ఎర్రసముద్రము యొద్ద ప్రభువును మహిమోన్నతమైన రీతిలో ఆరాధించిరి. అయితే ఆత్మలో దేవుని ఆరాధించుట కొనసాగింపక విగ్రహారాధన మరియు అపవిత్రతకు చోటునిచ్చారు. ఒకప్పుడు ఆత్మలో ఆరాధిస్తూ ప్రభువును సంధించిన సంఘము కొన్ని వారములైన పిమ్మట అలాగే కొనసాగుతుందని చెప్పలేము. హెబ్రీ3:13 మనకిలా సెలవిస్తుంది, "నేడు మీరాయన శబ్దమును వినినయెడల, కోపము పుట్టించినప్పటివలె మీ హృదయములను కఠినపరచుకొనకుడని ఆయన చెప్పెను".

అహరోను కుమారులు వింత అగ్నిని ప్రభువుకు అర్పించినప్పుడు వారు ఎలా సంహరించబడిరో లేవి 10:1-10లో చదవగలము. పరలోకము నుండి ప్రభువు పంపిన అగ్ని నుండి అనుదినము యాజకులు బలిపీఠపు అగ్నిని ప్రారంభించవలసి యుండిరి (లేవి 9:24). పరలోకము నుండి దిగివచ్చిన అగ్ని మాత్రమే ఆరాధనకు యోగ్యమైనది. అదే విధముగా మన సంగీతము మరియు దైవారాధనకు కూడా పరిశుద్ధాత్మ వలన కలిగిన అగ్ని వలనే ఉజ్జీవము రావాలి. అయితే వివిధరకములైన వింత అగ్నిలు లేక అభిషేకములు మనల్ను ప్రేరేపింపజూస్తాయి. లోకసంబంధమైన వాయిద్యకులు మరియు గాయకులు దురాత్మల వలనైన అభిషేకము చేత దురాశ, గర్వము, తిరుగుబాటును ప్రేరేపిస్తాయి. వారు పాడే పాటలలో ఉన్న మాటల ద్వారా అవి ఖచ్చితంగా దురాత్మ ప్రేరేపితమైనవని మనము సులువుగా చెప్పవచ్చును. అయితే క్రైస్తవులు తమ హృదయములలో పాపముకు చోటునిచ్చి సంగీతము లేక గానము చేయ ప్రయత్నిస్తే అట్టివారు కూడా విచిత్రమైన అగ్నిని అర్పిస్తున్నట్లే.

సంఘ ఆరాధనా కూటములలో ఇలా జరుగుట నేను చూసాను. ఒకానొక సందర్భమందు ఒక సోదరుడు ప్రభువునుద్దేశించి ఐ.లవ్.యు అనే మాటతో ఒక పాటను పాడుతున్నట్లే పాడుతూ ఆ ప్రక్కనేనున్న ఆవివాహితులైన సహోదరులను చూచి ఐ.లవ్.యు అంటూ ఉన్నాడు. అయితే తాను దురాశ మరియు గర్వమనే వింత అగ్నిని పాటద్వారా అర్పిస్తున్నాడని నా ఆత్మలో నేను వివేచించాను. కొన్ని నెలలైన తరువాత ఈ సేవకుడు పాపములోపడి పూర్తిగా దిగజారెను.

మరొక సందర్భములో సౌండ్ మిక్సింగ్ చేసే సోదరుడు ఇది వరకు లోకములో సంగీత ప్రదర్శనల అనుభవము కలవాడగుటచేత ఆ ప్రకారమే చేస్తుండెను. ఆరాధన నడిపించు నాయకుడు అలా చేయరాదని హెచ్చరించనప్పటికి తాను విననొల్లక, అట్టి వింత అగ్నిని అనగా తిరుబాటు, అహంకారమును ఆరాధనలో మిళితము చేసెను. కొన్ని రోజులైన పిమ్మట తన అహం తనను పూర్తిగా వెనక్కి జార్చి సంఘానికి దూరం చేసింది.



ఆరాధన బృందములో నాయకుడుగాని, సభ్యుడుగాని, ఓటమిలో నున్నట్లయితే సంఘనాయకులు దీనిని గమనించి కొన్నాళ్లు తనను పరిచర్య నుంచి దూరం పెట్టాలి. అయితే అనేకసార్లు అంతటి తలాంతులు గలవారిని బృందమునుండి తొలగిస్తే ఆరాధనా క్రమము దెబ్బతింటుందనే భయముతో అట్టివారిని పరిచర్యలో కొనసాగింపజేస్తారు. అతిక్రమములో జీవిస్తున్న ఈ వ్యక్తి ఏ విధముగా కూడా దేవునికి పవిత్రమైన బలులనర్పించలేడు. కాబట్టి అట్టివారిని దూరముగా నుంచుట నాయకుల బాధ్యతైయున్నది. వారిని బహిరంగముగా అవమాన పరచనక్కరలేకుండా దీనిని చేయవచ్చును. మరొక తాజా అవకాశమునిచ్చి ప్రభువుకు పూర్తిగా సమర్పించుకొన్నంతవరకు వారిని పరిచర్యనుండి దూరము పెట్టుట అవసరము.

కొన్ని సంఘములు సంగీత వాయిద్యకుల కొరకు వెనక్కి జారిన వారిని లేక రక్షణ లేని వారిని కూడా బృందములోనికి చేర్చుకుంటారు. అట్టివారు సంఘములో వాయిస్తుండగా బహుశా రక్షింపబడవచ్చునేమోనని వారనుకుంటారు, అలా వారిని చేర్చుకొనుట వారి రక్షణకు సహాయపడుతుంది అని అనుకొనుట భ్రమే.

పాపులను సంఘానికి ఆహ్వానించి వారికి రక్షణను అందించుట మంచిదే. కాని అలాంటి వారిని ఆరాధన నడిపించుటకు మనము ఆహ్వానింపజాలము. (సంఘమునకు లోకసంబంధమైన సినీ నటులు, రాజకీయ నాయకులను ఆహ్వానిస్తూ వారిని బట్టి రక్షణ లేని అనేకులు సంఘానికి చేర్చబడతారని ఆశిస్తారు.) భక్తి పూర్వకమైన దేదైనా ప్రజల హృదయములను కదలించి రక్షణలోనికి నడిపించగలదేమోగాని లోక సంబంధమైన సమస్తమూ కూడా నునువెచ్చని స్థితిని లేక వెనక్కిజారుటను ప్రేరేపిస్తాయి.

సమర్పించుకొననివారు సంగీతము మరియు దైవారాధనలో పాలిపంచుకొనుటకు అనుమతించుట ఆ సంగీత కార్యక్రమానికి మంచి పేరును తెచ్చిపెట్టొచ్చునేమోగాని సంఘమునకు నిజపరిచర్య అట్టివారి ద్వారా అందింపబడదు. దీనిని ప్రభువు హేయకరమైనదని అంటున్నాడు (యెహెజ్కేలు 44:6-8). ఇది వరకు చెప్పుకున్న ప్రకారమే ఈలాగున వింత అగ్నిని మన ఆరాధనా కూటములలోనికి ఆహ్వానిస్తుంటాము. అహరోనుకుమారులు వింత అగ్నిని అర్పించినప్పుడు వారు సంహరించబడిరి. కాబట్టి అలా చేస్తే మన ఆరాధనా కూటములలోనికి మరణానికి త్రావు చేస్తాము. సంగీత వాయిద్యకులులేని సంఘములలో కూడా ఏకాత్మ ఏక మనస్సుతో గానముచేస్తే దేవుని సన్నిధి వారిమధ్యకు దిగివస్తుంది. అభిషేకములేని మంచి సంగీత వాయిద్యకులు కంటే ఇది శ్రేష్ఠము.

పాత నిబంధనలో ఇలాంటి ఆరాధనాకూటములు దేవుని తీర్పుకు లోనైనవి మనము చదవగలము. మనమిప్పుడు నూతన నిబంధనలో నున్నాము. అంటే పాత నిబంధనలో సంఘటనల నెరవేర్పుకాలమిది. మన ఆరాధన విషయమై ప్రభువు సంతోషింపకయుంటే ప్రభువు మన మీదికి ఆధ్యాత్మిక మరణమును పంపవచ్చు. అలా జరిగినప్పుడు ఆయన అద్భుతకరమైన సన్నిధిని మనము అనుభవించలేని స్థితిలో మిగిలిపోతాము. ఒక సంఘములో ఆధ్యాత్మిక మరణము చోటు చేసుకున్నప్పుడు వారిమధ్య భేదములు ఏర్పడతాయి (1 యోహాను 3:14, సామెతలు 18:21) అంతట వారు ఆరాధనపై తమ మనస్సులను కేంద్రీకరింపలేక యుంటారు (రోమా 8:6, 2 కొరింథీ 7:10).

## నిబంధన మందసము ఆగిపోయెను

ప్రభువు ఉజ్జాను కీదోను కళ్లము యొద్ద మొత్తగా దిగువ సంఘటన సంభవించెను, "దావీదు పురమునకు తీసికొనిపోక, దానిని గిత్తీయుడైన ఓబేదెదోము ఇంటిలోనికి కొనిపోయెను. దేవుని మందసము ఓబేదెదోము ఇంటిలో అతని కుటుంబము నొద్ద మూడు నెలలుండగా యెహోవా ఓబేదెదోము ఇంటివారిని అతని సొత్తంతటిని ఆశీర్వదించెను" (1దిన 13:13-14).

నిబంధన మందసము యెరూషలేము వైపుకు ప్రయాణమవుచుండగా ఉజ్జా వలనైన కీడుచేత అది అక్కడ మూడు మాసములు ఆగిపోయింది. నిబంధన మందసము దేవుని సన్నిధికి సూచన గనుక పరిశుద్ధాత్ముని అభిషేకమును ఆపగలమనుటకు ఇదే ఋజువు. కొన్ని సార్లు ఒక సంఘములో కొన్ని సంవత్సరముల తరబడి పరిశుద్ధాత్మ కదలిక లేకపోవచ్చును, అయితే అలా జరిగినప్పుడు ఏదో పాతకాలపు కథలు చెప్పుకొని మనమలాగునే కొనసాగక, ప్రభువు సన్నిధిని వెదకి సమస్యను కనుగొని దానిని సరిదిద్దుకొని మరల ఉజ్జీవములోనికి ప్రవేశించాలి.

## బీటను బాగుచేయుటకు దావీదు సిద్ధపడుట

మందసము ఆగిన మూడు నెలల వ్యవధిలో ప్రభువు సన్నిధిలో దావీదు కనిపెట్టి పొరపాటును గ్రహించి దానిని సరిదిద్దుకోవాలని నిర్ణయించుకొన్నాడు. ఏ విధముగానైనను నిబంధన మందసమును ఇశ్రాయేలుకు తిరిగి తేవాలని దావీదు ఆశించాడు. అయితే ప్రభువుకు అయిష్టమైన రీతిలో దానిని చేసి తీర్పుకు లోనవుట దావీదుకు



ఇష్టము లేదు. ప్రభువును తాను వెదకగా సరియైన రీతిలో నిబంధన మందసమును దేవుని ప్రజల మధ్యకు దానిని తీసుకొనువచ్చు విధానమును తాను తెలుసుకున్నాడు.

మొదటిగా నిబంధన మందసము కొరకు ఒక గుడారమును సిద్ధ పరచాడు (1దిన 15:1). మొదటిసారి నిబంధన మందసమును దావీదు తీసుకొనిరావాలని ప్రయత్నించినప్పుడు దానికొరకు ఒక స్థలమును నిర్ణయించినట్లు మనము చూడలేము. అయితే మన ప్రభువు క్రమమునకు దేవుడై యున్నాడు గనుక ఆయన రప్పించబోవు దీవెన కొరకు సమస్తమూ సిద్ధపడియుండాలనేది దేవుని కోరిక. దేవుని దాసులముగా ప్రభువు కొరకు ఆయన మహిమ ప్రత్యక్షపరచబడుట కొరకు మార్గమును సిద్ధపరచు బాధ్యత మనపైనున్నది (యెషయా 40:3-5). నిబంధన మందసము కొరకు దావీదు ఒక స్థలమును సిద్ధపరిచిన ప్రకారమే మన సంఘము మన జీవితము మరియు మన కుటుంబము, పరిచర్య దేవుని మహిమకొరకు సిద్ధపడియుండాలి.

కీర్తన 132:1-9లో ప్రభువు కొరకు దావీదు ఒక స్థలమును సిద్ధపరచాలని వ్యక్తిపరచిన కోరికను చూడగలము. తాను చిన్న బాలునిగా ఉన్నప్పుడే దేవుని మందసమును గూర్చి మొదట విన్నాడు. ఫిలిష్తీయులచేత ఆ మందసము కొనిపోబడినప్పుడు దేవుని మహిమ ఇశ్రాయేలును విడిచిన సంఘటన కూడా విని ఉంటాడు. అది తిరిగి ఇశ్రాయేలుకు వచ్చినప్పుడు రాజైన సౌలు దానిని నిర్లక్ష్య పెట్టుటను కూడా తాను ఎరిగియుండెను. కాగా దావీదు రాజైన వెంటనే నిబంధన మందసము కొరకు వెదకి దానిని కిర్యాతియార్యాములో కనుగొన్నాడు (కీర్తన 132:6).

దేవుని కొరకు ఒక స్థలమును సిద్ధపరచాలనే కోరిక దావీదు హృదయములో బలముగానున్నట్లు కీర్తన 132:3-5 వచనములలో చూస్తాము, "యాకోబు యొక్క బలిష్ఠునికి మ్రొక్కుబడిచేసెను. ఎట్లనగా యెహోవాకు నేనొక స్థలము చూచువరకు యాకోబు యొక్క బలిష్ఠునికి ఒక నివాస స్థలము నేను చూచువరకు నా వాసస్థానమైన గుడారములో నేను ప్రవేశింపను, నేను పరుండు మంచము మీదకెక్కను నా కన్నులకు నిద్ర రానియ్యను, నాకనురెప్పలకు కునికిపాటు రానియ్యననెను".

దేవుని మహిమను తిరిగి మన మధ్యలోనికి రప్పించుకోవాలనుకున్నప్పుడు ఆ కోరిక మన హృదయములో బలముగా ఉండాలనేది చాలా అవసరము. ఈ కోరిక మన అనుదిన ప్రేరణగా నుండాలి. ఆ కోరికతోనే అనుదినము జీవిస్తూ ప్రభువును మన అనుదిన ప్రార్థనలో కలుసుకొనకుండా దినమును ముగించకూడదనే తీర్మానము మనకుండాలి. మన హృదయములలో ఆయనకు నిత్యస్థావరమును ఏర్పరచాలి. శరీర సంబంధమైన క్రైస్తవుడు అనుదిన చర్యలలో నిమఘ్నుడై ప్రభువును అనుదినము కలుసుకొనకపోయినా మరుసటిదినముకు వాయిదావేసి ఆలాగునే

నిద్రిస్తాడు. సమస్త క్రైస్తవ పరిచర్యకు పునాది, రహస్య ప్రార్థనా సమయములలో ప్రభువుని కలుసుకొనుటయేనని మనము పూర్తిగా గ్రహించాలి. ప్రభువు మనయొక్క జీవితమును అనుదినమూ దర్శిస్తేనే మన కుటుంబము మరియు సంఘములోనికి ఉజ్జీవమును మనము రప్పించగలము.

## మనల్ని మనము పవిత్రపరచుకొనుట

ఆ తదుపరి 1 దిన 15:12లో రెండవసారి దావీదు నిబంధన మందసమును యెరూషలేమునకు తీసుకొనివచ్చుట చూస్తాము. లేవీయులైనవారు తమను తాము పవిత్రపరచుకొని దావీదు సిద్ధపరచిన స్థలముకు నిబంధన మందసమును తీసుకురావాలని వారు చేస్తున్న ప్రయత్నమును చూస్తాము. ప్రభువును అనుదినము కలుసుకోవాలనే ప్రయత్నము నుండి ఇదంతా ఆరంభమవుతుంది. ఆరాధన పరిచర్యకు పిలువబడిన ప్రతిఒక్కరూ కూడా దేవుని మందసమును సంఘములోనికి తీసుకు రావాలని ఆశించాలి. అంతేగాక లేవీయులకు వలె తమను తాము పవిత్ర పరచుకోవాలి. పాటలు పాడేవారు మరియు సంగీత వాయిద్యకులు తమను తాము సిద్ధపరచుకొనే ప్రత్యేక బాధ్యత కలిగియున్నారు. అంతేగాక సంఘ సభ్యులందరు ఆరాధికుల పరిచర్యలో పాలిపంపులు కలిగియుండాలి. నీవు ఆధ్యాత్మికముగా అనర్హుడవై సిద్ధపడనివాడవైతే పరిశుద్ధాత్మ సంచారముకు నీవు అభ్యంతరము కావచ్చును. కొన్నిసార్లు ఒక్క 'ఆకాను' కూడా యుద్ధములో ఓటమికి కారకుడు కాగలడు (యెహోషువ 7). దేవుని సన్నిధిని ఆరాధన కూటములోనికి రప్పించుటకు అనగా దేవుని మందసమును మన మధ్యలోనికి తీసుకొనివచ్చుటకు పరిశుద్ధత ప్రాముఖ్యమైయున్నది.

పాత నిబంధనలో యాజకుల యొక్క పరిశుభ్రతలో ఒక భాగముగా రక్తమును తీసుకొని వారికుడి చెవి కొనపై రాసుకొనుట (నిర్గమ 29:1, 20). దీనియందు ఒక ప్రాముఖ్యమైన సత్యము ఒకటున్నది. అదేమనగా యేసు యొక్క రక్తమును మన చెవులకు పూసి లోకసంబంధమైన సంగీతమును వినకుండా మనల్ని మనము పవిత్రముగా నుంచుకోవాలి. మనము వినే దాని విషయములో జాగ్రత్త వహించాలి – కాగా యేసు రక్తమును మన చెవికి పూసుకోవాలి. ఒక క్రైస్తవ గాయకుడు లేక సంగీత వాయిద్యకుడు లోక సంబంధమైన సంగీతమును వింటే అది తప్పక తన సంగీతమును కలుషిత పరుస్తుంది. అంతట తన హృదయము కలుషితమై దేవుని గృహమందు ఉండవలసిన సంగీతము మరియు గానమును కలుషిత పరుస్తుంది. లోక సంబంధమైన సంగీత వాయిద్యకులు మరియు గాయకులు ప్రత్యేకమైన పాపముల చేత మరియు దురాత్మల చేత ప్రభావితము చెందియుంటారు. వారి సంగీతము



సాధారణముగా దురాత్మల ప్రేరేపితమైనదై మన ఆత్మలను కలుషిత పరచగలదు. కావున మన చెవులను మనము పవిత్రపరచుకొని, పవిత్రమైన సంగీతము మాత్రమే వాటిలోకి ప్రవేశింపజెయ్యాలి. క్రీస్తు రక్తమును చెవికి పూసుకొని యుందుము గాక.

రక్తము చేత యాజకులు పవిత్ర పరచబడుట మాత్రమే గాక పరిశుద్ధమైన తైలమును కూడా తమపై జల్లుకోవాలి (లేవీ 8:30). యేసు యొక్క రక్తముతో మనల్ని మనము పవిత్ర పరచుకొనుట మాత్రమేగాక పరిశుద్ధాత్ముని అభిషేకమును కూడా మనము కలిగియుండాలి. తద్వారా ఆత్మీయ వివేచన కలిగిమనముంటాము. ఏ సంగీతము ఎలాంటిదో గ్రహించగలిగియుంటాము.

దావీదు ఆరాధన క్రమములో పవిత్రపరచబడిన యాజకులు మాత్రమే పరిచర్యలో పాలిపంపులు పంచుకొననర్హులు. కాబట్టి ప్రభువును ఆరాధించాలని ఆశించి సమర్పించుకొన్న విశ్వాసులను మాత్రమే నాయకపదవికి హెచ్చించాలి. దీని విషయమై బహు జాగ్రత్త వహించాలి. కేవలము నాయకత్వ పదవిని అలంకరించి ప్రజల ఆకర్షణను ఆశించే వారెంత మాత్రము ఈ స్థానమునకు హెచ్చింపబడకూడదు. గాయకులు సంగీత వాయిద్యకులు మరియు నాట్యమాడువాడు కేవలము ప్రజలను వినోదపరచుట కొరకుకాక దేవుని ఆరాధించువారుగా ఉండాలి.

కొన్ని సంఘములలో ఆరాధన గానములు కొంతమంది పిల్లలను నిలబెట్టి వారిచేత పాడిస్తారు, నాట్యములు వేయిస్తారు. ఈ పిల్లలు కేవలము ప్రదర్శనలకే అలాచేస్తారు గాని నిజముగా దేవుని ఆరాధనలోనికి ప్రవేశించాలనే ధ్యాస వారికుండక పోవచ్చును. వారిలో పరిశుద్ధాత్ముని ప్రేరణ లేకపోవచ్చును. ప్రజలను ఆకర్షితులను చేయాలనేది వారి ముఖ్య ఉద్దేశ్యము కావచ్చును. ఇలాంటి ఒక సంఘమును గూర్చి నేను విచారిస్తూ ప్రభువు సన్నిధిలో ప్రార్థించగా ప్రభువు నా హృదయముతో ఇలా సెలవిచ్చారు, "బహుశా ఈ సంఘము అపరిపక్వస్థితిలో ఉన్నదేమో, కాని ఆ సంఘ కాపరులైనవారు ఎప్పుడైతే భక్తిగల ఆరాధికులను ముందు నిలువబెట్టి వారందరూ కలిసి ప్రభువును ఎప్పుడు ఆరాధిస్తారో అప్పుడు సంఘస్థులలో ఆధ్యాత్మిక పరిపక్వతను చూడగలరు."

అయితే చిన్నపిల్లలకు స్తుతి ఆరాధనా గానములు నేర్పించరాదని నేననుటలేదు. అయితే పాటలు నడిపించే గాయక బృందములో పిల్లలు ఎంతమాత్రము ఉండజాలరు. వారికి మొదట ఆరాధించుట నేర్పించి భవిష్యత్తు పరిచర్యను గూర్చి భావపూరితమైన రీతిలో వారిని సిద్ధపరచాలి. అప్పుడు ప్రభువును మనస్ఫూర్తిగా ఆరాధించు అభిషేకింపబడిన గాయకులుగా మరియు సంగీత వాయిద్యకులుగా వారవుతారు.

# క్రమము

క్రమము తప్పుట దేవుని ఉగ్రతకు దారితీస్తుందని. 1 దిన 15:13లో దావీదు లేవీయులకు ఇలా సెలవిస్తున్నాడు, “ఇంతకుముందు మీరు ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా మందసమును మోయకయుండుట చేతను, మనము మన దేవుడైన యెహోవా యొద్ద విధిని బట్టి విచారణ చేయకుండుట చేతను, ఆయన మనలో నాశనము కలుగజేసెను; కావున ఇప్పుడు మీరును మీ వారును మిమ్మును మీరు ప్రతిష్ఠించుకొని, నేను ఆ మందసమునకు సిద్ధపరచిన స్థలమునకు దాని తేవలెను”. దావీదు లేఖనములను పరిశీలించి మొదటిసారి మందసమును యెరూషలేముకు ఎందుకు తీసుకొనిరాలేకపోయాడని విచారణ చేసాడు. మోషే ధర్మశాస్త్రములో నిబంధన మందసమును లేవీయులు మాత్రమే మోయాలనే సంగతిని కనుగొన్నాడు (ద్వితి 10:8). మొదటిసారి దావీదు ఒక క్రొత్త ఎడ్లబండిని తయారు చేయించాడు (1దిన 13:7). ఈ ఆలోచన తనకు ఎక్కడ నుండి కలిగింది? దేవుని శత్రువులైన ఫిలిష్తీయుల యొద్దనుండియే కదా? (1సమూ 6:7-14).

అనేకసార్లు దేవుని ప్రజలు ఆరాధన కూటము నడిపించుటయందు లేఖనానుసారమైన క్రమమును పాటించరు. లోకసంబంధమైన ఉపాయములను ఉపయోగిస్తారు. కొంతమంది తమ ఆరాధనా కూటములు ప్రజలకు ఆకర్షణీయముగా లేక ఆధునికముగా ఉండు నిమిత్తము వాటిని ఆ ప్రకారము రూపొందిస్తారు. తద్వారా మనకు కనబడేది ఒక పాటల పోటీ లేక టి.వి. కార్యక్రమము లేక డిస్కో క్లబ్‌లోనున్న సంగీతమేగాని నిజమైన దైవారాధన ఉండదు. దావీదు లేఖనములకు విరుద్ధమైన ఫిలిష్తీయుల ఉపాయమును పాటించి క్రొత్త బండిని తయారు చేయించుట వలన దేవుని తీర్పు వారిమీదికి వచ్చింది. అంతట ఉజ్జీవముకు బీట కలిగింది. లోకసంబంధమైన ఆలోచనలు మరియు ఉపాయములు పాటించి దేవుని సన్నిధిని పోగొట్టుకొనకుండా జాగ్రత్త వహిద్దాము. దేవుని సన్నిధిని మరియు ఉజ్జీవమును మన మధ్యకు ఇలా రప్పించగలము? అవి క్రొత్త బళ్లు లేక క్రొత్త ఉపాయములు లేక ఆధునిక వినోద కార్యక్రమముల ద్వారా జరగదు. మన జీవితము మరియు పరిచర్య ద్వారానే దేవుని సన్నిధిని మన మధ్యకు తీసుకొని రాగలము (యిర్మీయా 6:16). దావీదు లేఖనములననుసరించి లేవీయుల చేత నిబంధన మందసమును మోయించాలని నేర్చుకొనెను. అదే విధముగా నేటి ప్రభువు సేవకులు కూడా తమ జీవితములు మరియు పరిచర్యలపై దేవుని సన్నిధిని మోపి పరిశుద్ధాత్మ వలన దానిని మనుష్యుల మధ్యకు తీసుకొనిరావలసియున్నారు. ఒక పద్ధతి, తలాంతు లేక ఏ ఫిలిష్తీయుల బండిపైనా మన నమ్మిక యుంచరాదు.



ఆరాధనా కూటముల కొరకైన సరియైన క్రమమును తెలుసుకొనుటకు అనేక సంఘములు లేఖనములను పరిశోధించక యుంటారు. కొన్ని సంఘములైతే లోక సంబంధమైన సంగీత వినోద కార్యక్రమముల వైపుకి తూగుతారు. తద్వారా జన సమనసమూహములను వారివైపుకి ఆకర్షించుకుంటారు. లేఖనములను అనుసరించినప్పుడు లోకస్తులే మనయొద్దకు ఆకర్షింపబడతారు. మరికొన్ని సంఘములు లోకపద్ధతిని అనుకరింపక పోయినను, లోకపద్ధతిని అనుకరించు సంఘములను అనుకరిస్తారు. అయితే మనము దేవుని వాక్యమును విని తోకగా కాక తలగా ఉండవలసిన వారమని గ్రహించి, లోకమును నడిపించవలసింది సంఘమేనని గుర్తించి ఆ ప్రకారము మనము సరియైన నమూనాను లోకానికి అందించాలి (ద్వితీ 28:13).

## సమతూకముగల బృందపరిచర్య యొక్క ప్రాముఖ్యత

1దిన 15, 16లో దావీదు ఏర్పరచిన సరియైన క్రమమును గూర్చి చూస్తాము. ఇది బృంద పరిచర్య. అనగా వారందరూ కలిసి కట్టుగా మందసమును తీసుకొనివచ్చుట. రాజైన దావీదు ఆ కూటముకు ప్రధాన నాయకుడు. అటువలె మనము కూడా ప్రధాన కాపరి లేక బృంద నాయకుని కలిగియుండాలి. అనేకమంది సమాన స్థాయిలో నున్న నాయకులున్నప్పుడు పరిస్థితి పక్షవాతము చెందినట్లుగా ఉంటుంది. అలాంటి సమయములలో గలిబిలి చోటు చేసుకుంటుంది. ఒక సమయానికి ఒక వ్యక్తే నాయకత్వము వహిస్తే గాయకులు మరియు సంగీత వాయిద్యకులు ఐక్యతకలిగి తనను వెంబడించగలరు. వేరొకరికి ప్రభువేదైనా ప్రత్యక్షతనిస్తే ఆ ప్రకారము నడిపించమనికోరితే తాను ముందంజ వేసినప్పుడు మొదటి వ్యక్తి ప్రక్కకు తప్పుకోవలసియుంటుంది (1 కొరింథీ 14:29-33).

ప్రధాన నాయకునితో కూడి పరిపక్వత చెందిన సమతూకము గల బృందమును మనము కట్టినప్పుడే దేవుని నిబంధన మందసమును తిరిగి తీసుకొని రాగలము. మరియు మన కూటములలో దేవుని ఆత్మ స్వతంత్రముగా పనిచేయగలదు. అనేకమంది లేవీయులు పనిచేయుట ద్వారా నిబంధన మందసమును తిరిగి దేవుని ప్రజల మధ్యకు తేగలిగిరి. వారితో కూడ పాటలు పాడుటకు మరియు సంగీత వాయిద్యములు వాయించుటకు అనేకులైన లేవీయులు నియమింపబడిరి. మన దినములలో కూడ పరిచారకులు, గాయకులు, సంగీత వాయిద్యకులు కలిసి పనిచేసినప్పుడే సంఘములోనికి దేవుని యొక్క మహిమను తేగలము. దేవుని చేత పిలువబడిన ప్రతి వ్యక్తి ఏదో ఒకరకముగా తన పాలిచేయుటకు సమర్థత నొందియుంటాడు.

అలా చేసినప్పుడు సమతూకముగల బృందము ఏర్పడుతుంది. అందరూ కలిసి పనిచేసినప్పుడు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెంది క్రీస్తుకు గల సంపూర్ణతకు ఎదుగుతుంది (ఎఫెసీ 4:11-13).

## మందసము ముందుకు కొనసాగుట ఉజ్జీవము పునరిత్థరింపబడుట

1దిన15:14 నుండి 16:37 వరకు చదవగా నిబంధన మందసము యెరూషలేము వరకు ఎలా పయనమయినదో మనము చూడగలము. ఏర్పడిన బీటను దావీదు బాగుచేసిన పిమ్మటే ఈ కార్యము జరిగింది. మందసము లేవీయుల చేత మోయబడి సీయోను పర్వతమందున్న దావీదు ప్రత్యక్షపు గుడారములో నిలువ బెట్టబడింది (1దిన 15:1, 16:1, 2దిన 5:2). ఇక్కడ దేవుని మందసము దేవుని ప్రజల మధ్య విశ్రమించి మరొకసారి దేవుని యొక్క మహిమ మరియు సన్నిధి ప్రత్యక్ష పరచబడింది. సీయోను పర్వతముపై దావీదు తన ఆరాధనా క్రమమును నెలకొల్పి నిరంతర సంగీతమును మరియు గానములను ఏర్పరచెను (1దిన 16:4-37). ఈ స్థలమందే దేవుని ఆత్మ వలన దావీదు, ఆసాపు మరియు ఇతరులకు కీర్తనలు అనుగ్రహింపబడెను. అయితే ఈ అనుభవము నేటి దినములలో కూడా కలిగియుండగలము. దేవుని సంఘము ద్వారా దావీదు ప్రత్యక్షపు గుడారమును పునః నిర్మించుకుంటానని దేవుడు వాగ్దానము చేసారు. అయితే ఏర్పడిన బీటలను బాగుచేసినప్పుడు ఈ ఉజ్జీవము మనయందు ప్రారంభమై కొనసాగుతుంది. మనల్ని మనము పవిత్రపరచుకొని బీటలను బాగు చేయుటకు ప్రభువు మనల్ని వాడుకొనును గాక. తద్వారా అభిషేకింపబడిన సంగీతము మరియు ఆరాధన పునఃనిర్మించబడి దేవుని యొక్క ప్రజలకు ఉజ్జీవము కలిగి ప్రభువైన యేసు క్రీస్తుకు మహిమ కలుగును గాక. "పడిపోయిన దావీదు గుడారమును ఆ దినమున నేను లేవనెత్తిగాని గోడను బాగుచేసి దానిపోయిన చోట్లను బాగుచేసి, ఎదోము శేషమును నా నామము ధరించిన అన్య జనులందరిని నా జనులు స్వతంత్రించుకొనునట్లు పూర్వపు రీతిగా దానిని మరల కట్టుదును; ఈలాగు జరిగించు యెహోవా వాక్కు ఇదే" (ఆమోసు 9:11-12). "పూర్వకాలము నుండి పాడైపోయిన స్థలములను నీ జనులు కట్టెదరు. అనేక తరముల క్రిందట పాడైపోయిన పునాదులను నీవు మరల కట్టెదవు. విరుగబడిన దానిని బాగు చేయువాడవనియు దేశములో నివసించునట్లుగా త్రోవలు సిద్ధపరచువాడవనియు నీకు పేరు పెట్టబడును"(యెషయా 58:12).





# తొమ్మిదవ అధ్యాయము
## సీయోనుకు

ప్రభువుతో మనము ఎంత సన్నిహితముగా నడుస్తామో అంతగా ప్రభువు తన ప్రజలను ఒక ఉన్నత పిలుపు కొరకై ఆహ్వానిస్తున్నాడని గ్రహిస్తాము. ఇశ్రాయేలీయుల కొరకు దేవుని పిలుపులోగల అత్యున్నత స్థానము సీయోను పర్వతము. కీర్తనలలో మనమిలా చదవగలము, "యెహోవా సీయోనును ఏర్పరచుకొనియున్నాడు. తనకు నివాస స్థలముగా దానిని కోరుకొని యున్నాడు" (కీర్తన 132:13). "షాలేములో ఆయన గుడారమున్నది. సీయోనులో ఆయన ఆలయమున్నది"(కీర్తన 76:2). "పరిపూర్ణ సౌందర్యము గల సీయోనులో నుండి దేవుడు ప్రకాశించుచున్నాడు" (కీర్తన 50:2). సీయోను పర్వతముపై దావీదు ప్రత్యక్షపు గుడారమును నిర్మించి ఆరాధన కూటముల కొరకైన గానములను మరియు సంగీతమును రూపొందించెను. సీయోను సర్వలోకమునకు ఆనందదాయకముగా ఉంటుందని దేవుని వాక్యములో చెప్పబడుతుంది. కాగా సంగీతము మరియు గానముల యొక్క ప్రాముఖ్యతను దీనిద్వారా గ్రహించగలము (కీర్తన 48:2, 87:7).

పాత నిబంధనలో దేవుని ప్రజలకు యెరూషలేమందున్న సీయోను పర్వతము బహు ప్రాముఖ్యమైన స్థలము. అయితే నూతన నిబంధన సంఘములో దీనియొక్క ఆత్మీయ నెరవేర్పును కూడా మనము చూడవలసియున్నాము. ప్రవక్తయైన ఆమోసు దావీదు యొక్క ప్రత్యక్షపు గుడారము తిరిగి కట్టబడుతుందని దర్శన రూపములో చూచెను. సంఘము విషయములో ఈ నెరవేర్పు సంభవిస్తుందని ఆది సంఘ నాయకులు గుర్తెరిగిరి. సంఘము ద్వారా సీయోను యొక్క పునరుద్ధరణ జరుగుతుందని యెషయా 2:2-3లో ప్రవచింపబడుతున్నది, "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేములో నుండి యెహోవా వాక్కు బయలు వెళ్లును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి, ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు" (యెషయా 2:2-3).



సీయోను యెరూషలేములో కేవలము ఒక పర్వతము కాదు. నిజమైన సీయోను పరలోకమందున్నది. అందును బట్టి సంఘములలో సీయోనును గూర్చిన ఆత్మీయ నెరవేర్పు మనము చూడవలసియున్నాము. హెబ్రీ 12:22 మనమిలా చదవగలము, "ఇప్పుడైతే సీయోనను కొండకును, జీవముగల దేవుని పట్టణమునకు, అనగా పరలోకపు యెరూషలేమునకును, వేవేల కొలది దేవదూతల యొద్దకును…".

పరలోకపు సీయోనులో సంగీతము మరియు గాన ప్రతిగానములు ఉండునని ప్రకటన 14:1-3లో చదవగలము. "మరియు నేను చూడగా, ఇదిగో, ఆ గొఱ్ఱెపిల్ల సీయోను పర్వతముమీద నిలువబడియుండెను. ఆయన నామమును ఆయన తండ్రి నామమును నొసళ్లయందు లిఖింపబడియున్న నూట నలువది నాలుగువేల మంది ఆయనతో కూడ ఉండిరి. మరియు విస్తారమైన జలముల ధ్వనితోను గొప్ప ఉరుము ధ్వనితోను సమానమైన యొక శబ్దము పరలోకములో నుండి రాగా వింటిని. నేను వినిన ఆ శబ్దము వీణెలు వాయించుచున్న వైణికుల నాదమును పోలినది. వారు సింహాసనము ఎదుటను ఆ నాలుగు జీవుల ఎదుటను పెద్దల ఎదుటను ఒక క్రొత్త కీర్తన పాడుచున్నారు; భూలోకములో నుండి కొనబడిన ఆ నూట నలువది నాలుగువేల మంది తప్ప మరి ఎవరును ఆ కీర్తన నేర్చుకొన జాలరు".

సీయోను యందు దావీదు నెలకొల్పిన సంగీతము మరియు గానములలోనికి మనము ప్రవేశించనాశించినప్పుడు మనము నిజముగా పరసంబంధమైన ఆరాధనలోనికి ప్రవేశిస్తున్నామని గ్రహించాలి.

సీయోను పర్వతము పాతనిబంధన దేవుని ప్రజలకు ఉన్నతమైన పిలుపుగా ఉందని మనము చూస్తున్నప్పటికి అనేకులైన ఇశ్రాయేలీయులు ఆ స్థలమును చేరుకొనలేదు. అదే విధముగా ప్రభువు మనకొరకు ఉన్నతమైన ఆత్మీయ జీవితము మరియు ఆరాధనను అందిస్తున్నాడు. కాని అనేకమంది క్రైస్తవులు ఈ ఉన్నత పిలుపును చేరుకొనరు. పాతనిబంధనలో ఇశ్రాయేలీయులు నివసించిన ప్రతీ స్థలమును గూర్చి పరిశీలనగా చూస్తే ఆ స్థలములో వారికి కలిగిన ఆధ్యాత్మిక అనుభవములను బట్టి నేటి క్రైస్తవులైన మనకు కొంత అవగాహన కలుగుతుంది.

### ఐగుప్తునుండి వాగ్దానము చేయబడిన దేశము వరకు

దేవుని ప్రజలు మొదట ఐగుప్తులో జీవించిరి. అది పాపసంబంధమైన లోకమునకు సాదృశ్యము. తమ బంధకముల నుండి విడిపించబడకముందు నీళ్ల కొరకు కూడా వారు పనిచేయవలసియుండెను. ద్వితీ 11:10 తమ కాళ్లతో నీళ్లు

తోడుకోవలసియుండిరని చెప్పబడుతుంది. అదే విధముగా బంధకములలోనున్న క్రైస్తవుడు పరిశుద్ధాత్మ నీళ్లను పొందుకొనుటకు మిక్కిలి ప్రయాస పడాలి. కాబట్టి శరీర సంబంధమైన ప్రయత్నముతో పరిశుద్ధాత్మ నీళ్లను తోడుకొన ప్రయత్నించరాదు. దానికంటే శ్రేష్ఠమైన దానిలోనికి ప్రభువు మనలను నడిపించును గాక.

ద్వితీ 11:11లో వాగ్దానపు దేశమందు ఇశ్రాయేలీయులు నీళ్లు తోడుకోనవసరము లేకపోయెను. పరలోకము నుండి దిగివచ్చిన వర్షమే వాళ్లకు నీళ్లుగా అనుగ్రహింపబడెను. మన ఆరాధనలో కూడా మనము ఇట్టి అనుభవమును కలిగియుండాలి. మన తలలెత్తి నోర్లుచాపి పరలోకపు వర్షపు నీళ్లతో ప్రభువు మనల్ను నింపును గాక. ఇక్కడ శరీరక్రియలకు చోటులేదు. కేవలము దేవుడే పరలోకపు వర్షమును మనమీదికి క్రుమ్మరిస్తున్నాడు.

## ఇకాబోదు కాలములో దేవుని ప్రజలు

యాజకుల పాపములు దేవుని తీర్పును ఏలీ ప్రధాన యాజకుడైన దినములలో దిగివచ్చినట్లు మన మిదివరకు చదువుకున్నాము. నిబంధన మందసము దేవుని సన్నిధికి మరియు మహిమకు సూచనయైయుండగా అది మోషే ప్రత్యక్షపు గుడారమును విడిచిపోయెను. అయితే వారు తమ అర్చనాచారాదులు అక్కడ కొనసాగించినప్పటికి దేవుని సన్నిధి వారితో కూడ లేకపోయెను. వారు వాగ్దానపు దేశములో నివాసమున్నప్పటికి తమ పాపము వలన వారి ఆరాధన విసర్జింపబడెను. ఇట్టి ఆత్మీయ పరిస్థితిలో మనముండకుండా ప్రభువు మనకు సహాయము చేయును గాక. కేవలము నటనతో కూడిన పరిచర్య మన కూటములలో కొనసాగరాదు. పాపము వలన ప్రభువు సన్నిధి మనల్నువిడిచియుంటే ఆయనకు మరల సమీపమగుటకు ప్రయాస పడవలెను.

## ఫిలిష్తీయులతో జీవించుట

దేవుని సన్నిధి ఫిలిష్తీయులతో ఉన్నట్లు మనము చూడగలము. అంతట వారు ప్రభువుకు భయపడి ఆయన శక్తిని బట్టి ఆరాధన అర్పణలను అర్పించిరి. అయితే లేఖనములకు విరుద్ధమైన రీతిలో ఒక బండిని తయారుచేసి నిబంధన మందసమును దానిపై పెట్టినప్పటికి, ఫిలిష్తీయుల బండిని ప్రభువు దీవించెను. ఎందుకనగా సరియైన విధానమును తెలుసుకొనుటకు మోషేద్వారా కలిగిన లేఖనములు వారియొద్దలేవు.



వారి అజ్ఞానము పట్ల ప్రభువు కనికరము చూపించి తన శక్తిని వారికి ప్రదర్శించి అద్భుత రీతిలో మందసమును తిరిగి ఇశ్రాయేలుకు నడిపించుకొనెను. దేవుని సంపూర్ణ చిత్తములో లేకపోయినప్పటికి దేవుడు కొన్నిసార్లు ఆయావాటిని అనుమతిస్తాడు మరియు దీవిస్తాడు (మత్తయి 19:8, సంఖ్యా 14:2, 28; న్యాయాధి 16:1-3, 1రాజు 13:18, 20, కీర్తన 106:15). ఎవరో ఏదో చేస్తే దేవుడు వారిని దీవించాడని చూసి, వారిని అనుకరించుట ద్వారా అట్టి దీవెన మనకొస్తుందని గ్యారంటీ లేదు. ఒకేదానిని రాజైన దావీదు రెండవసారి చేయప్రయత్నించినప్పుడు దేవుని తీర్పు తనమీదికి వచ్చెను.

## మందసమును కళ్లము యొద్దకు తీసుకొని వచ్చుట

రాజైన దావీదు ఫిలిష్తీయుల పద్ధతి చొప్పున మందసమును తీసుకొని, సీదోను కళ్లము యొద్దకు రాగానే దేవుని తీర్పు వారి మీదికి వచ్చెను. తన ప్రజల నుండి దేవుడు మరింత ఉన్నత స్థాయిని కోరుచున్నాడు. దేవుని వాక్యము నుండి అధిక వెలుగును పొందుకున్నవారు మరింత దేవునికి లెక్క అప్పగించుకొన్నవారైయున్నారు.

ఫిలిష్తీయులు ప్రయోగించిన బండిని దేవుడు దీవించెను. కాని ఆ పద్ధతిని అనుకరించిన దావీదుపై దేవుని తీర్పు వచ్చెను. అదే విధముగా ఒకానొక పద్ధతిలో రక్షణలేని వ్యక్తికి దేవుడు తన శక్తిని చూపించవచ్చును. అదే విధముగా ఆయన తన ప్రజలకు చేస్తాడని మనమనుకొనలేము. నేను పలనా విధముగా రక్షింపబడ్డాను గనుక ఆ పద్ధతినే ప్రభువు కొనసాగిస్తాడని కొందరు వాదిస్తారు. అయితే దేవుడు మనల్ని కళ్లము యొద్ద అనుభవములోనికి మనల్ను రప్పించినప్పుడు మన జీవితములు మరియు పరిచర్యలో నున్న మిశ్రిమమును ఆయన తొలగింప ప్రయత్నిస్తాడు.

## సీయోనుకు ఏతెంచుట

సీయోను పర్వతము మీదికి దావీదు మందసమును తీసుకొనివచ్చి తాను నిర్మించిన గుడారములో నెలకొల్పెను. దేవుని మహిమను మరియు సన్నిధిని విశ్రమించు స్థలమునకు తీసుకొనిరావాలంటే మొదట సీయోనుకు ఏతెంచుట మనము ఎరిగి యుండాలి. దీని విషయమై కీర్తన 84:5-7లో ఇలా చదవగలము, 'నీ వలన బలము నొందు మనుష్యులు ధన్యులు యాత్ర చేయు మార్గములు వారికి అతిప్రియములు. వారు బాకాలోయలోబడి వెళ్లుచు దానిని జలమయముగా

చేయుదురు. తొలకరి వాన దానిని దీవెనలతో కప్పును. వారు నానాటికి బలాభివృద్ధి నొందుచు ప్రయాణము చేయుదురు. వారిలో ప్రతివాడును సీయోనులో దేవుని సన్నిధిని కనబడుదురు". మన హృదయములలో సీయోను కొరకైన రహదారులు మనము కలిగియుండాలి. దీని విషయమై యెషయా 35లో స్పష్టముగా చదవగలము. గానములు మరియు నిత్య సంతోషముతో ఈ రహదారులు సీయోనుకు రప్పిస్తాయి, "అక్కడ దారిగానున్న రాజమార్గము ఏర్పడును అది పరిశుద్ధ మార్గమనబడును. అది అపవిత్రులు పోకూడని మార్గము. అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును. మూడులైనను దానిలో నడుచుచు త్రోవను తప్పక యుందురు. అక్కడ సింహముండదు. క్రూరజంతువులు దాని ఎక్కవు, అవి అక్కడ కనబడవు విమోచింపబడినవారే అక్కడ నడచుదురు. యెహోవా విమోచించినవారు పాటలు పాడుచు తిరిగి సీయోనుకు వచ్చెదరు. వారి తలలమీద నిత్యానందముండును. వారు ఆనంద సంతోషములు గల వారై వచ్చెదరు. దుఃఖమును నిట్టూర్పును ఎగిరిపోవును" (యెషయా 35:8-10).

కీర్తన 2:3-5లో దిగువ ప్రశ్నలున్నవి, "యెహోవా పర్వతమునకు ఎక్కదగిన వాడెవడు? ఆయన పరిశుద్ధ స్థలములో నిలువదగినవాడెవడు? వ్యర్థమైన దానియందు మనస్సు పెట్టకయు, కపటముగా ప్రమాణము చేయకయు, నిర్దోషమైన చేతులును శుద్ధమైన హృదయమును కలిగియుండువాడే, వాడు యెహోవావలన ఆశీర్వాదము నొందును. తన రక్షకుడైన దేవుని వలన నీతిమత్వము నొందును". ఆ ప్రశ్నలకు పరిశుద్ధతయే సమాధానమని దావీదు స్పష్టము చేయుచున్నాడు. సీయోనును చేరుకొనుటకు ఇది అవసరము.

సీయోను పర్వతము ఎక్కుటకు దేవుని పరిశుద్ధ సన్నిధిలో నిలచుటకు కావలసినవి నాలుగు. పవిత్రమైన చేతులు (స్వచ్ఛమైన క్రియలు). మరియు పరిశుద్ధమైన హృదయము, విగ్రహములను ఆరాధింపక తప్పుడు సాక్ష్యమును చెప్పకయుండువారు.

## సీయోను పర్వతమందు దావీదు ప్రత్యక్షపు గుడారమందు నివాసముండుట

దేవుని మహిమ మరియు సన్నిధిలోనికి ఏతెంచుట అద్భుతకరమైన యోగ్యత. దీనికి దావీదు ప్రత్యక్షపు గుడారము సాదృశ్యము. అయితే దీనికంటే అద్భుతకరమైన ఆహ్వానము మనకొరకై భద్రపరచబడియున్నది. దావీదు ప్రత్యక్షపు గుడారములోనికి



ప్రవేశించి అక్కడ నివాసముండుట కంటే శ్రేష్ఠమైనది మనకొకటున్నది. ఉన్నత పిలుపు విషయమై కీర్తన 15:1లో దావీదు వ్రాస్తున్నాడు, "యెహోవా, నీ గుడారములో అతిథిగా నుండదగినవాడెవడు? నీ పరిశుద్ధ పర్వతము మీద నివసింపదగినవాడెవడు?". మిగిలిన అధ్యాయమంతటిలో ఈ అనుభవములో నిలిచియుండుటకు కావలసిన షరతులను తెలియజేస్తున్నాడు. దేవుని పర్వతమును ఎక్కుటకు నాలుగు షరతులుండగా అందులో నిలిచియుండుటకు పదకొండు షరతులు గలవు. దేవుని యందు ఉన్నత స్థాయి లోనికి ఎదుగుచున్నకొలదీ మననుండి ఆయన మరింత ఆశిస్తూ ఉంటాడు.

## మనమెక్కడ జీవించ నిష్టపడుచున్నాము

ఆత్మీయులుగా మనమెక్కడ జీవించ నిష్టపడుచున్నామనునది ఒక ప్రశ్న. ఫిలిష్తీయులతో కలిసి జీవిస్తున్న వారమైతే దేవుడు మిశ్రమముతో నిండుకొన్న అనేక వాటిని దీవించవచ్చును. అది కేవలము ఆయన శక్తిని మనకు ప్రదర్శించుటకే. అయితే రక్షింపబడి దేవునితో ముందుకు సాగుచున్నప్పుడు దేవునిచేత శిక్షణ పొంది క్రమపరచబడు అనుభవములు మనము చవిచూడవచ్చును. అంటే సీదోను కళ్లముయొద్ద ఇశ్రాయేలీయులకు జరిగిన అనుభవము మనకు కలగవచ్చును. మరింత ఉన్నత స్థాయికెదిగి ప్రభువును ప్రత్యక్షపు గుడారములో దర్శించాలని ఇష్టపడువారు కీర్తన 24లో నున్న నాలుగు షరతుల చేత తమను తాము పవిత్రపరచుకోవాలి. అయితే ఆ ప్రత్యక్షపు గుడారములో నిత్యనివాసము చేయనిష్టపడువారు కీర్తన 15లో నున్న ఇతర ఉన్నత షరతులను పాటించాలి. అయితే ఇలా జీవించువారు చివరికి జీవముగల దేవుని పట్టణమైన సీయోను పర్వతములో స్థిర నివాసులవుతారు (హెబ్రీ 12:22). దావీదు ప్రత్యక్షపు గుడారములో నివాసముండుట అనగా క్రీస్తుతో కూడ పరసంబంధమైన స్థలములలో కూర్చుండబెట్టబడుట.

## అనేకమంది దేవుని దీవెనలలో కొంతభాగముతోనే తృప్తినొందుతారు

నునువెచ్చని స్థితిలోనున్న లవొదికియ క్రైస్తవుడు 'నేను ధనవంతుడను నాకే లేమీ లేదు' అంటాడు (ప్రకటన 3:17). ఈ తృప్తి నొందిన స్థితికి కారణము దేవునితో మరింత సన్నిహితంగా వెళ్లడానికి మరింత వెలను చెల్లించుటకు ఇష్టపడకపోవుట. అనేకమంది క్రైస్తవులు అగ్నిచేత పవిత్రపరచబడిన సువర్ణమును కొనుక్కొనుటకు

ఇష్టపడరు. ఎందుకంటే సిలువవేయబడిన అనుభవము వారికి అక్కరలేదు (ప్రకటన 3:18, 1 పేతురు 1:6-7, గలతీ 2:20). ఈ లోకముతో రాజీపడక ఈ లోక సంబంధమైన వాటిని ప్రేమింపకయుండునట్లు ప్రభువు మనకు సహాయము చేయును గాక. దావీదుకువలె మనమిలా ప్రార్థింపనవసరమున్నది, "దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలుసుకొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము" (కీర్తన 139:23-24). అంతేగాక కీర్తన 86:11 మరియు 27:4 ప్రకారము మనము ప్రార్థించవలసియున్నాము, "యెహోవా, నేను నీ సత్యము ననుసరించి నడుచుకొనునట్లు నీ మార్గమును నాకు బోధింపుము. నీ నామమునకు భయపడునట్లు నా హృదయమునకు ఏకదృష్టి కలుగజేయుము". "యెహోవా యొద్ద ఒక్కవరము అడిగితిని. దానిని నేను వెదకుచున్నాను యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవిత కాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింప గోరుచున్నాను".

ఆయన ఉన్నత పిలుపుకొరకైన దర్శనము ప్రభువు మనకు అనుగ్రహించును గాక. తద్వారా మన జీవితములలో మరియు పరిచర్యలలో ఉన్న మిశ్రమమునుండి మనము విడుదల నొంది మనము సీయోనులో జీవింతుము. దావీదుకు వలె మనమిలా ప్రార్థిద్దాము, "నీ వెలుగును నీ సత్యమును బయలు దేరజేయుము; అవి నాకు త్రోవచూపును. అవి నీ పరిశుద్ధ పర్వతమునకును నీ నివాస స్థలములకును నన్ను తోడుకొని వచ్చును" (కీర్తన 43:3). దావీదు ప్రత్యక్షపు గుడారములో ఆత్మీయ ఆరాధన చేస్తూ దేవుని హృదయానుసారమైన స్త్రీ పురుషుల వలె మనమవుదముగాక. అటువంటి ఆత్మీయ అనుభవమును కలిగియున్నప్పుడు మన పరిచర్యలు దేవుని సన్నిధితో నిండుకొనినవై ఆయన ఆత్మాభిషేకము మనమధ్య పొంగుపొర్లుతుంది. అప్పుడు తాజాయైన తైలముతో నేను అభిషేకింపబడియుంటినని కీర్తనాకారుడు 92:10లో అన్నట్లు మన మనగలము. అప్పుడు దావీదుకువలె అనేకులను అభిషేకింపబడిన సంగీతము మరియు దైవారాధనలోనికి నడిపించగలవారమవుతాము.

## సంగీత వాయిద్యకులకు సూచనలు

1. సమయానికి కూటము నారంభించుటకు సిద్ధపడండి.
2. కూటముకు కనీసము 15 నిముషముల ముందు ప్రార్థనలో నుండి మీ హృదయమును సిద్ధపరచుకొనండి. ప్రజలు ఆలయములోనికి ప్రవేశించిన తరువాత సౌండ్‌చెక్స్ చేయకండి. దేవుని సన్నిధిలోనికి వారిని నడిపించ నాశించండి.



3. కూటముకు 5 లేక 10 నిముషములకు ముందే వాయించుట నారంభించి ప్రజల హృదయములను స్తుతి ఆరాధన కొరకు సిద్ధపరచండి.
4. జాప్యములు, అసందర్భమైన శబ్దములు చేయకుండా కేవలము ప్రభువును కలుసుకునే ప్రయత్నమే చేయండి.
5. నాయకుడు ఇచ్చే సూచనల విషయమై ధ్యాస కలిగియుండండి.
6. పాటకు మరియొక పాటకు మధ్యలో సంగీత వాయిద్యములు వాయించుట కొనసాగించండి. తద్వారా ప్రవాహము కొనసాగుతుంది. ఆ సమయములో ఎవరైనా ప్రవచింపగోరితే వారలా ప్రవచింపవచ్చును.
7. ప్రతీ పాటను ముందుగా ప్రాక్టీస్ చెయ్యాలి.
8. జోరుగా సాగే పాటలు జోరుగానే పాడండి.

## ఆరాధన నడిపించు నాయకులకు సూచనలు

1. సమయానికి ప్రారంభించుటకు సిద్ధపడియుండండి.
2. జాప్యములు అసందర్భమైన శబ్దములు చేయకండి.
3. మైకులో మరీగట్టిగా పాడకండి. అందరూ మీతో కలిసి పాడేటట్లుగా మీరుండాలి. ఆరాధన కూటములో నాయకుడు సోలో సింగింగ్ చేయరాదు. అందరికి తెలిసిన పాటలు పాడినప్పుడు వారందరూ కూడా మీతో ఏకీభవిస్తారు.
4. స్తుతి గీతములతో ప్రారంభించి ఆరాధనా గీతములతో ప్రజలను నడిపించండి. స్తుతి గీతములు జోరుగా ఉండి సంతోషాన్ని ప్రేరేపించేవిగా ఉండాలి. పాట ప్రారంభించకముందు మీరేపాట పాడుచున్నారో తెలియజేయండి. క్లుప్తమైన కూటములలో మూడు లేక నాలుగు స్తుతి గీతములు మరియు రెండు లేక మూడు ఆరాధన గీతములే పాడండి. దీర్ఘకాల కూటములలో నాలుగు లేక ఐదు స్తుతి గీతములు మరియు మూడు లేక ఐదు ఆరాధనా గీతములు పాడండి. దేవుని ఆత్మకదలిక ఉందని మీరెరిగి దైవాభిషేకము అక్కడ ప్రవహిస్తుందని మీరు స్పర్శించగలిగినప్పుడు సమయాన్ని చూడక ఆరాధన కొనసాగించండి.
5. పాటలను నిర్విరామముగా పాడండి. అందరూ మీతో కలిసి ఏకీభవించులాగున ఈ స్తుతి కూటము ఉండాలి.

6. పాటల జాబితాను ముందుగా తయారు చేసుకోవాలి. వాటిని సంగీత వాయిద్యకులందరికీ అందించాలి. ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్ ఆపరేటర్‌కు కూడా పాటల జాబితాను ఇవ్వండి. కొందరికి ఎక్కువ ప్రాక్టీస్ అవసరము. అలాంటి వారు ముందుగా ప్రాక్టీస్ చేసుకోవడం మంచిది.

7. జాబితాలో లేనిపాటను పాడుటకు దేవుని ఆత్మ ప్రేరేపిస్తే పరిశుద్ధాత్మునికి లోబడి అలా పాడుటకు వెనుకాడవద్దు. కాని మీతో కలిసి సంగీత వాయిద్యకులు వాయించగలిగియుండాలి.

8. పాటల జాబితాలో నున్న పాటలనే పాడాలి. అప్పుడప్పుడూ క్రొత్తపాటను ఏదైనా నేర్పించవచ్చును. అది స్తుతి గానమైతే స్తుతి కూటముకు ముందే దానిని సభ్యులందరికీ నేర్పించండి. అది ఆరాధన కూటమైతే సంఘస్థులు కూర్చున్న తర్వాత వారికి నేర్పించండి.

9. తంబుర వాయించు వాడవైతే దానితో కూటము నడిపించుట బహు ప్రయోజనకరము.

- సమాప్తము -





## కృతజ్ఞతలు

సిస్టర్ దెబోరా - వ్రాత ప్రతినందు సహాయపడినందుకు

మెల్కిసెదెక్ - కవర్ పేజీ డిజైన్

నీలిమ - డి.టి.పి. చేసినందుకు